01-07Pg1exHMNWJQEVRS_01-07Pg1exHMNWJQEVRS.qxd 01/Jul/26 12:01 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
fb.com/vaartha Digital
Published from Guntur, Ongole, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
1-7-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 151 పేజీలు: 12 వెల: 6.50

భారత్ షేరునే కొనుగోలు చేస్తా: స్టీవ్ డైన్స్ 9లో

కొత్త ఆర్మీ చీఫ్ ధీరజ్ సేథ్ బాధ్యతల స్వీకరణ



మంగళవారం మహారాష్ట్ర సిఎం ఫడ్నవిస్‌తో భేటీ అయిన డి.సిఎం పవన్

## ఫడ్నవిస్‌తో పవన్ భేటీ

### తూర్పు కనుమల్లో పులుల సంరక్షణ చర్యలపై చర్చ

### ఎపికి రెండు ఆడపులులు ఇస్తున్నందుకు కృతజ్ఞతలు

**విజయవాడ,జూన్ 30,ప్రభాతవార్తప్రతినిధి:** వన్యప్రాణి సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ లక్ష్యాల సాధనలో మహారాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం, ఇతర భాగస్వామ్య సంస్థలతో కలిసి మరింత సమన్వయంతో ముందుకు వెళ్తామని ఉపముఖ్య మంత్రి పవన్ కల్యాణ్‌అన్నారు. మంగళవారం మహారాష్ట్ర >>2


# వికసిత్ భారత్ మన లక్ష్యం

### గిరిజన సమాజంలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలి

### నాణ్యమైన విద్య సమాజంలోని అన్ని వర్గాలకు చేరాలి: రాష్ట్రపతి ముర్ము

### విద్యార్థులను భవిష్యత్ నాయకులుగా తీర్చిదిద్దుతాం

### విశాఖలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో మంత్రి లోకేష్



మంగళవారం విశాఖలో గిరిజన విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో పాల్గొన్న రాష్ట్రపతి ముర్ము, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఎపి గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రి లోకేష్

**విశాఖపట్నం జూన్ 30 ప్రభాతవార్త:** గిరిజన సమాజంలో ఆత్మవిశ్వాసం, నాయకత్వ పటిమను పెంపొందించే కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం ఎదగాలి అని రాష్ట్రపతి ద్రౌపది ముర్మ తెలిపారు.మంగళవారం బీచ్ రోడ్‌లో గల హోటల్లో గిరిజన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఎపి గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ ఈ గిరిజన విశ్వవిద్యాలయానికి ఎన్నో ప్రత్యేక బాధ్యతలు ఉన్నాయని గుర్తుచేశారు. గిరిజన సమాజంలో ఆత్మవిశ్వాసాన్ని, నాయకత్వ లక్షణాలను విధాన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాలను పెంపొందించే ఒక ప్రధాన కేంద్రంగా ఈ విశ్వవిద్యాలయం రూపాంతరం చెందుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. సామాజిక న్యాయమే ధ్యేయంగా ఏర్పాటైన ఇటువంటి సంస్థలు.. స్థానిక గిరిజన ప్రాంతాల విద్యా, వైద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అటవీ హక్కుల కోసం క్షేత్రస్థాయిలో పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో వెనుకబడిన, గిరిజన వర్గాల యువత సమగ్ర వికాసానికి, అలాగే ఈ ప్రాంత సమగ్రాభివృద్ధికి ఈ వర్సిటీ విశేష కృషి చేస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

**విద్యార్థులకు దిశా నిర్దేశం**

ఘటికోత్సవం అనేది ప్రతి విద్యార్థి జీవితంలో ఒక మైలురాయి లాంటిదని, ఇది కేవలం సంబరాల రోజే కాకుండా భవిష్యత్తుపై ఒక బలమైన నిర్ణయం తీసుకునేసందర్భమని రాష్ట్రపతి అన్నారు. వేగంగా మారుతున్న ప్రపంచానికి అను >>2

## విద్యా బోధనలో ఎపి భేష్

### విద్యా మంత్రిగా లోకేష్ కృషిని అభినందించిన కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్

### భోగాపురంలోని మోడల్ స్కూలును పరిశీలించిన మంత్రులు

**విజయనగరం (భోగాపురం), జూన్ 30 ప్రభాతవార్త:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కలిసి రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ విజయనగరం జిల్లా భోగాపురంలోని పిఎంశ్రీ ఎపి మోడల్ స్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆధునిక విద్యా బోధన, మౌలిక వసతులను మంత్రులు పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ముందుగా పాఠశాల ప్రాంగణానికి చేరుకున్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సి.పార్వతి, విద్యార్థులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

**పాఠశాలలో ఆధునిక విద్యా బోధన, మౌలిక వసతుల పరిశీలన:** పాఠశాల మొత్తం కలియతిరిగిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ >>2



మంగళవానం భోగాపురం పిఎంశ్రీ మోడల్ స్కూల్‌ను సందర్శిస్తున్న కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్, మంత్రి లోకేష్ తదితరులు

## 28 జిల్లాలకు బిజెపి కొత్త ఇన్‌ఛార్జిలు

### సంస్థాగత నిర్మాణం పటిష్టం: రాష్ట్ర బిజెపి చీఫ్ మాధవ్

**విజయవాడ, జూన్ 30,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో భారతీయ జనతా పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేయడానికి రాష్ట్ర నాయకత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు కొత్త జిల్లా ఇన్‌ఛార్జిలను నియమిస్తూ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఆయన స్పష్టం చేశారు.పార్టీ సిద్ధాంతాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడం, బూత్ కమిటీల బలోపేతం, సంస్థాగత విస్తరణ, సభ్యత్వ నమోదు, ప్రజా సమస్యలపై ఉద్యమాలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం, పార్టీ కార్యక్రమాల సమ >>2

## జన్మతః పౌరసత్వ హక్కు కొనసాగింపు

- అమెరికా సుప్రీంకోర్టు కీలక తీర్పు
- ట్రంప్ ప్రయత్నాలకు అడ్డు కట్ట
- రాజ్యాంగం 14 సవరణ యధాతథంగా అమలు

**వాషింగ్టన్,జూన్ 30:** అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం కొనసాగుతుందని అమెరికా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జన్మహక్కు పౌరసత్వ నిబంధనలను మార్చాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రయత్నానికి సుప్రీంకోర్టు బ్రేక్ వేసింది. మంగళవారం వెలువడిన తీర్పులో, అమెరికాలో అక్రమంగా లేదా తాత్కాలిక వీసాలపై నివసిస్తున్న విదేశీయుల పిల్లలకు పౌరసత్వం నిరాకరించాలని ట్రంప్ జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను కోర్టు తిరస్కరించింది. సుప్రీంకోర్టు 6-3 మెజారిటీతో తీర్పు వెలువరించింది. ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్ నేతృత్వంలోని ధర్మాసనం అమెరికా భూభాగంలో జన్మించిన దాదాపు ప్రతి ఒక్కరికీ పౌరసత్వ హక్కు ఉంటుందని స్పష్టం చేసింది. ఇప్పటికే దిగువ కోర్టులు కూడా ట్రంప్ ఆదేశాలను నిలిపివేసిన విషయం తెలిసిందే. తీర్పులో ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్ మాట్లాడుతూ అమెరికాలో అక్రమంగా లేదా తాత్కాలికంగా నివసిస్తున్న తల్లిదండ్రులకు పుట్టిన పిల్లలు కూడా అమెరికా అధికార పరిధిలోకి వస్తారని, రాజ్యాంగంలోని 14వ సవరణ ప్రకారం వారికి పుట్టుకతోనే పౌరసత్వ హక్కు లభిస్తుందని పేర్కొన్నారు. అమెరికా రాజ్యాంగంలోని 14వ సవరణ ప్రకారం అమెరికాలో జన్మించిన లేదా చట్టబద్ధంగా పౌరసత్వం పొందిన ప్రతి వ్యక్తి అమెరికా పౌరుడేనని స్పష్టంగా పేర్కొంది. అమెరికాలో అక్రమంగా ఉన్న విదేశీయుల పిల్లలు అమెరికా అధికార పరిధిలోకి రారని, అందువల్ల వారికి జన్మహక్కు పౌరసత్వం వర్తించదని వాదించింది.తన రెండోసారి అధ్యక్ష పదవీ కాలం తొలి రోజే ట్రంప్ ఈ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. అక్రమ వలసలను కట్టడి చేసే చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ప్రభుత్వం తెలిపింది. ఈ అంశంపై ఏప్రిల్‌లో జరిగిన వాదనలకు ట్రంప్ స్వయంగా హాజరయ్యారు. ఇదిలా ఉండగా, తీర్పు వెలువడే కొద్ది నిమిషాల ముందు ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్లో జన్మహక్కు పౌరసత్వాన్ని రద్దుచేసే ప్రయత్నాలు సుప్రీంకోర్టు తీర్పుతోనైనా లేదా కాంగ్రెస్‌చట్టం ద్వారానైనా విజయవంతమయ్యే అవకాశం ఉందంటూ వచ్చిన కథనాన్ని పంచుకున్నారు.అమెరికా సుప్రీంకోర్టు తాజా తీర్పుతో జన్మహక్కు పౌరసత్వంపై దశాబ్దాలుగా కొనసాగుతున్న రాజ్యాంగ పరిరక్షణకు మరోసారి బలం చేకూరింది.

# ఖనిజ నిల్వలపై మినరల్ మ్యాపింగ్

### రాష్ట్రానికి గరిష్ట ఆదాయం రాబట్టే యత్నం

### టెక్నాలజీద్వారా ఇసుక తవ్వకాల పర్యవేక్షణ కట్టుదిట్టం

### ఖనిజసంపదపై విస్తృతంగా అధ్యయనం: గనులశాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు



మంగళవారం గనులశాఖపై సమీక్ష నిర్వహిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ జూన్ 30,ప్రభాతవార్తప్రతినిధి:** ఖనిజ సంపద ద్వారా రాష్ట్రానికి గరిష్ట ఆదాయం వచ్చేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. ఆదిశలో కీలక కార్యాచరణ, ప్రయత్నం ఉండాలన్నారు.రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో విలువైన ఖనిజ నిల్వల్ని గుర్తించేలా మినరల్ మ్యాపింగ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. క్రిటికల్ మినరల్స్, బల్క్ మినరల్స్‌తో పాటు విలువైన లోహాలు లభ్యం అయ్యే ప్రాంతాల మ్యాపింగ్ జరగాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వెలికి తీసే ఖనిజాలకు విలువ జోడించేలా ప్రాసెసింగ్ ప్రక్రియను నిర్వహించే అంశంపైనా దృష్టి సారించాలని సూచించారు. క్యాంపు కార్యాలయంలో గనుల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని ఖనిజ సంపదకు సంబంధించి మార్కెట్ క్యాపిటలైజేషన్‌కు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని అన్నారు. రాష్ట్రప్రభుత్వ రంగ సంస్థ ఎపిఎండిసి ద్వారా విలువైన ఖనిజాల మార్కెట్ క్యాపిటలైజేషన్‌కు అవకాశం ఉందన్నారు. దీనిపై నిపుణులతో కలిసి అధ్యయనం చేయాలని సిఎం స్పష్టం చేశారు. బీచ్ శాండ్, రేర్‌ఎర్త్ మినరల్స్, ముడి ఇనుము, మాంగనీస్, అల్యూమినా లాంటి వివిధ ఖనిజాలకు విలువ జోడింపు ప్రక్రియ ద్వారా గరిష్టంగా రెవెన్యూను ఆర్జించేందుకు ఆస్కారం ఉందని సిఎం అన్నారు. దేశంలోని కొన్ని రాష్ట్రాలు ఖనిజ ఆదాయం కారణంగానే రెవెన్యూ మిగులు సాధించాయని సిఎం వ్యాఖ్యానించారు. ఖనిజాల వ్యాల్యూ అడిషన్‌కు సంబంధించి విస్తృతంగా చర్చించి ఓ ప్రత్యేక విధానం తీసుకువచ్చే అంశాన్ని పరిశీలించాలన్నారు. రాష్ట్రంలోనే ఈ ఖనిజాల విలువ జోడింపు ప్రక్రియ జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎపి, ఒడిశా, కేరళ లాంటి రాష్ట్రాల్లో లభ్యమయ్యే అత్యంత విలువైన రేర్ ఎర్త్ మినరల్స్‌పై క్లస్టర్ ఏర్పాటు చేయాలని సూచించారు. టైటానియం, ఇలమనైట్, మోనజైట్ లాంటి హై వాల్యూ మినరల్స్ నిల్వలు ఏమేరకు ఉన్నాయన్న దానిని గుర్తించాలన్నారు. ఎలక్ట్రానిక్స్, మాగ్నెట్స్ సహా విలువైన లోహాలను తయారు చేసేందుకు రేర్ ఎర్త్ మినరల్స్ వెలికితీత జరగాలన్నారు. ప్రత్యేకమైన పరికరాల తయారీకి కీలకమైన ఈ లోహాలు అణు ఇంధనం సహా వ్యూహాత్మకంగా దేశానికి కూడా అత్యంత కీలకమని సిఎం అన్నారు. రాష్ట్రంలో జొన్నగిరి సహా చిత్తూరు జిల్లా చిగురుగుంట వద్ద కూడా బంగారం నిల్వలు ఉన్నాయని మిగతా బ్లాక్స్‌పై కూడా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి గనుల శాఖకు సూచనలిచ్చారు.

**టెక్నాలజీతో ఇసుక సరఫరా కట్టుదిట్టం..**

రాష్ట్రంలోని 126 ప్రాంతాల్లో క్రిటికల్, బల్క్ ఖని జాలు సహా ఇతర విలువైన >>2

## మహిళా కమిషన్ విచారణకు గుడివాడ అమర్నాథ్ హాజరు

### హోంమంత్రి అనితపై వివాదాస్పద వ్యాఖ్యల కేసు

**విజయవాడ,జూన్30,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో వైఎస్సార్సీ మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ విచారణకు హాజరయ్యారు. ఎపి మహిళా కమిషన్ కార్యాలయంలో ఆయన విచారణను ఎదుర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి అమర్నాథ్‌పై ఇదివరకే పోలీసు కేసు నమోదైంది. ఇటీవల జరిగిన ఒక బహిరంగ సభలో అమర్‌నాథ్ రాష్ట్ర హోం మంత్రి అనితను ఉద్దేశించి వ్యక్తిగత వ్యాఖ్యలు చేశారు. ఆమెను 'మేకప్ మంత్రి' అంటూ అనడమే కాకుండా "ఆమె వేసుకునే కిలోల కొద్దీ మేకప్" అంటూ వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను పర్యవేక్షించే కీలక బాధ్యత కలిగిన హోం మంత్రిని, అందులోనూ ఒక మహిళా ప్రజాప్రతినిధిని ఇలా కించపరచడం పెద్ద రాజకీయ వివాదానికి దారి తీసింది. ఈ నేపథ్యంలోనే ఆయన మహిళా కమిషన్ ముందు విచారణకు స్వయంగా హాజరు కావాల్సి వచ్చింది.అమర్నాథ్ విచారణకు వచ్చే సమయంలో మహిళా కమిషన్ కార్యాలయంవద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆయనకు మద్దతుగా భారీ ఎత్తున వైఎస్సార్సీ కార్యకర్తలు, నాయకులు అక్కడికి చేరుకున్నారు. అమర్నాథ్‌కు అనుకూలంగా వారు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో కార్యాలయం పరిసరాల్లో కాసేపు గందరగోళం చోటు చేసుకుంది. అదుపు తప్పకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి అమర్నాథ్ వెంట న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి కూడా విచారణ నిమిత్తం వచ్చారు. ఈ సమయంలో పోలీసులతో ఆయన తీవ్ర వాగ్వాదానికి దిగారు. ఆగ్రహంతో సిఐకి వేలు చూపించి బెదిరింపు ధోరణిలో ఆయన మాట్లాడారు. ఈఘటనతో అక్కడి వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. అమర్నాథ్ మహిళా కమిషన్ కార్యాలయంలోకి వెళ్లిన తర్వాత మరో నాటకీయ పరిణామం జరిగింది. ఆయనవెంట లోపలికి వెళ్లేందుకు న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి ప్రయత్నించారు. అయితే పోలీసులు ఆయనను గేటువద్దే గట్టిగా అడ్డుకున్నారు. దీంతో పోలీసుల తీరుపై పొన్నవోలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 'దిస్ ఈజ్ టూ మచ్' అంటూ పోలీసు సిబ్బందితో వాదనకు దిగారు.పొన్నవోలు వాదనలకు సిబ్బంది కూడా ధీటుగా బదులిచ్చారు. మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజనుంచి అనుమతి వస్తేనే లోపలికి పంపిస్తామని సిబ్బంది తేల్చి చెప్పారు. ఆమె అనుమతి లేకుండా ఎవరినీ లోపలికి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో పొన్నవోలుతో పాటు మరోఇద్దరు లాయర్లుకూడా కార్యాలయం వద్దకు వచ్చారు. ఆ ఇద్దరులాయర్లను పోలీసులు బలవంతంగా అక్కడినుంచి బయటికి పంపించేశారు.

బయట ఈ నాటకీయ పరిణామాలు జరుగుతుండగానే లోపల విచారణ కొనసాగింది. మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ ఈ విచారణను స్వయంగా చేపట్టారు. మాజీ మంత్రి అమర్నాథ్ ను ఆమె సుమారు గంట పాటు సుదీర్ఘంగా ప్రశ్నించారు.

## సీనియర్ ఐపిఎస్ అధికారి సునీల్ కుమార్‌కు క్యాట్‌లో చుక్కెదురు

**విజయవాడ, జూన్30, ప్రభాతవార్తప్రతినిధి:** క్యాట్‌లో సీనియర్ ఐపిఎస్ అధికారి పి.వి. సునీల్‌కుమార్‌కు చుక్కెదురైంది. తనపై సస్పెన్షన్ ఎత్తివేయాలని సునీల్‌కుమార్ దాఖలు చేసిన పిటిషన్ కొట్టివేసింది. పి.వి.సునీల్‌కుమార్ తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూ సస్పెన్షన్‌లో ఉన్నారు. సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్ నేటి ఉదయం విచారణలో అతని వాదనలు విని సస్పెన్షన్ రద్దు చేయాలన్న అభ్యర్థనను తోసిపుచ్చింది.

ఈరోజు పని వేళలు ముగిసిన తరువాత ఆయన పదవీ విరమణను రాష్ట్ర ప్రభుత్వం సస్పెన్షన్‌లోనే నోటిపై చేసింది. వివిధ కేసుల్లో సునీల్‌కుమార్‌ను ప్రభుత్వ సర్వీసు పూర్తి అయ్యేంత వరకు సస్పెన్షన్‌లో ఉంచుతూ ప్రభుత్వం గతంలోనే ఉత్తర్వులు ఇచ్చింది.

## మహిళా పారిశ్రామికవేత్తలకు ఎనలేని ప్రోత్సాహం

### వారికి ఇచ్చే రుణాలలో 99.7% లక్ష్య సాధన

**విజయవాడ,జూన్30,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళల ఆర్థిక సాధికారతలో దేశానికే ఎపి ఆదర్శంగా నిలిచిందని కేంద్ర నివేదికలు వెల్లడించాయి. మహిళలకు వ్యక్తిగత ఎంటర్‌ప్రైజ్ రుణాల అమల్లో రాష్ట్రం 99.7 శాతం లక్ష్యాన్ని సాధించారు. రూ. 1,500 కోట్ల రుణ లక్ష్యంలో రూ.1,495.50 కోట్లు మహిళా పారిశ్రామికవేత్తలకు పంపిణీ చేశారు. 1.50 లక్షల మంది మహిళలకు రుణాలు అందించాలని లక్ష్యం నిర్ణయించారు. 1,47,840 మందికి వ్యక్తిగత పారిశ్రామిక రుణాలు అందించింది. పిఎంఎఫ్‌ఎంఇ పథకంలోనూ దేశంలో అగ్రస్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉన్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రం 2025-26లో 35,934 మంది లబ్ధిదారులకు ప్రయోజనం కల్పించింది. ఆత్మనిర్భర్ భారత్, వోకల్ ఫర్ లోకల్ లక్ష్యాల సాధనలో ఎపి ముందంజలో ఉంది. 48,584 మందికి వ్యక్తిగత రుణాలు అందించి ఎపి తర్వాత స్థానంలో ఉన్న తమిళనాడు ఉంది. ఎపితో సమానంగా లక్ష్యాలను నిర్దేశించుకుని... టార్గెటులో కేవలం 15,25 శాతం మాత్రమే చేరుకున్న బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు.మహిళా పారిశ్రామిక వేత్తలకు రుణాలు అందించడంలో అద్భుత పనితీరు కనబరుస్తుండడంతో 2026- 27 ఏడాదికి ఎపికి అత్యధిక టార్గెట్.నిర్దేశించారు. 2026-27 ఏడాదికి 1.67లక్షలమంది మహిళలకు రూ.1670 కోట్లు రుణాలు అందించా లని టార్గెట్‌గా పెట్టుకున్నారు.ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకంలోనూ దేశంలో అగ్రస్థానంలో ఆంధ్రప్రదేశ్ నిలిచింది..2025-26లో 35,934 మంది లబ్ధిదారులకు ప్రయోజనం కల్పించిన రాష్ట్రంగా గుర్తింపులోకి వచ్చింది. పిఎంఎఫ్‌ఇలో 2025 - 26 ఏడాదిలో నిర్దేశించుకున్న లక్ష్యంలో 95 శాతం ఎపి సాధించింది. 35210 మంది లబ్దిదారులతో పిఎంఎఫ్‌ఇ స్కీంలో ఎపి తర్వాతా స్థానాన్ని దక్కించుకున్న మహారాష్ట్ర దక్కించుకుంది. రుణాల పంపిణీతోపాటు... గ్రామీణ మహిళలకు స్థిరమైన ఉపాధి కల్పించడంలోనూ ముందంజలోఉందని ఎపికి కేంద్రం కితాబును ఇచ్చింది.

01-07pg2exHMNWJQEVRS_01-07pg2exHMNWJQEVRS.qxd 30/Jun/26 11:53 PM Page 1





మంగళవారం కర్ణాటకలో సర్ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా గణన పత్రంపై సంతకం చేస్తున్న సిఎం డికె శివకుమార్

## జిఎడి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి పదవీ విరమణ

**విజయవాడ, జూన్30, ప్రభాతవార్తప్రతినిధి:** జిఎడి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి పదవీ విరమణ చేశారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శంషేర్ సింగ్ రావత్‌కు అదనపు బాధ్యతలు ఇచ్చారు. శ్రీలక్ష్మి రెండేళ్ల పాటు పోస్టింగ్ కోసం ఎదురుచూసిన నేపథ్యంలో సోమవారం ఆమె ప్రభుత్వ ఉత్వరుల మేరకు జిఎడి ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా శ్రీలక్ష్మి బాధ్యతలను స్వీకరించారు. నేడు పదవి విరమణ చేసారు.

## ఇరాన్ అధ్యక్షుడితో ప్రధాని మోడీ ఫోన్ సంభాషణ
### హర్మ్మజ్ జలసంధిలో నౌకల స్వేచ్ఛాయుత రవాణాకే ప్రాధాన్యం

**న్యూఢిల్లీ,జూన్ 30:** పశ్చిమ ఆసియాలో నెలకొన్న తాజా పరిణామాల నేపథ్యంలో ప్రధాని మోడీ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌తో మంగళవారం ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రాంతీయ పరిస్థితులు, దౌత్యపరమైన ప్రయత్నాలు, హోర్ముజ్ జలసంధిలో నావిగేషన్ స్వేచ్ఛ వంటి కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. పశ్చిమ ఆసియాలో నెలకొన్న తాజా పరిస్థితులు, ప్రాంతంలో కొనసాగుతున్న దౌత్యపరమైన ప్రయత్నాలపై ఇరాన్ అధ్యక్షుడు ప్రధానికి వివరించారు. ఈ సందర్భంగా ప్రపంచ ఇంధన సరఫరాలకు అత్యంత కీలకమైన హర్మ్మజ్ జలసంధిలో స్వేచ్ఛగా నౌకలరవాణా కొనసాగడం భారత్‌తో పాటు ప్రపంచ దేశాలకూ ఎంతో ముఖ్యమని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. ప్రాంతంలోని అన్ని సమస్యలు చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కారం కావాలని భారత్ ఎప్పటి నుంచో విశ్వసిస్తోందని ప్రధాని పునరుద్ఘాటించారు. శాశ్వత శాంతి, స్థిరత్వం కోసం నిరంతర దౌత్య ప్రయత్నాలు కొనసాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సంభాషణ అనంతరం ప్రధాని మోడీ సోషల్ మీడియా వేదిక లో స్పందిస్తూ పశ్చిమ ఆసియాలో జరిగిన చర్చల పురోగతిని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. కొనసాగుతున్న చర్చలు ప్రాంతంలో శాశ్వత శాంతికి దోహదపడ తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. హర్మ్మజ్ జలసంధిలో నావిగేషన్ స్వేచ్ఛ భారత్‌తో పాటు ప్రపంచానికి అత్యంత కీలకమని మరోసారి స్పష్టం చేశారు.

## జన్మతః పౌరసత్వంపై సుప్రీంకోర్టు తీర్పుపై ట్రంప్ తీవ్రఅసంతృప్తి

**వాషింగ్టన్,జూన్ 30:** అమెరికా సుప్రీంకోర్టు జన్మహక్కు పౌరసత్వం సూత్రాన్ని కొనసాగిస్తూ ఇచ్చిన తీర్పుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తీర్పు అమెరికాకు అనుకూలం కాదని పేర్కొంటూ, కాంగ్రెస్ ద్వారా కొత్త చట్టం తీసుకువచ్చి ఈ అంశాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. మంగళవారం సామాజిక మాధ్యమంలో స్పందించిన ట్రంప్, జన్మహక్కు పౌరసత్వ విధానం అమెరికాపై భారీ ఆర్థిక భారం మోపుతోందని, దేశానికి అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ఈ విధానాన్ని రద్దు చేసేలా కాంగ్రెస్ వెంటనే చట్టసభా ప్రక్రియ ప్రారంభించాలని కోరారు. సుప్రీం కోర్టు జన్మహక్కు పౌరసత్వాన్ని సమర్థించింది. ఇది మన దేశానికి మంచిదికాదు. అయితే కాంగ్రెస్‌లో చట్టం తీసుకువచ్చి దీనిని సులభంగా మార్చవచ్చు. రాజ్యాంగ సవరణ అవసరం లేదు. ఈ విషయంలో కాంగ్రెస్ ఈరోజే చర్యలు ప్రారంభించాలి. వారికి నా సంపూర్ణ మద్దతు ఉంటుంని ట్రంప్ తన పోస్టులో పేర్కొన్నారు. కాగా, అమెరికాలో అక్రమంగా లేదా తాత్కాలిక వీసాలపై నివసిస్తున్న విదేశీయుల పిల్లలకు జన్మతః అమెరికా పౌరసత్వం నిరాకరించేలా ట్రంప్ జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వును సుప్రీంకోర్టు తిరస్కరించింది. తన ప్రస్తుత కాలపరిమితి చివరి రోజున విచారణ పూర్తి చేసిన సుప్రీంకోర్టు, 6-3 మెజారిటీతో అమెరికా భూభాగంలో జన్మించిన దాదాపు ప్రతి వ్యక్తికి పౌరసత్వ హక్కు కొనసాగుతుందని స్పష్టం చేసింది. అంతకుముందు దిగువ కోర్టులు కూడా ట్రంప్ ఉత్తర్వుపై నిలుపుదల విధించాయి. ఈ తీర్పును ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్ వెలువరించారు. అమెరికాలో అక్రమంగా లేదా తాత్కాలికంగా నివసిస్తున్న తల్లి దండ్రులకు జన్మించిన పిల్లలు కూడా అమెరికా చట్టాల పరిధిలోకి వస్తారని, రాజ్యాంగంలోని 14వ సవరణ ప్రకారం వారికి జన్మతః పౌరసత్వ హక్కు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పౌరసత్వం అనేది హక్కులను కలిగి ఉండే ప్రాథమిక హక్కు. అలాగే ప్రజాస్వామ్య వ్యవస్థలో స్వేచ్ఛగా భాగస్వామ్యం అయ్యే అవకాశం. 14వ రాజ్యాంగ సవరణ రూపకర్తలు ఈ హక్కును ఈ దేశంలో జన్మించిన ప్రతి స్వతంత్ర వ్యక్తికి విస్తరించారు. ఆ హామీని మేము ఈరోజు కూడా కొనసాగిస్తున్నా మని ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్ వ్యాఖ్యానించారు.

## 35 యేళ్ల తర్వాత మళ్లీ విచారణకు సరళాభట్ హత్యకేసు

**శ్రీనగర్,జూన్ 30:** కశ్మీరీ పండిట్ సామాజిక వర్గానికి చెందిన నర్స్ సరళా భట్ అపహరణ, హత్య కేసు 35 యేళ్ల తర్వాత కీలక మలుపు తిరిగింది. జమ్మూకశ్మీర్ స్టేట్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ ఈ ఘటనపై దర్యాప్తును ముగించి, జమ్మూకశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ చీఫ్ మహ్మద్ యాసిన్ మాలిక్‌తో పాటు మరికొందరిని నిందితులుగా చేరుస్తూ శ్రీనగర్‌లోని ప్రత్యేక కోర్టులో 737 పేజీల భారీఛార్జ్‌షీట్‌ను దాఖలు చేయడానికిసిద్ధమైంది. 1990 ఏప్రిల్ 18న శ్రీనగర్ లోని షేర్‌ఇకశ్మీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎస్‌కేఐఎంఎస్) సమీపంలో నర్స్ సరళా భట్‌ను ఉగ్రవాదులు అపహరించారు. ఆ తర్వాత ఆమెను శారీరక హింసకు గురిచేసి, శ్రీనగర్ మాల్‌బాగ్‌లోని ఒమర్ కాలనీలో ఆటోమేటిక్ రైఫిల్స్‌తో కాల్చి అతిక్రూరంగా హత్యచేశారు. అప్పట్లో ఉగ్రవాద సంస్థలు సృష్టించిన బీభత్సం, భయాందోళనల కారణంగా సాక్షులు ఎవరూ ముందుకు రాకపోవడంతో దశాబ్దాలుగా ఈకేసు ఒక మిస్టరీగానే ఉండిపో యింది. 2024 మార్చి 18న జమ్మూకశ్మీర్ డిజిపి ఆదేశాల మేరకు ఈకేసు ఎస్ఐఏ చేతుల్లోకి వచ్చింది. 35 ఏళ్లు గడిచినప్పటికీ, దర్యాప్తు అధికారులు ఎంతో శ్రమించి సాంకేతికంగా, శాస్త్రీయంగా ఆధారాలను సేకరించారు. సాక్షుల వాంగ్మూలాలు, స్వతంత్ర ప్రత్యక్ష సాక్షుల ఆధారాలు, ఫోరెన్సిక్‌నివేదికల ఆధారంగానాటి ఘటన క్రమాన్ని విజయవంతంగా పునర్నిర్మిం చారు. ఈ దర్యాప్తులో తేలిందేంటంటే సరళాభట్ హత్య అనేది ఏదో అకస్మాత్తుగా జరిగిన వ్యక్తిగత దాడి కాదు. కశ్మీర్ లోయ నుంచి కశ్మీరీ పండిట్లను బలవంతంగా తరిమేయడానికి, ప్రజల్లో తీవ్రభయాందోళనలు సృష్టించడానికి జేకేఎల్ఎఫ్ అగ్ర నాయకత్వం పక్కావ్యూహంతో రచించిన ఒక ఉగ్రవాద కుట్రలో భాగమని ఆధారాలతో ఎస్ఐఏ నిర్ధారించింది.

# వికసిత్ భారత్ మన లక్ష్యం

>> గుణంగా విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, తమ చుట్టూ ఉన్న పర్యావరణం నుండి ప్రాక్టికల్ నైపుణ్యాలను నేర్చుకోవాలని సూచించారు. తమ సొంత సమాజం, సంస్కృతి, సాంప్రదాయాల మూలాలను మరువకుండా దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు విద్యార్థులు కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. దేశాభివృద్ధిలో ఆధునిక విజ్ఞాన ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి అందాలనే ఉద్దేశంతో, ఈ విశ్వవిద్యాలయం ఉత్తరాంధ్రలోని గిరిజన గిరిజనుల సాధికారత కోసం ఒక 'సైన్స్ అండ్ టెక్నాలజీ హబ్' ను నిర్వహిస్తోందని రాష్ట్రపతి ప్రశంసించారు. గిరిజన సంక్షేమం, ప్రజారోగ్యం, వాతావరణ మార్పులు, ఆహారపోషకాహార భద్రత ఇంధన పరిరక్షణవంటి క్షేత్రస్థాయిఅంశాలపై వర్సిటీ చేస్తున్నకృషి.. సమసమాజ స్థాపనకు, దేశాభివృద్ధికి ఎంతోదోహదపడుతుందని పేర్కొన్నారు.

**2047 నాటికి వికసిత భారత్**

2047వ సంవత్సరం నాటికి వికసిత భారత్‌ను సాధించడమే మన లక్ష్యమని, పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించే ఇక్కడి సమ్మిళిత, ప్రాక్టికల్ విద్యా విధానం ద్వారా ఆంధ్రప్రదేశ్ కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం ఈ లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషిస్తుందని రాష్ట్రపతి ధీమా వ్యక్తం చేశారు. గిరిజన యువతకు ఆధునిక విద్యను అందించడం ద్వారా వారు దేశ సమానాభివృద్ధిలో భాగస్వాములు కాగలరని ఆమె ఆకాంక్షించారు. అనంతరం నారా లోకేష్ మాట్లాడుతూప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే అసలైన విద్య అని, నాణ్యమైన విద్య సమాజంలోని ప్రతి వర్గానికి చేరాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాలు కేవలం డిగ్రీలు అందించే విద్యాసంస్థలు మాత్రమే కావు... అవి కలలకు రూపమిస్తాయి ఆయన తెలిపారు. ఈ రోజు కేవలం ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవం మాత్రమే కాదు... ఇది అవకాశాల, సమ్మిళిత అభివృద్ధి వేడుక. నాణ్యమైన విద్య దేశంలోని ప్రతి మూలకు, సమాజంలోని ప్రతి వర్గానికి చేరాలనే విశ్వాసానికి ప్రతీకగా నిలిచే వేడుక అని చెప్పారు. గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవానికి మన రాష్ట్రపతి కంటే మరింత అర్థవంతమైన ముఖ్య అతిథి మరెవరూ ఉండరు. ఆమె జీవితం స్వయంగా ఈ విశ్వవిద్యాలయం వంటి విద్యాసంస్థలు ఎందుకు అవసరమో చెప్పే అత్యుత్తమ సమాధానం అన్నారు. రాష్ట్రపతి ప్రయాణాన్ని అసాధారణంగా నిలబెట్టింది ఆమె అధిరోహించిన పదవులు మాత్రమే కాదు.. ఆమె జీవితంలో ఎదుర్కొన్న వ్యక్తిగత విషాదాలు కూడా. 2009 నుంచి 2014 మధ్య ఆమె తన పెద్ద కుమారుడు, చిన్న కుమారుడు, భర్త, తల్లి, సోదరుడిని కోల్పోయారు. అలాంటి దుఃఖాన్ని ఊహించడం కూడా మనలో చాలామందికి సాధ్యం కాదు. అయినప్పటికీ ఆమె నిరాశకు గురికాలేదు. ఆధ్యాత్మికతలో బలాన్ని వెతుక్కొని.. కొత్త సంకల్పంతో తిరిగి ప్రజాసేవలోకి వచ్చారు. 2022లో భారత రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం సందర్భంగా.. భారతదేశంలోని పేదలు కలలు కనడమే కాదు, ఆ కలలను నిజం చేసుకోగలరనే విషయానికి నా ఎన్నికే నిదర్శనం అని చెప్పారు. ఉన్నత విద్యను మరింత బలోపేతం చేస్తూ.. భారత యువతకు మరిన్ని అవకాశాలను కల్పిస్తున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కి అభినందనలు తెలియజేశారు. ఈ జాతీయ దార్శనికత నుంచి స్ఫూర్తి పొందుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఎపి ఉన్నత విద్యలో సమూల మార్పులు తీసుకువస్తున్నాం. జ్ఞానాన్ని సృష్టించే, ఆవిష్కరణలకు ప్రేరణనిచ్చే విద్యార్థులను కేవలం ఉద్యోగాలకే కాకుండా నాయకత్వానికి సిద్ధం చేసే విశ్వవిద్యాలయాలను నిర్మిస్తున్నాం తెలియజేశారు. ప్రతి విద్యార్థి ఉపాధికి అర్హుడు కావాలి, ప్రతి విశ్వవిద్యాలయం ఆవిష్కరణలకు కేంద్రంగా మారాలి, ప్రతి పరిశోధకుడు సాధికారత పొందాలనేది మా లక్ష్యమన్నారు. అంతకుముందు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా బంగారు పతకాలు అందజేశారు.

# విద్యా బోధనలో ఎపి భేష్

>> వసతులను పరిశీలించారు. ముందుగా జాదు పితారా కిట్‌ను కేంద్ర మంత్రి పరిశీలించారు. జాదు పితారా కిట్ గురించి సిబ్బంది, మంత్రి లోకేష్ కేంద్ర మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠశాల విద్యాశాఖ అందిస్తున్న స్టూడెంట్ ప్రోగ్రెస్ కార్డ్, అసెస్ మెంట్ బుక్ లెట్‌ను కేంద్ర మంత్రికి లోకేష్ చూపించారు. విలువల విద్య కోసం ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలతో రూపొందించిన పుస్తకాల గురించి మంత్రి లోకేష్ విశదీకరించారు. విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్‌ను ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పరిశీలించారు. టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, వర్క్ బుక్స్, యూనిఫాం, స్కూల్ బ్యాగ్, షూ, బెల్ట్, సాక్స్ లను పరిశీలించారు. పిక్టోరియల్, ఆక్స్ ఫర్డ్ డిక్షనరీ గురించి సిబ్బంది వివరించారు.

**పాఠశాల విద్యాశాఖ డ్యాష్ బోర్డును పరిశీలించిన కేంద్ర మంత్రి**

ఈ సందర్భంగా విద్యాశాఖ రూపొందించిన డ్యాష్ బోర్డును కేంద్ర మంత్రి ఆసక్తిగా పరిశీలించారు. లీప్ డ్యాష్ బోర్డు గురించి మంత్రి లోకేష్ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వివరించారు. డ్యాష్ బోర్డ్‌లో ఎన్ రోల్ మెంట్, లెర్నింగ్ అవుట్ కమ్స్, అటెండెన్స్, మధ్యాహ్న భోజన పథకం, ఎంఇఒ, డిఇఒల ఇన్‌స్పెక్షన్, డ్రాప్ అవుట్స్, లీప్ యాప్ డౌన్ లోడ్స్, స్మార్ట్ కిచేన్స్, ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు భవిత సెంటర్స్, అకడమిక్, ఇన్ ఫ్రా స్ట్రక్చర్ పర్ఫార్మెన్స్ వంటి అంశాల గురించి విశదీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో తీసుకురానున్న స్మార్ట్ కిచేన్ల వ్యవస్థపై రూపొందించిన ఏవీని వీక్షించారు. కడపలో పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టిన స్మార్ట్ కిచెన్ గురించి కేంద్రమంత్రికి వివరించారు. అనంతరం స్పోర్ట్స్ రూమ్, స్కిల్ ల్యాబ్‌ను మంత్రులు పరిశీలించారు. విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పైథాన్ లాంగ్వేజ్‌ను ఉపయోగించి విద్యార్థి రూపొందించిన హోం వర్క్ అండ్ పీరియాడికల్ అసెస్ మెంట్ అప్లికేషన్‌ను ఆసక్తిగా గమనించారు. ప్రీ ఒకేషనల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ గురించి సిబ్బంది వివరించారు. ఇందుకు సంబంధించిన కౌశల్ బోధ్ పుస్తకాలను కేంద్ర మంత్రి పరిశీలించారు. స్కూల్ లైబ్రరీని సందర్శించి విద్యార్థులతో సంభాషించారు. లైబ్రరీలోని పుస్తకాలపై కేంద్ర మంత్రి ఆరా తీశారు.

**చాణక్య అంటే ఎవరో తెలుసా?**

అనంతరం మంత్రులు పాఠశాలలోని 9వ తరగతి బీ సెక్షన్‌ను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల మధ్య కూర్చొని ఫిజియోగ్రాఫిక్ డివిజన్ ఆఫ్ ఇండియా అంశంపై రూపొందించిన క్లిక్కర్ వీడియోను వీక్షించారు. సదరు పాఠ్యాంశం గురించి ఉపాధ్యాయురాలు విద్యార్థులకు వివరించారు. క్లిక్కర్ వీడియోకు సంబంధించి ఫ్లిప్ ప్యానల్ ద్వారా క్విజ్ నిర్వహించగా 55 శాతం మంది విద్యార్థులు సరైన సమాధానాలు చెప్పారు. ఈ సందర్భంగా తరగతి గదిలోని విద్యార్థులతో కేంద్ర మంత్రి సంభాషించారు. ఈ రోజు ఏం టిఫిన్ తిన్నావని ఓ విద్యార్థిని ప్రశ్నించగా దోశ తిన్నానని సమాధానం ఇచ్చాడు. మధ్యాహ్న భోజనం గురించి ఆరా తీశారు. అనంతరం ఓ విద్యార్థి పేరు అడగ్గా చాణక్య అని చెప్పాడు. "చాణక్య అంటే ఎవరో తెలుసా? కింగ్ ఆ, కింగ్ మేకరా?" అని కేంద్ర మంత్రి ప్రశ్నించారు. కింగ్ మేకర్ అని విద్యార్థి సమాధానం చెప్పాడు. మరో విద్యార్థి రాం ప్రసాద్‌ను పాఠ్యాంశాలపై అనుమానాలు ఉంటే ఎవరిని అడుగుతావని ప్రశ్నించగా తన సోదరుడిని అడుగుతానని విద్యార్థి సమాధానం చెప్పాడు. ఏ భాష సౌకర్యంగా భావిస్తావని సదరు విద్యార్థిని ప్రశ్నించగా తెలుగు అని సమాధానం చెప్పాడు. ఈ సందర్భంగా బైలింగ్యువల్ టెక్స్ట్ బుక్స్ గురించి మంత్రి లోకేష్ వివరించారు. అనంతరం విద్యార్థి స్థాయి ఆధారంగా నేర్చుకునే పాల్ ల్యాబ్‌ను పరిశీలించారు. విద్యార్థులను, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. తమ పేర్లతో రూపొందించిన త్రీడి ప్రింటింగ్ ను కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు ఓ విద్యార్థి బహుమతిగా అందజేశాడు.

# ఖనిజ నిల్వలపై మినరల్ మ్యాపింగ్

>> ఖనిజాలను గుర్తించామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రస్తుతం మైనింగ్ ఆపరేషన్స్ ద్వారా రెవెన్యూలో 18 శాతం మేర వృద్ధి నమోదైనట్టు తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం గనుల తవ్వకాలను కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆదేశించారు. ఇసుక తవ్వకాల, సరఫరా పై కూడా పూర్తి స్థాయి నిఘా ఉంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇసుక రీచ్‌ల వద్ద సిసి కెమెరాలతో పాటు శాటిలైట్ చిత్రాల ద్వారా విశ్లేషించటంతో పాటు వాహనాలకు జిపిఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రజల కోసమే ఇసుకపై వెయ్యి కోట్ల రూపాయల మేర ఆదాయాన్ని వదిలేసి ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని అన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని అధికారులను సిఎం ఆదేశించారు. ఈ సమీక్షలో గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, సిఎస్ సాయి ప్రసాద్, గనుల శాఖ, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శులు ముఖేష్ కుమార్ మీనా, పీయుష్ కుమార్ సహా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఎక్కడ?
### కొత్తూరు పిఎస్‌కు వెళ్తూ అదృశ్యం!



**టెక్కలి (శ్రీకాకుళం జిల్లా), జూన్ 30 ప్రభాతవార్త:** ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో కొత్తూరు పోలీస్‌స్టేషన్‌లో విచారణ కోసం టెక్కలి నుంచి బయలుదేరిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మార్గమధ్యలో అనూహ్యంగా అదృశ్యమయ్యారు. టెక్కలి నుంచి బయలుదేరి రెండు గంటలు దాటినా ఆయన కొత్తూరు చేరుకోలేదు. అతడి ఫోన్లు స్విచాఫ్ అయినట్లుగా అభిమానులు చెబుతున్నారు. హిరమండలం పోలీస్ స్టేషన్‌లో జనసేన నాయకుడు ఇచ్చిన ఫిర్యాదుపై ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై కేసు నమోదు కాగా విచారణకు రావాలని కొత్తూరు పోలీసులకు ఆయనకు నోటీసులను గతంలో ఇచ్చారు. ఈ మేరకు కొత్తూరు సర్కిల్ కార్యాలయంలో ఆయనను పోలీసులు ఇటీవల విచారించారు. ఆ సమయంలో కొత్తూరు స్టేషన్ వద్ద దివ్వెల మాధురితో పాటు దువ్వాడ అభిమానులు ఆందోళనకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. విచారణ సమయంలో దువ్వాడ శ్రీనివాస్ పోలీసులకు సహకరించకపోవడంతో మరోసారి విచారణకు హాజరు కావాలని అప్పట్లోనే పోలీసులు ఆయనకు సూచించారు. ఈ క్రమంలో మంగళవారం దువ్వాడ శ్రీనివాస్‌ను పోలీసులు మరోసారి విచారించగా గతంలో దివ్వెల మాధురి స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసనలను తెలిపిన నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యలలో భాగంగా ఆమెను టెక్కలిలోని నివాసం వద్దనే గృహనిర్బంధం చేశారు. దువ్వాడ శ్రీనివాస్ ఒక్కరే విచారణ కోసం కొత్తూరు బయలుదేరగా మార్గమధ్యలో మిస్సయ్యారు. పోలీసులే అతడిని రహస్య ప్రదేశానికి తరలించి ఉంటారని మాధురితో పాటు ఆయన అభిమానులు ఆరోపిస్తున్నారు. పోలీసులు మాత్రం కొత్తూరు స్టేషన్‌కు ఆయన రాలేదని చెప్పుకొస్తున్నారు. ఈ వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశమైంది.

## వారం - వర్జ్యం

01-07-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆరుద్ర కార్తె
పాడ్యమి ఉ.7.38
పూర్వాషాఢ ఉ.6.51
వర్జ్యం : మ.3.43-సా.5.29
దు.11.45-మ.12.37
శుభసమయం : ఉ.8.00-9.00
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** సంతాన విద్యావిషయంలో నూతన బాధ్యతలు చేపడతారు. సోదరి, సోదరులతో విభేదాలు తలెత్తుతాయి.

**వృషభం:** పట్టుదలతో ముందుకుసాగి వ్యవహారాలు చక్కదిద్దుతారు. అరుదైన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి.

**మిథునం:** ముఖ్యులతో పరిచయాలు ఏర్పడతాయి. మీ తొందరపాటు మాటలవల్ల మిత్రులతో శతృత్వం ఏర్పడుతుంది.

**కర్కాటకం :** మీ ప్రతిభాపాటవాలు వెలుగు చూస్తాయి. ఇళ్లు కొనుగోలుయత్నాలు సాగిస్తారు. పెట్టుబడులకు తగిన లాభం పొందుతారు.

**సింహం:** కీలకనిర్ణయాలలో తొందరపాటు వద్దు. ఉద్యోగములలో స్వల్పమార్పులు చోటుచేసుకుంటాయి. వాహనసౌఖ్యం.

**కన్య :** ఇంట్లో వడ్రంగిపనులు, ఫర్నీచర్ పనులు చేస్తారు. ఫాస్ట్‌ఫుడ్స్ వ్యాపారస్థులకు అనుకూలమైన కాలం. వస్త్రలాభం.

**తుల :** ఆర్థికంగా చెప్పుకోదగిన లాభాలు ఉండపోయినా లోటువుండదు. ఖర్చును అదుపుచేయలేకపోతారు.

**వృశ్చికం:** స్థిరత్వము, ధైర్యమువలన చాలా ఫలితములు అనుకూలదిశలో వయనిస్తాయి. స్నేహితుల కలయిక.

**ధనుస్సు:** కుటుంబ ఐకమత్యంకు విఘాత మేర్పడకుండా సంయమనం పాటించండి. ఆస్తివివాదాలు తీరుతాయి.

**మకరం:** మాటలచాతుర్యంతో కార్యా లయంలో ఉన్నతాధికారుల మెప్పు పొందుతారు. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం వుంటుంది.

**కుంభం:** రాజకీయ, సినీ, కళారంగాల వారికి విదేశీపర్యటనలు. శత్రువులు సైతం మిత్రులుగా మారి సాయం అందిస్తారు.

**మీనం :** పోరాడి దూరప్రాంత అవకాశము లను సాధిస్తారు. మీమీద నిందారోపణలు చేసే వ్యక్తుల విషయంలో జాగ్రత్తలు వహించండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



మంగళవారం వెనుజులాలోని కాటియాలా మాల్‌లో శిథిలాల కింద సహాయక సిబ్బంది గాలిస్తున్న దృశ్యం

# ఫడ్నవిస్‌తో పవన్ భేటీ

>> ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో ఇరు రాష్ట్రాల మధ్య పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. మంగళవారం ముంబైలోని మహారాష్ట్ర ముఖ్యమంత్రి వారి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో తూర్పు కనుమల్లో పులుల సంరక్షణ, మహారాష్ట్ర నుంచి రాష్ట్రానికి రెండు ఆడ పులులు ఇచ్చే అంశాలపై ఇరువురు నేతల మధ్య ఫలవంతమైన చర్చలు సాగాయి. ఉమ్మడి ప్రయోజనాలకు సంబంధించి భవిష్యత్తులో మరింత సహకరించుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్‌లోని తూర్పు కనుమల ప్రాంతంలో ఆడ పులుల సంఖ్య గణనీయంగా తగ్గడంతో జన్యుపరమైన సమస్యలు తలెత్తాయి. ఈ క్రమంలో పులుల సంఖ్య పునరుద్ధరణకు మహారాష్ట్ర ప్రభుత్వ సహకారం తీసుకుంటున్నాం. ఆంధ్రప్రదేశ్ కు రెండు ఆడ పులులు ఇచ్చేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. వారు అందిస్తున్న సహకారానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. తూర్పు కనుమలలో పులుల సంరక్షణ చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుంది. తూర్పు కనుమల్లో ఆడ పులుల ప్రవేశంతో అంతరసంతానోత్పత్తి సమస్యలను అధిగమించడంతోపాటు, జన్యు వైవిధ్యం పెరిగి, పులుల సంఖ్య దీర్ఘకాలిక స్థిరత్వానికి దోహదపడుతుంది. తద్వారా తూర్పు కనుమలలో ఆరోగ్యకరమైన, స్వయం సమృద్ధి కలిగిన పులుల ఆవాస వ్యవస్థ ఏర్పడుతుంది. శాస్త్రీయ విధానాలు, స్థిరమైన వన్యప్రాణి నిర్వహణ ఆధారంగా జీవ వైవిధ్య పరిరక్షణకు ఇరు రాష్ట్రాలు కట్టుబడి ఉన్నాయన్న అంశాన్ని ఈ సంయుక్త సంరక్షణ కార్యచరణ ప్రతిబింబిస్తోంది. ఆంధ్రప్రదేశ్-మహారాష్ట్ర రాష్ట్రాల మధ్య ఏర్పడిన ఈ భాగస్వామ్యం తూర్పు కనుమలలో పులుల దీర్ఘకాలిక సంరక్షణకు విశేషంగా దోహదపడుతుందని విశ్వసిస్తున్నాం. ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో మాకు నిరంతరం మార్గదర్శకత్వం అందిస్తున్న కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ కూడా ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.

# బిజెపి కొత్త ఇన్‌ఛార్జిలు

>> స్వయం వంటి బాధ్యతలను జిల్లా ఇన్‌ఛార్జిలు నిర్వహించనున్నారని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర నాయకులు, వివిధ మోర్చాల నాయకులతో సమన్వయం చేసుకుంటూ పార్టీని మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా నియమించిన జిల్లా ఇన్‌ఛార్జిల వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లాకు పోలిమేర శ్రీనివాసరావు, అల్లూరి సీతారామరాజు జిల్లాకు పుట్ట గంగయ్య. పోలవరం జిల్లాకు గాడే శ్రీనివాసరావు, శ్రీకాకుళం జిల్లాకు రవీందర్ రెడ్డి మేడపాటి, విజయనగరంజిల్లాకు ఎన్. విజయానంద రెడ్డి. విశాఖపట్నం జిల్లాకు రెడ్డి పావని, అనకాపల్లి జిల్లాకు ఎపిఆర్ చౌదరి, కాకినాడ జిల్లాకు ఆకుల శ్రీధర్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు కరంకి శ్రీనివాస్, తూర్పు గోదావరి జిల్లాకు బుద్ధా లక్ష్మీనారాయణ, పశ్చిమ గోదావరి జిల్లాకు శ్రీదేవి రేలంగి, ఏలూరు జిల్లాకు రామ్ కుమార్ చిలుకూరి. కృష్ణా జిల్లాకు భోగిరెడ్డి ఆదిలక్ష్మి, ఎన్‌టిఆర్‌జిల్లాకు వెంకట సుబ్బారావు నార్ని (తాతాజీ), గుంటూరు జిల్లాకు వైవిఆర్ మోహన్ (దొరబాబు), పల్నాడు జిల్లాకు తొగంటి శ్రీనివాస్ (జిల్లా ఇన్‌ఛార్జి), జిల్లాకు అవుల నాగేంద్ర కుమార్ యాదవ్ (జిల్లా కోఇన్‌ఛార్జి) బాపట్ల జిల్లాకు గాజుల వెంకయ్య నాయుడు, ప్రకాశంజిల్లాకు జి. భరత్ కుమార్, మార్కాపురం జిల్లాకు కొక్కెర శ్రీనివాస్ యాదవ్, నెల్లూరు జిల్లాకు చంద్రశేఖర్ భీమినేని, తిరుపతి జిల్లాకు పి.వి. కృష్ణారెడ్డి, చిత్తూరు జిల్లాకు కె.వి. లక్ష్మీనారాయణ రెడ్డి, అన్నమయ్య జిల్లాకు టి.డి. వరప్రసాద్, కడప జిల్లాకు చిట్టిబాబు, శ్రీ సత్యసాయి జిల్లాకు కునిగిరి నీలకంఠ, అనంతపురంజిల్లాకు బెస్తా చంద్రప్ప, కర్నూలు - జిల్లాకు సండిరెడ్డి శ్రీనివాసులు, నంద్యాల జిల్లాకు పిడి పార్థసారథి (జిల్లా ఇన్‌ఛార్జి), జిల్లాకు అంబిలి కాశీ విశ్వనాథ్ (జిల్లా కోఇన్‌ఛార్జి). పార్టీని గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మరింత పటిష్ఠంగా తీర్చిదిద్దేందుకు ఈ నియామకాలు దోహదపడతాయని రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా ఇన్‌ఛార్జిలు స్థానిక నాయకత్వంతో సమన్వయం చేసుకుంటూ సంస్థాగత కార్యక్రమాలను వేగవంతం చేయాలని, పార్టీ విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆయన సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేయడమే ఈ నియామకాల ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు.

# కాకినాడలో మాయాబజార్
## 'స్టాక్ మార్కెట్' పేరిట రూ 400 కోట్లకు టోపీ
### కంపెనీ కార్యాలయం ముట్టడి
### బాధితులపై దౌర్జన్యం
### రంగంలోకి దిగిన పోలీసులు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూన్ 30 (ప్రభాతవార్త):** అడ్డదారిలో ఆశ చూపిస్తే అక్షరాలా ముంచేస్తారని కాకినాడలో మరోసారి నిరూపిత మైంది. అధిక లాభాల ఆశచూపి, అమాయక ప్రజల రక్తాన్ని పిండేసి, చివరకు చేతులెత్తేసే మోసపూరిత సంస్కృతికి ఇదో నిదర్శనం. పలువురు బాధితులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలో ఖిజెన్సిస్‌ఖి అనే స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ కంపెనీ రాత్రికి రాత్రే బోర్డు తిప్పేసేందుకు ప్రయత్నిస్తోందన్న ప్రచారం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. సుమారు 400 కోట్ల రూపాయల మేర పెట్టుబడులు గుంజేసి, ఇప్పుడు బాధితుల పొట్ట గొట్టేందుకు సిద్ధమవ్వడం తో సర్వం కోల్పోతామంటూ బాధితులు సదరు కంపెనీ కార్యాలయాన్ని ముట్టడించారు.

స్థానిక సిద్ధార్థ నగర్ లోని ఈ ఖిజెన్సిస్‌ఖి మాయా బజార్‌లో మా దగ్గర పెట్టుబడి పెట్టండి.. లాభాల పంట పండిస్తామంటూ నిర్వాహకులు నమ్మబలికారు. రెండు లక్షలు పెట్టుబడి పెడితే ప్రతి నెల రూ. 30 వేల నుండి రూ. 40 వేల వరకు లాభాలు ఇస్తామని ఆశ పెట్టారు. ఆరు లక్షలు పెట్టుబడి పెడితే కేవలం 20 నెలల్లోనే ఆ సొమ్మును రెట్టింపు చేసి చేతిలో పెడతామని మాయమాటలు చెప్పారు. ఇలా ఒక్కొక్కరికి ఒక్కో రకమైన ఆఫర్లతో వల విసిరి.. ఏకంగా 7 వేల మందిని తమ మాయలో పడేశారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల ప్రజలు తమ కష్టార్జితాన్ని, అప్పులు తెచ్చి మరీ ఈ కంపెనీలో దాదాపు రూ. 400 కోట్లు పెట్టుబడిగా పెట్టారు.

కొంతకాలంగా ఈ కంపెనీ నిర్వహణపై ఆరోపణలతో బోర్డు తిప్పేసేందుకు ప్రయత్నిస్తోందనే నమ్మకమైన సమాచారం బాధితులకు అందింది. దీంతో దిగ్భ్రాంతికి గురైన వందలాది మంది బాధితులు ఒక్కసారిగా కంపెనీ కార్యాలయానికి చేరుకుని ముట్టడించారు. తమ అసలు సొమ్ము తమకు ఇచ్చేయాలని బాధితులు నిలదీయగా.. సదరు కంపెనీ నిర్వాహకులు అత్యంత బరితెగింపుగా సమాధాన మిచ్చారు. మీకు నచ్చిన వారితో చెప్పుకోండి.. మా లీగల్ లాయర్ వచ్చి మీకు నోటీసుల ద్వారా సమాధానం చెప్తారు" అంటూ మాట్లాడటంతో బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ భారీ స్కామ్ వెనుక రాజకీయ హస్తం ఉందనే ఆరోపణలు ఇప్పుడు మరింత దుమారం రేపుతున్నాయి. కాకినాడ నగరానికి చెందిన ఒక ప్రజా ప్రతినిధి, అనుచరుడిగా చెప్పుకునే ఒక వ్యక్తి కంపెనీ వద్దకు వచ్చి, న్యాయం కావాలని అడుగుతున్న బాధితులను తీవ్రంగా బెదిరింపులకు గురిచేసినట్లు బాధితులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. "డబ్బులు పోయి రోడ్డున పడ్డాం అని అడుగుతుంటే.. అధికార పార్టీ నేతల అనుచరులు వచ్చి మమ్మల్ని బెదిరించడం ఏంటి అని బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జెన్సిస్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుందనే సమాచారం అందుకున్న సర్పవరం సీఐ సి.హెచ్. ప్రకాష్ తన సిబ్బందితో కలిసి తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా న్యాయం చేయాలంటూ బాధితులు ఒక్కసారిగా సీఐని చుట్టుముట్టి వాగ్వివాదానికి దిగారు. బాధితుల ఆందోళనను శాంతింపజేసిన సీఐ ప్రకాష్ మాట్లాడుతూ బాధితులంతా కలిసి రాతపూర్వకంగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఫిర్యాదు అందిన వెంటనే పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, పోలీసులు తక్షణమే స్పందించి, కంపెనీ ఆస్తులను జప్తు చేసి తమ సొమ్మును తిరిగి ఇప్పించాలని, బాధితులను బెదిరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాకినాడ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

1-7Pg3exHMNWJQETBK_1-7Pg3exHMNWJQETBK.qxd 01/Jul/26 12:04 AM Page 1



# మరింత పటిష్టంగా సమాచార నెట్‌వర్క్

- కనెక్టివిటీ టూ లాస్ట్ మైల్ అనేదే లక్ష్యం
- డిజిటల్ లిటరసికీ ఆపరేటర్ల సహకారం అవసరం
- సెల్ టవర్ నెట్‌వర్క్ బలోపేతంపై సర్వీసు ప్రొవైడర్లకు ఆదేశాలు
- రాష్ట్రంలో కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

**విజయవాడ, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** సమాచార నెట్‌వర్క్ అంశంలో ఆంధ్రప్రదేశ్‌ను ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయటం ద్వారా సమాచార వ్యవస్థలో లాస్ట్ మైల్ కనెక్టివిటీ దిశగా పని చేస్తున్నామని సీఎం వెల్లడించారు.

కమ్యూనికేషన్ నెట్ వర్క్‌ను మరింత బలోపేతం చేసేలా కృషి చేయాలని సూచించారు. క్యాంపు కార్యాలయంలో రాష్ట్రంలో కమ్యూనికేషన్ నెట్‌వర్క్ పై సిఎం వివిధ సర్వీసు ప్రొవైడర్లు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. మొబైల్ కవరేజి విషయంలో సర్వీసు ప్రొవైడర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిఎం చెప్పారు. మారుమూల ప్రాంతాల్లో సెల్ టవర్లు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్ ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎపి వ్యాప్తంగా కమ్యూనికేషన్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేలా మరిన్ని సెల్ టవర్లను ఏర్పాటు చేయాలని వివిధ కంపెనీల ప్రతినిధులకు సూచనలు జారీ చేశారు.



ప్రస్తుతం రాష్ట్రంలో 30,694 సెల్ టవర్లు ఉన్నాయని.. మరో 2310 సెల్ టవర్లను ఏర్పాటు చేయాల్సి ఉందని ఐటీ, కమ్యూనికేషన్ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ సిఎంకు వివరించారు. దీనిపై స్పందించిన సిఎం అవసరమైన మేరకు సర్వీసు ప్రొవైడర్‌లకు ప్రభుత్వం నుంచి సహకారం అందిస్తామని తెలిపారు. వంద రోజుల్లో సెల్ టవర్లను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. భౌగోళికంగా కవరేజి లేని ప్రాంతాల వివరాలను ఇస్తామని స్పష్టం చేశారు. రాజధాని అమరావతిలో ఫైబర్ ద్వారా సమాచార నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తున్నామని ఎక్కడా తవ్వకాలు జరక్కుండా ప్రతీ ఇంటికీ ఫైబర్ నెట్‌వర్క్ అందిస్తామ న్నారు. ఎపి వ్యాప్తంగా 1,69,638 కిలోమీటర్ల ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్‌తో పాటు 28.67 లక్షల బ్రాడ్ బ్యాండ్ కనెక్షన్లు ఉన్నాయని అధికారులు తెలిపారు.

**డిజిటల్ లిటరసీకి సహకారం:** రాష్ట్రవ్యాప్తంగా మొబైల్ వినియోగదారుల్లో డిజిటల్ లిటరసీకి కూడా సర్వీసు ప్రొవైడర్లు సహకారం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ప్రభుత్వం వాట్సప్ గవర్నెన్సు మనమిత్ర ద్వారా అందిస్తున్న వివిధ సేవలు, సంజీవని పథకం సహా వివిధ టచ్ పాయింట్‌ల సేవల్ని సమర్ధంగా వినియోగించుకునేలా ఈ డిజిటల్ లిటరసీ ఉపకరిస్తుందన్నారు.

ప్రజలను డిజిటల్ లిటరేట్లుగా మారిస్తే మొబైల్ ఫోన్ ద్వారా ఎక్కువ సేవలు అందించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. త్వరలో ఏఐ ఆగ్రానమిస్ట్, ఏఐ డాక్టర్, ఏఐ ట్యూటర్ లాంటి వేర్వేరు సేవల్ని వినియోగదారులు ఉపయోగించు కునేందుకు అవకాశం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివరించారు. కుప్పం నియోజకవర్గంలో పైలట్ ప్రాతిపదికన అన్ని ప్రాంతాలకూ పూర్తి మొబైల్ కవరేజి అందిస్తున్నట్టు తెలిపారు.

ఈ సమీక్షకు ఐటీ, కమ్యూనికేషన్ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్, డిపార్ట్ మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్, బిఎస్ఎన్ఎల్, ఎయిర్ టెల్, జియో, వొడాఫోన్ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు.

# జిల్లా కోర్టుల వద్ద అంబులెన్స్‌లు

**విజయవాడ, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లో కోర్టుల వద్ద అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ కలిగిన '108' అంబులెన్స్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రతి జిల్లా కోర్టు వద్ద ఒక అంబులెన్స్ ఏర్పాటు చేయాలని హైకోర్టు రిజిస్ట్రార్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సిఇఒ పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 13 జిల్లా కోర్టుల వద్ద అందుబాటులో ఉంచనున్న అంబులెన్సులకు ఏటా రూ.3.93 కోట్లు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అలానే సిఆర్‌డిఎ పరిధిలోని రాయపూడి, ఐనవోలు, ఉండవల్లి వద్ద 3 కొత్త 108 అంబులెన్సులు అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

# ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారెంటీ స్కీమ్ 5.0లో రూ.1280.43 కోట్ల పంపిణి

- ఒక్కో రుణ గ్రహీతకు గరిష్టంగా రూ.100 కోట్ల పరిమితి
- రాష్ట్రంలో 3606 ఖాతాలకు ప్రయోజనం

**విజయవాడ, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** పశ్చిమ ఆసియా (మిడిల్ ఈస్ట్) దేశాలలో జరుగుతున్న సంక్షోభం వల్ల ఇబ్బందులు పడుతున్న వ్యాపారాలను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారెంటీ స్కీమ్ 5.0ను తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా వ్యాపారాలకు అదనపు రుణ సహాయం అందుతుంది. బ్యాంకులు లేదా ఇతర ఆర్థిక సంస్థలు ఇచ్చే ఈ అదనపు రుణాలపై ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తుంది. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఇ) 100 శాతం, మిగిలిన సంస్థలకు 90శాతం రుణ భరోసా ఉంటుంది. 'స్టాండర్డ్' లోన్ ఖాతాలు కలిగి ఉన్నవారు ఈ పథకానికి అర్హులు. వీరు 2025-26 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం (క్యూ4)లో వాడిన వర్కింగ్ క్యాపిటల్‌పై అదనంగా 20శాతం వరకు రుణం తీసుకోవచ్చు. అయితే ఈ అదనపు రుణం రూ.100 కోట్లకు మించకూడదు. ఈ పథకం కింద 31 మార్చి 2027 లోపు లోన్ మంజూరు కావాలి. అలాగే 30 జూన్ 2027 నాటికి లోన్ డబ్బులు చేతికి అందాల్సి ఉంటుంది. ఈ పథకాన్ని నేషనల్ క్రెడిట్ గ్యారెంటీ ట్రస్టీ కంపెనీ లిమిటెడ్ పర్యవేక్షిస్తుంది.

# నేడు ఢిల్లీకి మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి

**విజయవాడ, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి రెండు రోజుల పాటు ఢిల్లీలో పర్యటిస్తారు. ఆయన బుధవారం సాయంత్రం ఢిల్లీ చేరుకుంటారు. జులై 2, 3 తేదీల్లో హస్తినలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు, కేంద్ర పోర్టులు, షిప్పింగ్ జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్‌తో భేటీ అవుతారు. మంత్రి బిసి జనార్దన్ రెడ్డితో పాటు ఆర్అండ్‌బి స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి కృష్ణబాబు, మారిటైమ్ బోర్డు సిఇఒ ప్రవీణాదిత్య, ఇతర ఉన్నతాధికారులు పాల్గొంటారు.

# ఇఎపిసెట్ ఫలితాల విడుదల వాయిదా

**విజయవాడ, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి ఇఎపిసెట్ ఫలితాల విడుదల వాయిదా పడింది. జులై 2న ఫలితాలు విడుదల చేసే అవకాశం ఉన్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తోన్న ఎప్‌సెట్ ఫలితాలు మంగళవారం విడుదల చేయనున్నట్లు ప్రకటించగా అవి కాస్తా వాయిదా పడింది. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. అయితే సాంకేతికంశాల కారణంగా మరో రెండు రోజులు తరువాత విడుదలయ్యే అవకాశం ఉంది. మే 12 నుంచి 20 వరకు ఎప్‌సెట్ పరీక్షలు జరిగిన సంగతి తెలిసిందే. దాదాపు 3.29లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. షెడ్యూల్ ప్రకారమైతే జూన్ 1 నాటికే ఈ ఫలితాలు వెలువడాల్సి ఉంది. అయితే, ఇంటర్ మార్కులకు 25శాతం వెయిటేజీ ఉండటంతో ఏ ఒక్క విద్యార్థికీ నష్టం జరగకూడదనే ఉద్దేశంతో ద్వితీయ ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు, సిబిఎస్ఇ రివైజ్డ్ ఫలితాలు పూర్తి స్థాయిలో వచ్చే వరకు అధికారులు ఆగడంతో జాప్యం జరిగిందని సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. ఎంతో ఎదురు చూసిన విద్యార్థులకు మళ్లీ నిరాశే ఎదురైంది.

# 3న కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులకు శ్రీకారం

- నంద్యాల ఎంపి బైరెడ్డి శబరి



**విజయవాడ, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులకు ముహూర్తం ఖరారైంది. జులై 3న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారికంగా నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు నంద్యాల ఎంపి బైరెడ్డి శబరి తెలిపారు. కడప స్టీల్ ప్లాంట్ రాయలసీమ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్న ఆమె, మాటలకే పరిమితం కాకుండా చేతల్లో చూపించే ప్రభుత్వంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ నిర్మాణంలో కనీసం కాంపౌండ్ వాల్ కూడా నిర్మించలేదని విమర్శించారు. 2018 డిసెంబర్ 27న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే కడప స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. రాయలసీమపై వెనుకబడిన ప్రాంతం అనే ముద్రను తొలగించి 'రాయల్ సీమ'గా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆమె చెప్పారు. హార్టికల్చర్, ఎలక్ట్రానిక్స్, పరిశ్రమల హబ్‌గా రాయలసీమను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందన్నారు. గత వైసిపి ప్రభుత్వం ఎన్నికల ముందు కొబ్బరికాయలు కొట్టి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కడప స్టీల్ ప్లాంట్ కేవలం ఒక పరిశ్రమ మాత్రమే కాదని, వేలాది మంది యువతకు ఉపాధి, అనేక కుటుంబాలకు భవిష్యత్తుకు భరోసా కల్పించే ప్రాజెక్టు అని పేర్కొన్నారు. విద్యుత్, నీటి సరఫరా, రహదారులు వంటి అవసరమైన మౌలిక సదుపాయాలను సిద్ధం చేసిన తర్వాతే నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు దాదాపు 800 కంపెనీలు పెట్టుబడులతో ముందుకొచ్చాయని పేర్కొంటూ, గత ప్రభుత్వం రాయలసీమ అభివృద్ధికి ఏం చేసిందో సమాధానం చెప్పాలని ఎంపి శబరి డిమాండ్ చేశారు.

# జ్యుడీషియల్ జిల్లాల పునర్విభజన, కొత్త కోర్టుల ఏర్పాటు చేయాలి

- సిఎం చంద్రబాబుకు ఎపి జ్యుడీషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ వినతి



**విజయవాడ, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లాల పునర్విభజన తర్వాత తలెత్తిన సాంకేతిక పరమైన ఇబ్బందులను పరిష్కరించాలని, జ్యుడిషియల్ జిల్లాల పునర్విభజన, కొత్త కోర్టులను ఏర్పాటు చేయాలని ఎపి జ్యుడిషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేసింది. ఈమేరకు క్యాంపు కార్యాలయంలో ఎపి జ్యూడిషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సిఎంను కలిసి వివిధ అంశాలను వివరించారు. జ్యూడిషియల్ అధికారుల సమస్యలు, సంక్షేమం సహా అసోసియేషన్ భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని కోరారు. జ్యూడిషియల్ అధికారుల కుటుంబ సభ్యులకు క్యాష్ లెస్ వైద్య చికిత్స సౌకర్యాన్ని కల్పించటంతో పాటు సాఫ్ట్ లోన్ పరిమితిని కూడా పెంచాలని అసోసియేషన్ ప్రతినిధులు ముఖ్యమంత్రిని కోరారు. అలాగే ఇంటి స్థలాలను కూడా కేటాయించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ ప్రతినిధులు తన దృష్టికి తెచ్చిన అంశాలపై సిఎం సానుకూలంగా స్పందించారు. కొత్త కోర్టుల ఏర్పాటు, జ్యుడిషియల్ జిల్లాల పునర్విభజన వంటి అంశాల గురించి సిఎం అడిగి తెలుసుకున్నారు. ఈ అంశాలన్నిటినీ పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని సిఎం అసోసియేషన్ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. జ్యూడిషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి.చక్రపాణి, ఉపాధ్యక్షులు జె. శ్రీనివాసరావు, కె.శైలజ, ప్రధాన కార్యదర్శి ఎన్.రమేష్ నాయుడు, సంయుక్త కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్, కార్యవర్గ సభ్యుల వెన్నెల, రాధారాణి ముఖ్యమంత్రిని కలిశారు.

# వెదుళ్లవలసలో దారుణం

- ఇద్దరు చిన్నారులను హత్య చేసిన తల్లి
- అనంతరం ఆత్మహత్యాయత్నం

**ఆముదాలవలస (శ్రీకాకుళం జిల్లా), జూన్ 30 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం వెదుళ్ళవలస గ్రామానికి చెందిన కూర్మాపు వరలక్ష్మి భర్త రమణ(30)రజక కులం అను ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు సంతానం, పెద్ద పాప పేరు కూర్మాపు భవాని, వయస్సు 3 సం.లు, రెండో పాప పేరు కూర్మాపు చాందిని, వయస్సు 4 నెలలు. వరలక్ష్మి భర్త రమణ కూలి పనులు నిమిత్తం నల్లగొండలో ఉన్నారు. ఈమెతో పాటు అత్త కూర్మాపు లక్ష్మి వెదుళ్ళవలస గ్రామంలో ఉంటున్నారు. రాత్రి వరలక్ష్మి తన ఇద్దరు పిల్లలతో కలిసి ఇంటిలో పడుకోగా ఆమె అత్త లక్ష్మి, లక్ష్మికి అమ్మమ్మ కూడా ఉన్నారు. ఇంటి బయట ఇద్దరూ పడుకున్నారు. ఉదయం ఇంటి బయట పడుకున్న అత్త లక్ష్మి మంగళవారం వేకువ జామున నాలుగు గంటలకు లేచి ఇంటి తలుపులు తీసేసరికి వరలక్ష్మి తన ఇద్దరు పిల్లలకు పీక కోసి తాను కూడా పీక కోసుకొని ఉన్నది. ఇద్దరు ఆడ పిల్లలు చనిపోయి ఉన్నారు. అత్త లక్ష్మి వారిని చూసి కేకలు వేయడంతో ఇరుగు పొరుగు వారు వచ్చి వరలక్ష్మి కొన ఊపిరితో ఉండగా గ్రామస్తులు 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి వరలక్ష్మిని తరలించారు. అత్త లక్ష్మి, కోడలు వరలక్ష్మి నిరంతరం గొడవలు పడేవారని చుట్టుపక్కల వారు చెప్పుకుంటున్నారు. అత్త లక్ష్మి నిరంతరం కోడలు వరలక్ష్మికి ఇద్దరు ఆడపిల్లలు పుట్టారని వేధించడంతో మనస్థాపానికి గురై వరలక్ష్మి ఇద్దరు పిల్లలను పీక కోసి తను కూడా పీక కోసుకున్నట్లు పరిసర ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. వరలక్ష్మి పరిస్థితి కూడా విషమంగా ఉందని బోగట్టా. వరలక్ష్మి ఆరోగ్యం బాగుపడితే నిజాలు బయటకు వస్తాయి. వీటిపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తే మరిన్ని నిజాలు బయటికి వస్తాయని ఆయా గ్రామస్తులు అంటున్నారు. క్షతగాత్రులు చిన్న పిల్లలను చూసి గ్రామస్తులు, కుటుంబ సభ్యులు రోదనాలతో బోరుమని విలపించారు. సంఘటన స్థలానికి డిఎస్పీ వివేకానంద, సిఐ శ్రీనివాసరావు పరిశీలించారు. వీటిపై ఆముదాలవలస ఎస్సై సనపల బాలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సిట్ లీగల్ అడ్వైజర్‌గా 'బైరా'



**విజయవాడ కార్పొరేషన్, జూన్ 30 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కల్గించిన గాదె సాయికృష్ణ లాకప్‌డెత్ కేసులో దర్యాప్తు కోసం ఏర్పాటు చేసిన సిట్‌కు డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ బైరా రామకోటేశ్వరరావును లీగల్ అడ్వైజర్‌గా నియామకం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో సిట్ దర్యాప్తుకు చట్టపరమైన సలహాల ను అందించడం,సాక్ష్యాధారాలను పరిశీలించ డం, దర్యాప్తు నివేదికలను వెట్టింగ్ చేయడం వంటి భాధ్యతలను ఆయన నిర్వహించనున్నారు.

# నేడు నెల్లూరు జిల్లాలో సిఎం పర్యటన

- పొన్న పరివారిపాలెంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణి
- గూడూరు నియోజకవర్గ అభివృద్ధిపై అధికారులతో ఉన్నత సమీక్ష
- ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

**చిల్లకూరు (నెల్లూరు), జూన్ 30 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జులై 1వ తేదీన చిల్లకూరు మండలం, పొన్నపరవారి పాలెం పర్యటించనున్నారు. ఈ సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. జులై 1న రాష్ట్ర ముఖ్యమంత్రి గూడూరు నియోజకవర్గం, పొన్న పరివారిపాలెంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం సందర్భంగా రానున్న సందర్భంగా, మంగళవారం చిల్లకూరు మండలం, పున్నపువారిపాలెంలో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, జేసి మొగిలి వెంకటేశ్వర్లులతో కలసి ఏర్పాట్లపై కలెక్టర్ హిమాన్షు శుక్లా పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి జిల్లా అధికారులకు వివిధ బాధ్యతలను అప్పగించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా ప్రణాళికా బద్ధంగా గట్టి ఏర్పాట్లు చేయాలని విధులను కేటాయించిన అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలలో ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సంభందిత అధికారులను ఆదేశించారు. హెల్త్ క్యాంపులు,



హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖాధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనులు పక్కాగా వుండాలని, అలాగే త్రాగునీటి కొరత లేకుండా చూడాలని సంబంధిత అధికారు లను ఆదేశించారు. హెలిప్యాడ్, బ్యారికేడింగ్ తదితర ఏర్పాట్లను ఆర్ అండ్ బి అధికారులు పటిష్టంగా చేపట్టాలన్నారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు ప్రణాళిక బద్దంగా ఏర్పాట్లను పూర్తిచేసి విజయవంతం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో నూతన పరిశ్రమలు రానున్నాయని తద్వారా యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు మెరుగుపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. చుట్టుపక్కల గ్రామాల వారిని ముఖ్యమంత్రి పర్యటనకు వచ్చే అవకాశం ఉందని సుమారు 5000 నుంచి 7000 దాకా హాజరు కానున్నారని ఆయన తెలిపారు. గూడూరు నియోజక వర్గంలో అధిక సంఖ్యలో పెట్టుబడులు రానున్నాయని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు.

గూడూరు నియోజకవర్గ అభివృద్ధికి ఫర్నిచర్, కృష్ణపట్నం పోర్టు సిటీ తదితరాలపై ముఖ్యమంత్రి రివ్యూ చేయనున్నారని, అలాగే నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి నివేదికలు గౌరవ ముఖ్యమంత్రికి సమర్పించనున్నామని ఆయన తెలిపారు.

భారీ బందోబస్తు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనలో ఎలాంటి సంఘటనలో జరగకుండా నేందుకు 570 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని అందరూ సమన్వయంతో పనిచేసి ముఖమంత పర్యటనను విజయవంతం చేయాలన్నారు

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఏఎస్‌పి సౌమ్య, గూడూరు ఆర్డీవో అరుణ కుమారి, ఆత్మకూరు ఆర్డీవో పావని, మెప్మా పిడీ, కిరణ్ కుమార్, డిపివో వసుమతి, తెలుగు గంగ ప్రత్యేక అధికారులు వంశీకృష్ణ, కేశవర్ధన్ రెడ్డి, అన్ని శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో జనసేన బలోపేతమే లక్ష్యం

- మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** క్షేత్రస్థాయిలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, క్షేత్రస్థాయి నుండి బలమైన నాయకత్వాన్ని పెంపొందించాలనేదే జనసేనాని పవన్ కళ్యాణ్ సంకల్పం అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ జనసేన పార్టీ పరిశీలకులు కందుల దుర్గేష్ వెల్లడించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ ఆధ్వర్యంలో జనసేన పార్టీ బలోపేతం కోసం క్షేత్రస్థాయిలో పనిచేసేందుకు ముందుకు వచ్చిన వారి నుండి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను మంత్రి కందుల దుర్గేష్ అధికారికంగా ప్రారంభించారు. జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో పార్టీ పట్ల నిబద్ధత కలిగిన ప్రతి జనసైనికుడి ఆసక్తి, శక్తి సామర్థ్యాలు, రాజకీయ అనుభవం. పరిజ్ఞానం, ఆర్థిక, సామాజిక నేపథ్యాల ఆధారంగా వారు ఏ స్థాయిలో పని చేసేందుకు ఆసక్తిగా ఉన్నారో తదనుగుణంగా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ స్వయంగా దరఖాస్తుదారుల నుండి అప్లికేషన్లను స్వీకరించారు. దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేసేందుకు క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. విజయవాడ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలైన విజయవాడ ఈస్ట్, విజయవాడ వెస్ట్, విజయవాడ సెంట్రల్, జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం, తిరువూరు ఈ ఏడు నియోజకవర్గాలకు విడివిడిగా డెస్కులను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో తొలి రోజే భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. అబ్జర్వర్‌గా వ్యవహరిస్తున్న మంత్రి కందుల దుర్గేష్‌తో పాటు సీనియర్ మెంబర్స్, సాధక్ రిప్రజెంటేటివ్స్, పార్లమెంట్ అబ్జర్వర్స్ టీమ్‌కు చెందిన 28 మంది సభ్యులు ప్రతి ఒక్క అప్లికేషన్‌ను అత్యంత సునిశితంగా పరిశీలించారు. దరఖాస్తులు నింపడంలో హెల్ప్ డెస్క్ సభ్యులు దరఖాస్తుదారులకు పూర్తి



సహాయసహకారాలు అందించారు. ప్రధానంగా పార్లమెంట్ కమిటీ, అసెంబ్లీ కమిటీ, మండల, గ్రామ కమిటీ, పార్టీ అనుబంధ విభాగాల్లో భాగంగా లోక్ సభ, అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్, లోక్ సభ, అసెంబ్లీ నియోజకవర్గ కమిటీతో పాటు లీగల్ విభాగం, విద్యార్థి విభాగం, మీడియా అండ్ కమ్యూనికేషన్ విభాగం, ఐటీ మరియు డేటా మేనేజ్ మెంట్, పర్యావరణ విభాగం, సేవాదళ్, వీరమహిళ విభాగం, పాడ్ క్యాస్ట్ విభాగం, చేనేత విభాగం, డాక్టర్స్, ఎన్ఆర్ఐ విభాగం, సైన్స్ అండ్ టెక్నాలజీ, లాజిస్టిక్స్, అధికార ప్రతినిధులు, యువజన విభాగం, సాంస్కృతిక విభాగం, మత్స్యకార విభాగం, శిక్షణ, అవగాహన కార్యక్రమాలు, పంచాయతీ, మండల కమిటీ వంటి పలు కీలక కమిటీలలో పనిచేసేందుకు జనసేన పార్టీ ఆశావహులకు అవకాశం కల్పించింది. ఈ నేపథ్యంలో మంత్రి కందుల దుర్గేష్ ప్రతి దరఖాస్తుదారుడితో స్వయంగా మాట్లాడారు. అభ్యర్థుల వివరాలు, వారి సేవా నిరతిని అడిగి తెలుసుకున్న మంత్రి దుర్గేష్ దరఖాస్తుదారులందరికీ ప్రత్యేకంగా ఆల్ ది బెస్ట్ చెప్పారు. అప్లికేషన్ లపై అంతిమ నిర్ణయం జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ దే అని, తాము అందుకు ప్రాతిపదిక అని తెలిపారు.

# రైతుల ప్రయోజనాలే తమకు పరమావధి

- మంత్రి రాంప్రసాద్ రెడ్డి



**విజయవాడ, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** మామిడి రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి రాంప్రసాద్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ మేరకు ఆయన కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.. గత ఏడాది కూడా కూటమి ప్రభుత్వం రైతులకు కేజీకి రూ.4 చొప్పున అదనంగా చెల్లించి ఆదుకుందని గుర్తుచేశారు. ఈ ఏడాది కూడా అదే రీతిన కేజీకి రూ.4 ముందస్తుగా అందిస్తూ మామిడి కొనుగోళ్లను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. ఈసారి పంట దిగుబడి ఊహించిన దానికంటే చాలా ఎక్కువగా రావడం వల్లే కొనుగోళ్లపై తాత్కాలికంగా కొంత ఒత్తిడి పెరిగిందని, అంతకుమించి మరేమీ లేదని ఆయన స్పష్టం చేశారు. గత ఏడాది కూడా మామిడి రైతుల కోసం ప్రభుత్వం సుమారు రూ.190 కోట్లు వెచ్చించి అండగా నిలిచిందని ఈ సందర్భంగా ఆయన వివరించారు. రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ఒకవేళ కొనుగోళ్ల ప్రక్రియలో ఎక్కడైనా జాప్యం జరిగితే మాత్రం సంబంధిత ఫ్యాక్టరీలపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ముఖ్యంగా వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సంబంధించిన, ఆ పార్టీ సానుభూతి కంపెనీలు కొనుగోళ్ల విషయంలో కావాలని అలసత్వం ప్రదర్శిస్తే మాత్రం ఊరుకునేది లేదని తేల్చి చెప్పారు. తమ ప్రభుత్వానికి రైతుల ప్రయోజనాలే పరమావధి అని స్పష్టం చేసిన మంత్రి. కేవలం రాజకీయ పబ్బం గడుపుకోవడం కోసం రైతుల సమస్యలను వాడుకోవాలని చూడొద్దంటూ వైసిపి నేతలకు హితవు చెప్పారు.

# మాజీ సిఐ నాగరాజు కస్టడీ పిటీషన్‌పై ముగిసిన వాదనలు... నేడు ఉత్తర్వులకై వాయిదా

**విజయవాడ కార్పొరేషన్, జూన్ 30 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కల్గించిన గాదె సాయికృష్ణ లాకప్‌డెత్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ సిఐ నాగరాజు కస్టడీ పిటీషన్‌పై విజయవాడ కోర్టులో మంగళవారం వాదనలు ముగిసాయి. నాగరాజును తదుపరి విచారణ నిమిత్తం 12 రోజుల పాటు తమ కస్టడీకివ్వాలంటూ సిట్ ప్రత్యేక దర్యాప్తు బృందం న్యాయస్థానంలో పిటీషన్‌ను దాఖలు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఈ పిటీషన్‌పై నిందితుడైన సిఐ నాగరాజు తరపున అతని న్యాయవాదులు సమాధానాన్ని దాఖలు చేశారు. వాదోపవాదాల అనంతరం కస్టడీ పిటీషన్‌ను నేటికి ఉత్తర్వుల నిమిత్తం వాయిదా వేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.,

**ఆర్ఎంపి డాక్టర్ విచారణ:** గాదె సాయికృష్ణ అదృశ్యం కేసులో అతను కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో గాయాలపాలైనప్పుడు ఓ ఆర్ఎంపి డాక్టర్‌తో వైద్యం చేయించారు. అతనిని మంగళవారం సిట్ బృందం విచారించినట్లు తెలియవచ్చింది.సాయికృష్ణకు వైద్యం ఎక్కడ చేయించారు, కృష్ణలంక పోలీస్‌స్టేషన్ లోనా ప్రైవేటు హోటల్ లోనా అనే విషయంతో పాటు సదరు ఆర్ఎంపి డాక్టర్‌ను ఎవరు పిలిపించారు అనే విషయంపై కూడ సదరు డాక్టర్‌ను సిట్ బృందం విచారించినట్లు సమాచారం.

**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)**
Rayapudi, Thullur Mandal, Amaravati-522237 (A.P.)
NIT No: 02/MAU61-USI0HB(OTH)/93/2026-HB/3rd call Dt.: 29-06-2026
**E PROCUREMENT TENDER NOTICE (Third Call)**
Name of Work: "Engaging of Technical persons for Carpenters, Plumbers, Operators for Operation & Maintenance of Secretariat Buildings: 1 to 6 and WTP & STP at AP Secretariat, IGC, Velagapudi for 24 Months" - **Estimate Cost Rs.1,44,00,000/-**. The bid can be downloaded on AP e-procurement portal from **01.07.2026 to 08.07.2026 up to 14.00 Hrs.** Due date for submission of Bid **08.07.2026 up to 15.00 Hrs.**, Technical bid opening **08.07.2026 @16.00 Hrs**. For further details please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in**
Sd/- Commissioner, APCRDA, Rayapudi

1-7pg4_1-7pg4.qxd 30/Jun/26 10:26 PM Page 1




వార్త

అభిప్రాయాలు ఎప్పుడూ మార్చుకోని వ్యక్తి నిల్వ నీటితో సమానం. నిల్వ నీటిలో ఎన్నో జీవులు పెరుగుతాయి.

న- బెంజిమెన్ ఫ్రాంక్లిన్

# 'సర్' నిష్కళంకమేనా?

ఓటు హక్కు ఒకటే యువత భవిష్యత్‌ను నిర్మించుకునేందుకు ఉన్న ఏకైక ఆయుధమని నమ్ముతుంటాము. యువతే కాదు ఆలోచనా పరులు కూడా ఇలాంటి హక్కు ఉండటం కూడా అవసరం అని నమ్ముతుంటారు. 'ఓటనేది నా కూతుర్లాంటిది. అమ్ముకోను' అంటూ జనం సంబరపడిన రోజులూ ఉన్నాయి. కానీ ఓట్ల కోసం అభ్యర్థులు, పార్టీలు డబ్బులు విరజిమ్మడం ఓటు వేస్తారని డబ్బులు పంచి పెట్టడం నుంచి ఓడిన వాళ్ల తామిచ్చిన డబ్బు తిరిగి వసూలు చేసే పనిలో అకృత్యాలు.. ఇలా ప్రజాస్వామ్యంలో ధనస్వామ్యం చొరబడిన సందర్భాలు ఇప్పుడు వికటిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో 'ఓటు' దుర్వినియోగం పడ్తోందని, స్థానికంగా లేని వారికి ఓటు హక్కు నీయడం, ఆ ఓటును ఎవరో వేసేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో నకిలీ ఓట్లను తొలగించే విధానాన్ని కేంద్ర ఎన్నికల సంఘం (సర్) తెచ్చింది. ప్రక్రియను ప్రవేశపెట్టడం ఆహ్వానించదగినదే. అయినా ఓటు హక్కుకు మోర బిగించడమే గందరగోళానికి దారితీసింది. 'సర్' ప్రక్రియ చట్టబద్ధమేనని, కానీ వాటి కోసం అవలంబించే పద్ధతుల్లో మార్పులు తెచ్చుకోవాలని ఈ దేశ అత్యున్నత ధర్మాసనం అన్ని రాజకీయ పార్టీలకు, కేంద్ర ఎన్నికల సంఘానికి హితవు చెప్పింది. 'సర్' పేరుతో అసలుసిసలు ఓటర్లను జాబితాలోంచి తీసేస్తున్నారన్న ఆరోపణలమధ్య విపక్షాలు ఎత్తుగడలు తుత్తునియలు చేశారు ఎన్నికల కమిషన్ ప్రధాన అధికారి. అయినా ఏదో అనుమానం విపక్షాలను వెంటాడుతూనే ఉంది. బీహార్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, తదితర రాష్ట్రాల ఎన్నికలు జరిగాయి. కొన్ని చోట్ల ప్రభుత్వాలు మారడం వేరే అంశం. ఇంత ప్రక్షాళన జరిగినా కొన్ని చోట్ల అక్రమంగా తమ ఓట్లు తొలగించారన్న ఆవేదనలు ఇసిని వదల్లేదు. సాధారణ పౌరులెవరికీ 'సర్' పట్ల ఎలాంటి అసంతృప్తి లేదు. కానీ ప్రత్యేక బిఎల్‌ఒల ద్వారా ఎంతో జాగరూకతతో నిర్వహించిన ఈ ప్రక్రియలో ఓటు హక్కు కోల్పోయామని ఆందోళన చెందిన ఓటర్లు కూడా ఇప్పుడు ఒక్కక్కరూ బయటపడుతున్నారు. ప్రతి పథకానికి ప్రభుత్వ నిర్ణయాలకు నాణేనికి రెండువైపులా ఉంటాయి. వాటిని పాలకులు ఎప్పటికప్పుడు సరిచేయడంలోనే ఔచిత్యముంటుంది. ఎంతో విజయవంతంగా కొన్ని రాష్ట్రాల ఎన్నికలు నిర్వహించగలిగినా ఎప్పటికప్పుడు లోపభూయిష్టమైన విధానాలకు చెక్ పెట్టాల్సిందే. సుప్రీంకోర్టు జోక్యానికి వెళ్లినప్పుడు వారి సూచనలను మార్పు చేసే పద్ధతి నడుస్తున్నందున అన్నిటికీ సుప్రీం ఆమోద ముద్రకు ఎదురు చూస్తున్నాయి. ఈలోగా ఓటరు హక్కుకు దిక్కులేక కొందరు అభాగ్యులు ఆకాశంలోకి చూడటమే మిగిలింది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) జాబితాలో తన పేరు లేకపోతే తనను జైలుకు పంపుతారనే భయంతో తెలంగాణలోని హైదరాబాద్ నగరంలో బోరబండ ప్రాంతవాసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతనో సాధారణ కారు డ్రైవర్. ఎన్నికల సంఘ ప్రక్రియలో తన డాక్యుమెంట్లు సరిపోలడంలేదు. అదే జరిగితే తన కుటుంబం రోడ్డున పడ్తుందనే ఆవేదనతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఓటు హక్కు మీద బాధ్యత పెరిగిన చోట పర్వాలేదు. తాను ఓటు వేసే సమయం, సందర్భాన్ని సద్వినియోగ పరుచుకుంటారు. అవగాహన లేనివారు మాత్రమే ఆందోళనతో అయోమయంలో పడిపోతారు. కనుచూపుమేరలో చెప్పుకోదగిన ఎన్నికలులేని తెలంగాణలో ఓ వ్యక్తి తనువు చాలించాడంటే ఇంతకన్నా ఘోరం ఏమీ కనిపించదు. ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితా ఎంతో విశ్వసనీయత కలిగి ఉండటం అవసరమే. కానీ రాజకీయ పార్టీలోనూ, ఓటర్లలోనూ గందరగోళం సందేహాలకు తావిచ్చేవిధానంలో ఇంకా కొన్నిమార్పులు చేయాల్సి ఉంది. మృతిచెందిన వారి ఓట్లు తీయాల్సిందే. శాశ్వతంగా ఒక ప్రాంతంలో నివసించే వారిఓట్లు తొలగించరాదు. కొన్ని చోట్ల తాము వెళ్లినప్పుడు అక్కడ లేరనే సాకుతో సరైన నిర్ధారణ లేకుండా తొలగించడమంటే వారి ఓటు హక్కును ప్రశ్నించడమే. ఇంటింటికీ వెళ్లి ధృవీకరణద్వారా జాబితాలో నాణ్యతను సాధించవచ్చు. ఒకటి కన్నాఎక్కువ ప్రాంతాల్లో పేర్లు నమోదై, వారు మరో చోట శాశ్వతంగా మరో చోట నివసిస్తుంటే వారి 'ఓటు హక్కు' ఆ ప్రాంతానికే మార్చాలి. దీని బాధ్యత ఓటరు కు ఎంత ఉందో, ఎన్నికలు నిర్వహించే సంఘానికి అంతేబాధ్యత ఉంటుంది. కాకతాళీయంగా కాకుండా ఉద్యమంలా చేపట్టిన 'సర్' ప్రక్రియలో లోపాలను ఎన్నికల సంఘం సవరించుకోవాలి. ఎన్నోసార్లు ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ 'సర్' ప్రక్రియలో లోపభూయిష్ట విధానాలను సవరించుకుంటే ఎన్నో లక్షలమంది తమ ఓటు హక్కును కోల్పోతారని ఇవ్వాళ్టికీ కాంగ్రెస్ పార్టీ గొంతెత్తి విమర్శిస్తూనే ఉంది. అంటే 'సర్' లో ఇంకా లోపాలున్న మాటేగా. 'సర్' పూర్తిగా చట్టబద్ధమైన పారదర్శక ప్రక్రియ అనడంలో సందేహమే లేదు. కేంద్ర ఎన్నికల సంఘం తరచు సమీక్షలు చేయడం ద్వారా ఓటర్ల గుర్తింపునకు వెసులు బాటుగా అవగాహన కల్పించడం, వారి ఓటుకు చోటు లభించేటట్లు చేయడం అత్యంతావశ్యకం. అది సందేహమే కావచ్చు కానీ విశ్వసనీయత పెంచుకోవాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల సంఘానిదే. అవగాహనలోపం వల్ల అర్హులైన ఓటర్లు కూడా తమ 'ఓటుహక్కు'కు రోడ్డెక్కడం సహించరానిది. నాలుగు రోజుల క్రితమే 'సర్' అమలుకు ఏడాది పూర్తయింది. అయినా వివాదాలు, సద్దుమణగ లేదు. కేంద్ర ఎన్నికల కమిషన్‌కు, విపక్ష పార్టీలకు మధ్య అఘాతం సృష్టించి 6 కోట్ల ఓటర్లకు 'ఓటు' దిక్కు హక్కులేని వ్యవహారాన్ని కేంద్ర ఎన్నికల సంఘం మరోసారి సమీక్షించాలి. ఆది నుంచి ఈ ప్రక్రియపై నీలినీడలు కమ్ముకున్నందున సిఇసి 'సర్' పారదర్శకతను నిరూపించుకోవాలి.



ఆకలి రుచి ఎరుగనట్లే మనకు అత్యవసరమైన దాంట్లో తప్పులు కనిపించవు.

ఆస్కార్‌వైల్డ్



ఎప్పుడు, ఎలా చనిపోయేదీ నీవు నిర్ణయించలేవు. ఇప్పుడు ఎలా జీవించాలన్నదే నీవు నిర్ణయించగలవు.

రామకృష్ణ పరమహంస

# విద్యా ప్రయాణానికి డిజిటల్ చిరునామా

*ఏ సాంకేతికత అయినా విజయవంతం కావాలంటే కేవలం సౌకర్యం మాత్రమే సరిపోదు, వ్యవస్థపై ప్రజల్లో ఉండే నమ్మకం విశ్వసనీయతే కీలకమని గుర్తించాలి. గతంలో విద్యార్థి తన విద్యా ప్రయాణానికి సాక్ష్యంగా సర్టిఫికెట్ల సంచిని మోస్తూ కనిపించేవాడు, కానీ రేపటి రోజున అతని సమగ్ర విద్యా చరిత్ర కేవలం ఒకే ఒక్క డిజిటల్ గుర్తింపులో సురక్షి తం కాబోతోంది. ఆధార్ ఏ విధంగానైతే భారత పౌరుడి వ్యక్తిగత గుర్తింపులో విప్లవాత్మక మార్పులు తెచ్చిందో, అదే రీతిలో 'అపార్' భారతీయ విద్యార్థి అకడమిక్ అస్తిత్వాన్ని పునర్నిర్వచించనుంది. ఈ వ్యవస్థ విజయవంతమైతే, మన విద్యావ్యవస్థ కేవలం సర్టిఫికెట్ల సేకరణ నుండి విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి పెద్దపీట వేసే 'అభ్యాసక కేంద్రిత పర్యావరణ వ్యవస్థ'గా రూపాంతరం చెందుతుంది. వికసిత భారత్ లక్ష్య సాధనలో, డిజిటల్ ఇండియా నిర్మాణంలో విద్యారంగానికి ఇది ఒక చారిత్రాత్మక మైలురాయి.*



ఆచార్య దారపురెడ్డి సూర్యచంద్ర రావు

భారతదేశ విద్యా రంగం ప్రస్తుతం ఒక అప్రకటిత డిజిటల్ విప్లవానికి వేదికైంది. ఒకప్పుడు విద్యార్థులు తమ మార్కుల మెమోలు, బదిలీ, ప్రవర్తన్న, మైగ్రేషన్ డిగ్రీ సర్టిఫికెట్లవంటి అమూల్యమైన పత్రాలను భౌతికంగా భద్రపరుచుకోవడానికి ఎంతోప్రయాస పడాల్సి వచ్చేది. అవి ఏమాత్రం దెబ్బ తిన్నా లేదా పోగొట్టుకున్నా, తిరిగి పొందడం ఒక ప్రహసనంగా ఉండేది. అయితే, సాంకేతికత అందిపుచ్చుకుంటున్న నేటి తరుణంలో, విద్యార్థి అకడమిక్ ప్రస్థానమంతా ఒకే డిజిటల్ గుర్తింపుతో ముడిపడే నూతన శకం ఆరంభమైంది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రరి) 'ఒక దేశం ఒకే విద్యార్థి గుర్తింపు' అనే నినాదంతో రూపుదిద్దుకున్న ఈ విధానం, ప్రాథమిక విద్య నుండి ఉన్నత విద్య, వృత్తి నైపుణ్య శిక్షణ వరకు విద్యార్థి సాధించిన ప్రతి విజయానికి ఒక సురక్షి తమైన డిజిటల్ చిరునామాగా నిలవబోతోంది. ప్రపంచంలోనే అతి పెద్ద విద్యా వ్యవస్థల్లో ఒకటిగా ఉన్న భారతదేశం, గణాంకాల పరంగా అపారమైన విస్తృతిని కలిగి ఉంది. యుడిఐఎస్‌ఇ 2023-24 నివేదిక ప్రకారం, దేశవ్యాప్తంగా సుమారు 14.89 లక్షల పాఠశాలలు, 26.5కోట్లకు పైగా విద్యార్థులు, 95 లక్షల మంది ఉపాధ్యాయులు ఈ వ్యవస్థలో భాగస్వా ములుగా ఉన్నారు. ఉన్నత విద్యారంగంలోనూ ఎఐఎస్ హెచ్ఇ 2023గణాంకాల మేరకు 4.33కోట్ల మంది విద్యా ర్థులు, 1,168 విశ్వవిద్యాలయాలు, 45 వేలకు పైగా కళా శాలలు విస్తరించి ఉన్నాయి. ఇంతటి భారీ వ్యవస్థలో విద్యా ర్థుల రికార్డులు వేర్వేరు సంస్థల వద్ద విడివిడిగా ఉండటం వల్ల అనేక పరిపాలనాపరమైన చిక్కులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా నకిలీ ధ్రువపత్రాల బెడద, విద్యా చరిత్ర ధృవీకరణలో జాప్యం, విద్యాసంస్థల మార్పు సమయంలో రికార్డుల బదిలీలో ఇబ్బందులు, చదువు మధ్యలో ఆపేసిన విద్యార్థులు తిరిగి చేరడంలో ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలు విద్యా ప్రగతికి ఆటంకంగా మారాయి. ఈ క్లిష్ట తరమైన సవాళ్లను పరిష్కరించి, విద్యార్థి ప్రయోజనాలే పరమావధిగా సాగేలా జాతీయ విద్యా విధానం 2020 ఒక సమగ్రమైన డిజిటల్ విద్యా నిర్మాణాన్ని ప్రతిపాదించింది. అపార్ అనేది ప్రతి విద్యార్థికి కేటాయించే 12 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య. ఇది కేవలం ఒక అంకె మాత్రమే కాదు, విద్యార్థి అకడమిక్ ప్రస్థానానికి జీవితాంతం తోడ్పడే ఒక 'డిజిటల్ అకాడమిక్ పాస్పోర్ట్'. విద్యార్థి ప్రవేశ వివరాలు, హాజరు, పరీక్షా ఫలితాల నుంచి మొదలు కొని స్కాలర్షిప్లు, డిగ్రీలు, డిప్లొమాలు నైపుణ్య ధ్రువపత్రాల వరకు అన్నింటినీ ఇది ఒకే వేదికపైకి తెస్తుంది. అంతేకాకుండా, క్రీడలు, ఎన్.సి.సి, ఎన్.ఎస్.ఎస్ వంటి సహపాఠ్య కార్యక్రమాల్లో సాధించిన విజయాలు, మెడల్స్ కూడా ఈ డిజిటల్ ఖాతాలో నిక్షి ప్తమవుతాయి. తద్వారా విద్యార్థి సమగ్ర విద్యా చరిత్ర ఎప్పుడైనా, ఎక్కడి నుంచైనా సుల భంగా అందుబాటులో ఉంటుంది. ఈ వ్యవస్థ ప్రధానంగా అపార్ రిజిస్ట్రీ, అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్, డిజిలాకర్ వంటి మూడు కీలక డిజిటల్ వ్యవస్థల సమన్వయంతో అత్యంత పటిష్టంగా పనిచేస్తుంది. ఈ నూతన వ్యవస్థలో అత్యంత వినూత్నమైన, విప్లవాత్మకమైన అంశం 'అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్'. ఒక బ్యాంకు ఖాతాలో నగదును ఏ విధంగానైతే భద్రపరుచుకుంటామో, విద్యార్థులు తమఅభ్యాస ప్రక్రియలో ఆర్జించిన క్రెడిట్లు కూడా ఇందులో అలాగే డిజిటల్




రూపంలో నిక్షి ప్తమవుతాయి. ఉదాహరణకు, ఒక విద్యార్థి డిగ్రీలో రెండు సంవత్సరాలు పూర్తి చేసి, అనివార్య కారణాల వల్ల చదువు మధ్యలో ఆపివేసినా, అతను సంపాదించిన క్రెడిట్లు వృథా కావు. కొన్ని ఏళ్ల విరామం తర్వాత చదువు ప్రారంభించాలనుకున్నప్పుడు, అతను మొదటి నుంచి కాకుండా ఎక్కడైతే ఆపారో అక్కడి నుంచే తన విద్యా ప్రయాణాన్ని కొనసాగించవచ్చు. జాతీయ విద్యా విధానం 2020 ఆకాంక్షి ంచిన మల్టీపుల్ ఎంట్రీ, మల్టిపుల్ ఎగ్జిట్ , క్రెడిట్ ట్రాన్స్ఫర్ వంటి అత్యాధునిక భావనలకు ఇది ఊపిరి పోస్తోంది. నిర్ణీత కాలపరిమితిలో డిగ్రీ పూర్తి చేయాలనే పాత సంప్రదాయ సంకెళ్లను తెంచుకుంటూ, విద్యార్థి తన వెసులుబాటును బట్టి నేర్చుకునే 'జీవితాంత అభ్యాస వ్యవస్థ' వైపు భారత విద్యా రంగం వడివడిగా అడుగులు వేస్తోంది. అపార్ వ్యవస్థ కేవలం విద్యార్థులకే కాకుండా, ప్రభుత్వానికి విద్యా పరిపాలనా యంత్రాంగానికి సైతం బహుముఖ ప్రయోజనాలను చేకూరుస్తుంది. నర్సరీ నుండి డాక్టరేట్ స్థాయివరకు విద్యార్థి, సమగ్ర విద్యా చరిత్ర ను ఒకే గొడుగు కిందకు తీసుకురావడం ద్వారా, రాష్ట్రం లేదా విశ్వవిద్యాలయం మారినా రికార్డులను తక్షణమే సరి చూసుకోవడం సాధ్యమవుతుంది. దేశంలో తరచూ కలకలం రేపుతున్న నకిలీ సర్టిఫికెట్ల ముఠాలకు అడ్డుకట్ట వేయడంలో ఇది ఒక శక్తివంతమైన ఆయుధంగా పనిచేస్తుంది. ప్రస్తుతం భారతదేశ ఉన్నత విద్యలో 'స్థూల నమోదు నిష్పత్తి' సుమారు 28.4 శాతంగానే ఉండటం ఆందోళనకరమైన విషయం. పాఠశాల లేదా కళాశాల స్థాయిలోనే పెద్ద సంఖ్యలో విద్యార్థులు విద్యా ప్రవాహం నుండి వేరుపడుతున్నారని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. ఈ తరుణంలో అపార్, ఎబిసిల సమన్వయం, విద్యా వ్యవస్థ నుండి బయటకు వెళ్లిన వారు తిరిగి తమ చదువును కొనసాగించడానికి అవసరమైన వెసులుబాటును కల్పిస్తూ, వారిని తిరిగి విద్యా స్రవంతిలోకి చేర్చడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ప్రభుత్వ పరిపాలనా కోణంలో చూస్తే, అపార్ ఒక అత్యంత శక్తివంతమైన 'డేటా ఆర్కిటెక్చర్'గా అవతరించనుంది. విద్యార్థుల నమోదు సరళి, బడి మానేస్తున్న వారి ధోరణులు, ప్రాంతీయ అసమానతలు, లింగ వివక్ష వంటి కీలక అంశాలపై ఎప్పటికప్పుడు కచ్చితమైన గణాంకాలను ఇది అందిస్తుంది. ఈ సమాచారం అందుబాటులో ఉండటం వల్ల విధాన నిర్ణేతలు ఊహల ఆధారంగా కాకుండా, వాస్తవ గణాంకాల ఆధారంగా ఆధారిత నిర్ణయాలు తీసుకునే వీలుంటుంది. భారతదేశం వంటి సువిశాల దేశంలో విద్యా సంస్కరణలు విజయవంతం కావాలంటే, ఖచ్చితమైన డేటా ఆధారంగా ప్రణాళికలు రూపొందించడం ఒక ప్రాథమిక అవసరం. కేంద్ర ప్రభుత్వం 2023లో శ్రీకారం చుట్టిన అపార్‌అమలు ప్రక్రియ, ప్రస్తుతం పాఠశాల, ఉన్నత, వృత్తి విద్యా రంగాల్లో దశలవారీగా పురోగతి సాధిస్తోంది. ప్రభుత్వ లక్ష్యంప్రకారం 2026-27 నాటికి దేశవ్యాప్తంగా దీనిని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. అయితే, ఈ బృహ త్తర వ్యవస్థ ఆశించిన విజయాలను అందుకోవాలంటే కొన్ని క్లిష్టమైన సవాళ్లను అధిగమించక తప్పదు. ముఖ్యంగా కోట్లా ది మంది విద్యార్థుల వ్యక్తిగత సమాచార గోప్యత, సైబర్ భద్రతను అత్యున్నత ప్రమాణాలతో కాపాడటం ప్రాధాన్యత సంతరించుకుంది. వీటితో పాటు తల్లిదండ్రులలో అవగాహన కల్పించి వారి అంగీకారాన్ని పొందడం, గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ మౌలిక సదుపాయాల కొరతను అధిగమించడంవిద్యాసంస్థలను సాంకేతికంగా సంసిద్ధం చేయడం వంటి అంశాలపై దృష్టి సారించాల్సిఉంది. అంతిమంగా, ఏ సాంకేతికత అయినా విజయవంతం కావాలంటే కేవలం సౌకర్యం మాత్రమే సరిపోదు, వ్యవస్థపై ప్రజల్లో ఉండే నమ్మకం విశ్వసనీయతే కీలకమని గుర్తించాలి. గతంలో విద్యార్థి తన విద్యా ప్రయాణానికి సాక్ష్యంగా సర్టిఫికెట్ల సంచిని మోస్తూ కనిపించేవాడు, కానీ రేపటి రోజున అతని సమగ్ర విద్యా చరిత్ర కేవలం ఒకే ఒక్క డిజిటల్ గుర్తింపులో సురక్షి తం కాబోతోంది. ఆధార్ ఏ విధంగానైతే భారత పౌరుడి వ్యక్తి గత గుర్తింపులో విప్లవాత్మక మార్పులు తెచ్చిందో, అదే రీతిలో 'అపార్' భారతీయ విద్యార్థి అకడమిక్ అస్తిత్వాన్ని పునర్నిర్వచించనుంది. ఈ వ్యవస్థ విజయవంతమైతే, మన విద్యా వ్యవస్థ కేవలం

# వర్షపు నీటిని ఒడిసిపడితేనే జీవకోటికి భద్రత

డాక్టర్. వై. సంజీవ కుమార్


ప్రకృతి మనకు అందించిన అమూల్యమైన వరాలలో నీరు అత్యంత ముఖ్యమైనది. నీరు లేకుండా జీవం లేదు. మానవులు, జంతువులు, పక్షులు, మొక్కలు ఇలా సమస్త జీవకోటి మనుగడకు నీరే ఆధారం. అయితే నేడు ప్రపంచవ్యాప్తంగా తాగునీటి కొరత, భూగర్భ జలాల తగ్గదల, వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు వంటి సమస్యలు మానవాళిని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం చేయగలిగే అత్యంత సులభమైన, సమర్థవంతమైన పని వర్షపు నీటిని ఒడిసిపట్టడం. ప్రస్తుతం పట్టణాలు, గ్రామాలు అనే తేడాలేకుండా వర్షపు నీరు ఎక్కువగా కాలువల ద్వారా వృథాగా నదులు, సముద్రాలలో కలిసిపోతోంది. ఈనీటిని భూమిలోకి ఇంకే విధంగా చర్యలు తీసుకుంటే భూగర్భ జలాలు పెరుగుతాయి. ప్రతి సంవత్సరం వర్షపాతం తగ్గడం, అసమానంగా కురవడం, అటవీ నిర్మూలన, అధికంగా బోర్లు వేయడం వంటి కారణాలవల్ల భూగర్భ జలాల మట్టాలు క్రమంగా పడిపోతున్నాయి. ఈపరిస్థితిని మార్చాలంటే వర్షపు నీటిని భూమిలోకి చేరేలా చేయడం అత్యవసరం. వర్షపు నీటిని సంరక్షి ంచడం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయి. బావులు, బోర్లు ఎండిపోకుండా ఉంటాయి. తాగునీటి సమస్య తగ్గుతుంది. వ్యవసాయానికి అవసరమైన నీరు అందుబాటులోఉంటుంది. పర్యావరణ సమతుల్యత మెరుగుపడుతుంది. వర్షపు నీటిని భూమిలోకి చేర్చడానికి ఇంకుడు గుంతలు అత్యంత ఉపయోగకరమైన వి. ఇళ్లలో, అపార్ట్‌మెంట్లలో, పాఠశాలల్లో, కార్యాలయాల్లో, పార్కుల్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేస్తే పైకప్పులపై పడే వర్షపు నీరు నేరుగా భూమిలోకి చేరుతుంది. దీని వల్ల భూగర్భజలాలు పెరిగి సమీప ప్రాంతాల్లోని బోర్లలో నీటి నిల్వలు మెరుగుపడతాయి. ప్రతిపౌరుడు తన ఇంటి వద్ద ఒక ఇంకుడు గుంత ఏర్పాటు చేస్తే మరింతమెరుగైన ఫలితాలు సాధించవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పుడు చెరువులు, కుంటలు, బావులు నీటి నిల్వలకు ప్రధాన ఆధారంగా ఉండేవి. ప్రస్తుతం అనేక చెరువులు పూడికతో నిండిపోవడం, ఆక్రమణలకు గురికావడం వల్ల వాటి నీటి నిల్వసామర్థ్యం తగ్గిపోయింది. వర్షాకాలానికి ముందు చెరువులను శుభ్రపరచి, పూడికతొలగించి, నీటినిల్వసామర్థ్యాన్ని పెంచితే భారీగా వర్షపు నీటిని నిల్వ చేసుకోవచ్చు. అలాగే పొలాల్లో చిన్నచిన్న గుంతలు, కందకాలు ఏర్పాటు చేయడం ద్వారా వర్షపు నీరు పొలంలోనే నిలిచి భూమిలోకి ఇంకే అవకాశం ఉంటుంది. వర్షాకాలంలో నాటిన మొక్కలు సులభంగా భూమిలో స్థిరపడతాయి. మొక్కలు పెరిగి చెట్లుగా మారినప్పుడు వాతావరణంలో తేమను పెంచి వర్షాలను ఆకర్షించడంలో కీలక పాత్రపోషిస్తాయి. రైతులు పొలాల్లో వర్షపు నీటిని నిల్వచేసుకునే పద్ధతులను అనుసరించాలి. కాంటూర్ బండ్లు, ఫార్మ్ పాండ్లు, చెక్‌డ్యామ్‌లు, నీటి నిల్వ గుంతలు ఏర్పాటు చేయడం ద్వారా వర్షపు నీటిని నిల్వచేయవచ్చు. దీనివల్ల భూగర్భజలాలు పెరిగి పంటలకు అవసరమైన నీరు అందుతుంది. వ్యవసాయ ఉత్పత్తికూడా మెరుగుపడుతుంది. వర్షాకాలంలో కురిసే ప్రతి నీటి బొట్టు అమూల్యమైన సంపద నీటిని కాపాడితేనే భవిష్యత్తు తరాలకు ప్రకృతిసంపాదనకు అందించినట్టే, వర్షపునీటిని ఒడిసి

# యుద్ధాల్లో అమెరికా గెలిచినదెప్పుడు?



సరికొండ రవీంద్రనాథ్

ప్రపంచాన్ని శాసిస్తున్నది మేమే అని అమెరికా గొప్పలు చెప్పుకుంటుంది. కానీ అవమానాలతోవెనుతిరగడమేగాని ప్రపంచ చరిత్రలో అమెరికా గెలిచిన యుద్ధం ఏదీలేదు. ఇరాన్ నుంచి కువైట్‌ను విముక్తి చేసి అక్కడ తమ కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా దాన్ని గెలుపు కింద ప్రపంచం పరిగణించడం లేదు. 1945లో రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత నేనే సూపర్ పవర్ అంటూ అనేక దేశాల ప్రభుత్వాల వ్యవహారాల్లో అమెరికా జోక్యం చేసుకుంది. ఆరు భారీ యుద్ధాల్లో అమెరికా ప్రత్యక్షంగా పాల్గొన్నది. సుమారు పదిహేను దేశాల్లో కుట్రలు, కుతంత్రాల ద్వారానే ప్రభుత్వాలను అమెరికా పడదోసి నేతలను మార్చింది. ఇప్పుడు గల్ఫ్ యుద్ధం నుంచి బైట పడటానికి ఇరాన్ పెట్టిన షరతులను అన్నింటిని అమెరికా ఆమోదిస్తూ సంతకాలు చేసింది. ఇది అమెరికా పరాజయంగానేప్రపంచం భావిస్తోంది. వియత్నాం, కొరియా, గల్ఫ్, ఇరాక్, అఫ్ఘానిస్థాన్, ఇరాన్ యుద్ధాల్లో అమెరికా ప్రత్యక్షంగా పాల్గొంది. వియత్నాం యుద్ధం అమెరికాకు అత్యంత అవమానాన్ని, నష్టాన్ని మిగిల్చింది. కమ్యూనిస్టు దేశాలైన రష్యా, చైనా ప్రాబల్యాన్ని అరికట్టడానికి అమెరికా ఈ యుద్ధం చేసింది. ఆగ్నేయాసియాలో 1955 నుంచి 75వరకు ఇరవై సంవత్సరాలు ఈ యుద్ధం కొనసాగింది. అమెరికాకు చెందిన 59 వేల మంది సైనికులు మృతి చెందగా లక్షా యాభై నాలుగు వేల మంది గాయపడ్డారు. హెచిమిన్ నాయకత్వంలో జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో వియత్నాం సైనికులు, ప్రజలు సుమారు 20లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. వియత్నంపై గెలవలేమని నిర్ణయించుకుని అమెరికా తమ సైన్యాన్ని అవమానకరమైన రీతిలో ఉపసంహరించుకుంది. యుద్ధానికి ముందు రెండుగా ఉన్న వియత్నాం యుద్ధం తర్వాత కమ్యూనిస్టు దేశంగా ఏకమైపోయింది. ఇది అమెరికా తట్టుకోలేని మరో విషాదం. కొరియా యుద్ధం కూడా వియత్నాం యుద్ధం లాంటిదే. 1950-53 మధ్య జరిగిన ఈ యుద్ధంలో అమెరికా కన్నులొట్టబోయి బైటపడింది. జపాన్ నుంచి దక్కిన దక్షి ణ కొరియాను మాత్రం కాపాడుకోగలిగింది. ఈ యుద్ధంలో 37వేల మంది అమెరికా సైనికులు చనిపోయా రు. లక్షమంది గాయపడ్డారు. ఇప్పటికీ ఉత్తర కొరియా అమెరికాను అణ్వాయుధాలతో ఆడిస్తూనే ఉంది. దురదృష్టం ఏంటంటే ఈ యుద్ధంలో అపారమైన ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. ఇప్పటికీ రెండు కొరియాల మధ్య సరిహద్దు వివాదం కొనసాగుతూనే ఉంది. 1990నుంచి ఏడాది పాటు జరిగిన గల్ఫ్ యుద్ధంలో 294మంది అమెరికా సైనికులు చనిపోయారు. సుమారుగా ఉత్తరాంధ్ర వైశాల్యంగల కువైట్‌ను చమురు కోసం ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ ఆక్రమించాడు. అమెరికా దాడి చేసి కువైట్‌ను విడిపించింది. సుమారు 140 బిలియన్ డాలర్లు అమెరికాకు ఖర్చయింది. ఈఖర్చులో ఎక్కువ భాగం ఫ్రాన్స్, బ్రిటన్‌తో సహా అరబ్



మిత్ర దేశాలు భరించాయి. అఫ్ఘానిస్థాన్‌లో అమెరికాకు జరిగిన నష్టం అపారమైనది. దేశంలో విలువైన మినరల్స్ తవ్వి తెచ్చుకోవాలని అమెరికా వెళ్లింది. తీవ్రవాదుల తుపాకుల మోతల మధ్య రాళ్లు కూడా తెచ్చుకోలేమని అర్థమైంది. అవమానకరమైన రీతిలో తిరుగుముఖం పట్టింది. 2001 నుంచి 21వరకు ఇరవై సంవత్సరాల సుదీర్ఘకాలం జరిగిన యుద్ధంలో 7,200 మంది సైనికులు చనిపోయారు. 53వేలమంది గాయపడ్డారు. సుమారు మూడు ట్రిలియన్ డాలర్లువ్యయం చేయాల్సి వచ్చింది. ఈ ఖర్చు చివరికి ఐదు ట్రిలియన్లకు చేరుకుంది. ఇది రెండో ప్రపంచ యుద్ధంలో అమెరికాపెట్టిన ఖర్చుతో సమానం. ఈ యుద్ధం ఆపేయాలంటూ అమెరికా ప్రజలు వీధుల్లోకి వచ్చిన తర్వాతనే అమెరికా ప్రభుత్వం తమ సేనలను ఉపసంహరించుకుంది. అమెరికా పెంచి పోషించిన తీవ్రవాద సంస్థ అల్ ఖైదా బలహీనపడింది. ఒసామా బిన్‌లాడెన్ చనిపోయాడు. కానీ 2021లో తాలిబన్‌లు తిరిగి అధికారాన్ని చేజిక్కించుకున్నారు. అదీ అవమానం రసాయన ఆయుధాలు ఉన్నాయంటూ ఇరాక్ పై అమెరికా దాడిచేసింది. 2003-11 మధ్య జరిగిన యుద్ధంలో అమెరికా సైనికులు 4 వేల 431 మంది చనిపోయారు. 32 వేల మంది గాయపడ్డారు. 1.5 ట్రిలియన్ డాలర్లు ఖర్చయింది. చివరగా తేల్చిందేమిటంటే ఇరాక్ నుంచి ఆశించిన చమురు రాకపోగా అమెరికాకు రెండు ట్రిలియన్ల వరకూ చేతి చమురు వదిలింది. అమెరికాకు యుద్ధం ఖర్చుల కింద 300బిలియన్ డాలర్లు ఇరాక్ చెల్లించాలని ఐక్యరాజ్య సమితిలో తీర్మానం చేయించారు. కానీ ఖర్చులో డాలర్ కూడా అమెరికాకు తిరిగి రాలేదు. అమెరికా ఇంటెలిజెన్స్ సంస్థ సిఐఎ కుట్రలు, కుతంత్రాలతో సుమారు పదిహేను దేశాల్లో ప్రభుత్వాలను కూలదోస్తారు. తర్వాత తమకు అనుకూలమైన నియంతలను ప్రభుత్వాల్లో నియమించుకున్నారు. ఇలా పరోక్షంగాచేసిన యుద్ధాల్లో క్యూబా క్షి పణుల సంక్షోభం ప్రధానమైంది. ఇది దాదాపు యుద్ధమే. కానీ క్యూబా నాయ కుడు, సోషలిస్టు నేత ఫిడెల్ కాస్ట్రోను అధికారం నుంచి తొలగించలేకపోయారు. కాస్ట్రోను హత్య చేయడానికి సిఐఎ సుమారు ముప్పయిసార్లు హత్యాయత్నాలు చేసింది. ఇండో నేషియాలో సుకర్ణో, ఇరాన్‌లో మహమ్మద్ మొసాద్, అఫ్ఘాని స్థాన్‌లో నజీబుల్లా కుట్రల ద్వారా అమెరికా తొలగించిన దేశాధ్యక్షుల జాబితాలో ఉన్నారు. ఈ క్రమంలో కొందరు అధినేతలను అమెరికా కిరాతకంగా హత్య చేయించింది. లిబియా అధ్యక్షుడు గఢాఫీని వీధుల్లో పరుగెత్తించి కుక్కను కొట్టినట్టు రాళ్లతో కొట్టి చంపారు. అఫ్ఘానిస్థాన్ అధ్యక్షుడు ముహ్మద్ నజీబుల్లాను నడివీధిలో ట్రాఫిక్ సిగ్నల్‌కు కట్టి ఉరితీసారు. ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్‌ను విచా రణ పేరుతో ఉరితీసారు. చిలీలో సాల్వడార్ అలెండీ ప్రభుత్వాన్ని కూలదోసి చంపేసారు. ఇటీవల వెనెజులాఅధ్యక్షుడు మదురోను అరెస్టుచేసి తీసుకువచ్చారు. అమెరికా గూఢాచారి సంస్థ సిఐఎ ప్రపంచ వ్యాప్తంగా జరుపుతున్న హింసాత్మక కుట్రల్లో ఇవి కొన్ని మాత్రమే. భారతదేశాన్ని కూడా విడదీయడానికి సిఐఎ కుట్రలున్నాయి. కాశ్మీర్ విభజనకు జెకెఎల్ఎఫ్, అస్సాం దేశం కోసం యుఎల్ఎఫ్ఎ, తమిళనాడు, శ్రీలంక తమిళ ప్రాంతాలతో ప్రత్యేక దేశం ఏర్పాటుకు ఎల్.టి.టి.ఇ. టియుఎల్ఎఫ్ లాంటి సంస్థలు ఏడు ఏర్పాటు చేసారు. అన్నీ నాలుగు అక్షరాలే. మాజీ ప్రధాని ఇందిర ముందు సిఐఎ ఆటలు సాగలేదు. తెరచాటు కుట్రలతో పెత్తనం చేయడం తప్ప ప్రత్యక్ష యుద్ధంలో గెలిచిన చరిత్ర

# ప్రజావాక్కు

## పొదుపే భవిష్యత్తుకు భరోసా

ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో దేశంలోని అనేక జలాశయాలకు నీటి ప్రవాహాలు తగ్గుతున్నాయి. వర్షపాతం అనిశ్చితంగా మారడం, భూగర్భ జలాలు క్రమంగా తగ్గిపోవడం, పెరుగుతున్న నీటిఅవసరాలు భవిష్యత్తుపై ఆందోళన కలిగిస్తున్నాయి. ఈపరిస్థితుల్లో నీటి ప్రతి బొట్టును విలువైన సహజ సంపదగా భావించి పొదుపుగా వినియోగించడం అత్యవసరంగా మారింది. వ్యవసాయ రంగంలో నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచేందుకు డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మసాగు పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించాలి. చెరువులు, కుంటలు, కాలువలను పునరుద్ధరించి వర్షపు నీటిని నిల్వ చేసే చర్యలను వేగవంతం చేయాలి. ప్రతి గ్రామంలో వర్షపు నీటి సంరక్షణకు ప్రజల భాగస్వామ్యంతో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి. పట్టణాల్లో భవనాలకు వర్షపు నీటిసేకరణ వ్యవస్థలను తప్పనిసరి చేయడం కూడా అవసరం. ఇళ్లలోనూ నీటివృథాను అరికట్టడం ప్రతి పౌరుడి బాధ్యత. అవసరానికి మించి నీటిని వినియోగించకుండా పొదుపు అలవాటును పెంపొందించాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## వనరులను కాపాడుకుందాం

పాలకులు పంచుతున్న ఉచితాలు దేశ ఆర్థిక పరిస్థితిని మరింతక్రుంగదీస్తున్నాయి. అధికారంకోసం ఎవరికి తోచిన విధంగావారు ఉచితాలు ప్రకటిస్తున్నారు. ఉచిత బియ్యం, ఉచిత కరెంటు, ఉచిత బస్సు ఇలా అన్ని ఉచితాలు ఇస్తు పోతూరాష్ట్రాలు అప్పుల్లో కూరుకుపోతున్నాయి. అర్హులను ఆదుకుంటే పర్వాలేదు. కానీ, చాలా మంది అనర్హులు ఉచిత పథకాల వల్ల లబ్ధిపొందుతున్నారు. దాంతో ప్రభుత్వఖజానా ఖాళీఅవుతోంది. మన ఆర్థిక పరిస్థితిని మనమే చేతులారా నాశనం చేసుకుంటున్నాం. ఇప్పటికైనా ఈ విషయంలో ఆలోచించి నిరుపేదలకు మాత్రమే ఉచితాలు ఇస్తే బాగుంటుంది. కష్టం రాక ముందేవనరులను సమకూర్చుకోవడం, వంట ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి.

- కె. నాగేంద్ర, హైదరాబాద్

## సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త

వర్షాకాల సందర్భంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఆరోగ్యం పట్ల తగినంత శ్రద్ధ వహించాలి. వర్షాకాల ప్రభావం వలన తీవ్రమైన వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వీలైనంత వరకు ఇంట్లో నుండి బయటికి వెళ్లకపోవడమే మంచిదని అధికారులు సూచిస్తున్నారు.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## దొంగ బాబాలను శిక్షించాలి

కల్తీ మందులు, కల్తీసరుకులు అమ్మినందుకు సుప్రీంకోర్టు రాందేవ్ బాబాకు అరెస్ట్‌వారెంట్లు చాలాసార్లు ఇచ్చింది. క్షమాపణలు చెప్పి తప్పించుకున్నాడు. చాలా రాష్ట్రాలు రాందేవ్ బాబా కల్తీ మందులను, కల్తీ సరుకులను నిషేధించాయి. అలాంటి కల్తీ బాబాకు విజయనగరంలో మందులు తయారుకు ప్రభుత్వ భూములు ఇవ్వడం సిగ్గు చేటు. మోసగాడు అయిన రాందేవ్‌బాబాకు విజయనగరం జిల్లాలో కొత్తవలస మండలం చిన్నరావులపల్లి గ్రామంలో 70 ఎకరాలు సాంక్షన్ చేసిన జీవో నంబర్ 131 తక్షణమే రద్దు చేయాలి. బాబాలందరూ దొంగలే. ప్రభుత్వం ఈరోజు దొంగబాబాలను పెంచి పోషిస్తుంది. కాషాయ గుడ్డలు వేసుకొని, ముఖాన బూడిద పూసుకుని, మెడలో రుద్రాక్షలు వేసుకొని కనిపిస్తే వాడిని తన్ని తరిమెయ్యక, అవతారమూర్తి లాగా నాయకులు సాష్టాంగపడటం, శాలువాలు కప్పడం, ఇలా భూములు ఇవ్వడం, నాయకుల దివాలాకోరు తనానికి చిహ్నం. మీ సొంత భూములు ఇవ్వండి. ప్రజల భూములను ఇలాంటి దొంగలకు ఇవ్వటానికి కాదు మిమ్మల్ని ఎన్నుకుంది, ప్రజలఆస్తులను రక్షి ంచటానికి. బాబాల బతుకేమిటో ప్రజలకు తెలుసు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## రోడ్లపై రేకుల షెడ్లు తొలగించాలి

మండల కేంద్రాలలో ఇరుకుగా ఉండే రోడ్లపై కొందరు ఇంటి యజమానులు బైకులు పెట్టుకోవడానికి గాను రేకుల షెడ్లు నిర్మించడంవలనప్రజలకు రేకులషెడ్లు తలలకు తలిగి గాయాలు అవుతున్నాయి. రాత్రిపూట మరీ విపరీతంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. కనుక ప్రభుత్వం రెవెన్యూ శాఖ, పంచాయతీరాజ్‌శాఖ, గ్రామపంచాయతీ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాలలోపర్యటించి రేకుల షెడ్లుతొలగించాలి. ఇంటి యజమానులకు నోటీసులు జారీ చేసి వారం రోజులలో తొలగించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

## పెరుగుతున్న వృద్ధుల సంఖ్య

ఈమధ్య దేశం మొత్తం మీద వయోవృద్ధుల సంఖ్య, యువకుల కంటే ఎక్కువ ఉన్నట్లుతెలిసింది. అదిసహజం, వాస్తవం కూడా. యువకుల సంఖ్య బలం ఎక్కువగా ఉన్నప్పుడే మానవవనరులు కాస్త ఎక్కువపొందొచ్చు. ఇది ఆయా పరిస్థితుల్లో వారి ఆరోగ్యాలు, సామాజిక స్తితి, అనుకూల ధోరణి ప్రధానం. పెడత్రోవ ధోరణులు అతిగా పెరిగి వ్యక్తివినాశనం జరుగుతున్నది. ప్రభుత్వం యువకులకు తప్పక ఉపాధి కల్పించాలి.

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

## కార్పొరేషన్ బలోపేతానికి సమిష్టి కృషి చేయాలి - ఏపీఐడీసీ చైర్మన్ దేగల ప్రభాకర్

గుంటూరు, జూన్ 29,ప్రభాతవార్త :ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ అధ్యక్షతన మంగళవారం కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ పరిపాలన, ఆర్థిక నిర్వహణ, అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్ అంశాలు, భవిష్యత్ కార్యాచరణ, కొత్త ప్రాజెక్టుల అమలు, ఆదాయ వృద్ధి, పారిశ్రామిక ప్రోత్సాహం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.ఈ సందర్భంగా చైర్మన్ శ్రీ దేగల ప్రభాకర్ మాట్లాడుతూ, రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామికాభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా కార్పొరేషన్ మరింత సమర్థవంతంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు పారిశ్రామికవేత్తలకు అనుకూల వాతావరణాన్ని కల్పించేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు.కార్పొరేషన్ ఆర్థిక బలోపేతానికి ఆదాయ వనరులను పెంచడం అత్యంత అవసరమని పేర్కొన్న చైర్మన్, ..కార్పొరేషన్‌కు వివిధ సంస్థలు, పరిశ్రమలు, లబ్ధిదారులు మరియు ఇతర వర్గాల నుంచి రావాల్సిన బకాయిలను త్వరితగతిన వసూలు చేయడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి బకాయి కేసును విడివిడిగా సమీక్షించి, అవసరమైన చోట చట్టపరమైన చర్యలు తీసుకుంటూ వసూళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.బకాయిల వసూళ్లపై ప్రతి వారం సమీక్ష నిర్వహించాలని, పెండింగ్‌లో ఉన్న కేసులపై నిర్లక్ష్యం లేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులకు స్పష్టం చేశారు. కార్పొరేషన్



నిధుల వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ సంస్థ ఆర్థిక స్థితిని మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.సమావేశంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, పరిశ్రమలకు కేటాయించిన భూముల స్థితిగతులు, పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడుల ఆకర్షణ, కొత్త పారిశ్రామిక అవకాశాల సృష్టి, పరిపాలనా సంస్కరణలు, పెండింగ్ ఫైళ్ల పరిష్కారం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రతి శాఖ తన పనితీరును మరింత మెరుగుపరుచుకుని నిర్ణీత లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని చైర్మన్ సూచించారు.అదేవిధంగా, రాష్ట్ర పారిశ్రామిక రంగానికి కొత్త దిశానిర్దేశం చేసే లక్ష్యంతో కార్పొరేషన్ ఆధ్వర్యంలో త్వరలో పలు పైలట్ ప్రాజెక్టులను ప్రారంభించనున్నట్లు చైర్మన్ ప్రకటించారు.ఈ పైలట్ ప్రాజెక్టులు పారిశ్రామిక రంగంలో వినూత్న విధానాలకు శ్రీకారం చుడతాయని, కొత్త పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలను విస్తృతంగా కల్పిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుల అమలుకు సంబంధించి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి, నిర్ణీత గడువులోగా ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అదేవిధంగా, కార్పొరేషన్ సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించేందుకు సాంకేతికత వినియోగాన్ని పెంచాలని, పరిపాలనా వ్యవస్థలో పారదర్శకతను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా పారిశ్రామికవేత్తలకు అవసరమైన సహకారం అందిస్తూ రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి ఏపీఐడీసీ మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. సమావేశంలో సభ్యులు కార్పొరేషన్ అభివృద్ధికి సంబంధించిన పలు నిర్మాణాత్మక సూచనలు చేయగా, వాటిపై చర్చించి అమలుకు అవసరమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. కార్పొరేషన్ ఆర్థిక స్వావలంబన, బకాయిల వసూళ్ల వేగవంతం, కొత్త ప్రాజెక్టుల ప్రారంభం, పెట్టుబడుల ప్రోత్సాహం, పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజా సేవల మెరుగుదల వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగాలని సమావేశం ఏకగ్రీవంగా నిర్ణయించింది.ఈ సమావేశంలో కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ రఘు నాద్, కార్పొరేషన్ డైరెక్టర్లు సందీప్,జలగం రామారావు, రమణయ్య, మల్హోత్రా,బాల భారతి, ఉన్నతాధికారులు మరియు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. సమావేశం ముగింపులో రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి కార్పొరేషన్ మరింత సమర్థవంతంగా సేవలందించేలా సమిష్టి కృషితో ముందుకు సాగాలని చైర్మన్ దేగల ప్రభాకర్ పిలుపునిచ్చారు.

## ఘనంగా వీడ్కోలు సత్కారం

గుంటూరు క్రైమ్,జూన్30,ప్రభాతవార్త: గుంటూరు జిల్లా పోలీసు శాఖలో సుమారు నాలుగు దశాబ్దాలకు పైగా ప్రజాసేవలో విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందుతున్న పోలీసు అధికారులు,సిబ్బందికి జిల్లా పోలీసు శాఖ తరఫున ఎస్పీ వకుల్ జిందాల్,ఇతర జిల్లా పోలీసు అధికారులతో కలిసి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ పొందుతున్న అధికారులు తమ విధి నిర్వహణలో నిజాయితీ,క్రమశిక్షణ,అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు,పోలీసు శాఖకు విశేష సేవలందించారని కొనియాడారు.ముఖ్యంగా నక్సలిజం,రౌడీయిజం



ప్రభావం ఎక్కువగా ఉన్న కాలంలో చట్ట పరిరక్షణ,శాంతిభద్రతల నిర్వహణలో సమర్థవంతంగా విధులు నిర్వహించి శాఖకు మంచి పేరు తీసుకొచ్చారని ప్రశంసించారు.అలాగే,ఉద్యోగ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించడంతో పాటు తమ పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్ది,సమాజంలో మంచి స్థాయికి చేర్చడం అభినందనీయమని పేర్కొన్నారు. పోలీసు సేవా కాలంలో వారికి అండగా నిలిచిన కుటుంబ సభ్యులకు కూడా ఎస్పీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.ఉద్యోగ విరమణ అనంతరం వారు ఆరోగ్యంగా,ఆనందంగా కుటుంబ సభ్యులతో సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షిస్తూ వారి భవిష్యత్తు జీవితం మరింత సంతోషకరంగా ఉండాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమణమూర్తి,ఎ.ఆర్ ఆదనపు ఎస్పీ హనుమంతు,ఎస్‌బీ డీఎస్పీ అలహరి శ్రీనివాస్,ఆర్ఐలు సురేష్, శ్రీహరిరెడ్డి,కృష్ణయ్య,పోలీస్ అసోసియేషన్ నాయకులు సాంబశివరావు,ఎం. లక్ష్మయ్య,రిటైర్డ్ ఎస్పీ చక్రపాణి,రిటైర్డ్ ఎస్ఐ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దలవాయి సుబ్రహ్మణ్యం,జిల్లా ఎస్పీ పీఆర్వో శ్రీనివాసరావు,సహ ఉద్యోగులు బంధువులు,తదితరులు పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం



గుంటూరు క్రైమ్,జూన్30,ప్రభాతవార్త: ఇంట్లో ఎవ్వరికీ చెప్పకుండా ఓ యువతి ఇంటి నుండి వెళ్ళిపోయింది. తాడికొండ మండలం ఫణిదరం గ్రామానికి చెందిన మాదుగుల శ్రేయ కు 23 సంవత్సరాలు డిగ్రీ వరకు చదివింది. పది రోజుల క్రితం గుంటూరు లోని వెలంగి నగర్ లోని తన బంధువుల ఇంటికి వెళ్ళింది.గత నెల 23వ తేదీన ఎవ్వరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్ళిపోయింది.ఇంతవరకు తిరిగి రాలేదు.శ్రేయ తల్లి మల్లీశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరెండల్ పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు సిఐ ఫోన్ నెంబర్ 8688831332 కి తెలియచేయాలని పోలీసులు కోరారు.

## ఆర్.వి.ఆర్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాల ను సందర్శించిన 1987 బ్యాచ్ పూర్వ విద్యార్థులు, ఐటీ రంగ నిపుణులు

గుంటూరు విద్య జూన్ 30 ప్రభాతవార్త : ఆధునిక సాంకేతిక విద్యతో పాటు విద్యార్థుల ఆలోచనలను ఆవిష్కరణలు, ఉత్పత్తులుగా మలచుకునేందుకు అవసరమైన అత్యాధునిక సాంకేతిక వనరులు, పరిశోధన కేంద్రాలను ఒకే వేదికపై విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడం విశేషమని ఆర్.వి.ఆర్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థులు, ఐటీ రంగ నిపుణులు ప్రశంసించారు. ఆర్.వి.ఆర్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాలలో విద్యాభ్యాసం చేసి ప్రస్తుతం దేశ, విదేశాల్లో ఐటీ రంగంలో ఉన్నత స్థానాల్లో సేవలందిస్తున్న 1987



బ్యాచ్ పూర్వ విద్యార్థులు కళాశాలను సందర్శించారు. కళాశాల అధ్యక్షులు డా. రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డా. జగదీష్ కె. మద్దినేని, కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ శ్రీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డా. కొండబోలు కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డా. కొల్లా శ్రీనివాస్ అకడమిక్ అండ్ ఆర్ డి డైరెక్టర్ డా. కె. రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డా. ఎన్.వి. శ్రీనివాసరావు, వివిధ శాఖల విభాగాధిపతులు, అలుమ్ని సెల్ కన్వీనర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# గుంటూరు వార్త

## డెంగ్యూ రహిత నగరంగా తీర్చిదిద్దుకోవడానికి నగర ప్రజలు సహకరించాలి

### నగర కమిషనర్ కె.మయూర్ అశోక్

గుంటూరు కార్పొరేషన్, జూన్ 30 (ప్రభాత వార్త ) : గుంటూరు నగరాన్ని డెంగ్యూ రహిత నగరంగా తీర్చిదిద్దుకోవడానికి నగర ప్రజలు తమ ఇంటి లోపల, బయట వారం రోజులపై బడిన నీటి నిల్వలను తొలగించుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ కోరారు. మంగళవారం నుండి డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం ప్రారంభం సందర్భంగా ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని పిలుపునిచ్చారు.జాతీయ డెంగ్యూ నిరోధక దినోత్సవం జూలై 1 నుండి 31వ తేదీ వరకు జరుగుతుందన్నారు. వర్షాకాలంలో డెంగ్యూ వ్యాధి



వ్యాప్తి చెందే అవకాశం ఎక్కువగా ఉండటంతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డెంగ్యూ వ్యాధి ఎడిస్ అనే దోమ కాటు ద్వారా వ్యాపిస్తుందని, ఈ దోమలు ఇంటి పరిసరాల్లో నిల్వ ఉండే పరిశుభ్రమైన నీటిలో గుడ్లు పెడతాయి కాబట్టి వారానికి ఒకరోజు "డ్రై డే" పాటిస్తూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిఎంసి ప్రజారోగ్య విభాగం ద్వారా వార్డ్ ల వారీగా ఇంటింటి జ్వర సర్వేలు నిర్వహించడం, అనుమానిత జ్వర కేసులను వెంటనే గుర్తించి పరీక్షలు నిర్వహించడం, అవసరమైన ప్రాంతాల్లో యాంటీ లార్వా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఆశా, ఏఎన్ఎం, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు ద్వారా ప్రజలకు డెంగ్యూ నివారణపై సూచనలు అందిస్తామని తెలిపారు. ప్రజలు కూలర్లు, డ్రమ్‌లు, బకెట్లు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, నీటి నిల్వ పాత్రలను వారానికి ఒకసారి ఖాళీ చేసి శుభ్రం చేయాలన్నారు. దోమతెరలు, దోమ నివారణ క్రీములు లేదా ఇతర రక్షణ చర్యలు ఉపయోగించాలని, జ్వరం, తీవ్రమైన తలనొప్పి, కళ్ల వెనుక నొప్పి, ఒళ్లునొప్పులు, చర్మంపై ఎర్రటి మచ్చలు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. వైద్యుల సలహా లేకుండా స్వయంగా మందులు వాడరాదని స్పష్టం చేశారు.

## ఎస్పీని కలిసిన రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ

గుంటూరు క్రైమ్,జూన్30,ప్రభాతవార్త: నూతనంగా రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన భాష్యం రామకృష్ణ మంగళవారం గుంటూరు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ వకుల్ జిందల్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భాష్యం రామకృష్ణ ఎస్పీకి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేయగా ఎస్పీ వకుల్ జిందల్ నూతన రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైనందుకు అభినందనలు తెలియజేసి, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఇద్దరూ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజా సంక్షేమం,సమాజాభివృద్ధికి పరస్పర సహకారంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



## గుంటూరు కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీగా కాకుమాను ఎంఈఓ 2 విజయభాస్కర్ కు బాధ్యతలు

గుంటూరు విద్య జూన్ 30 ప్రభాతవార్త: గుంటూరు జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి బాధ్యతలను కాకుమాను ఎంఈఓ 2 కే .విజయభాస్కర్ కు అప్పగిస్తూ గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ కె. సలీం భాష ఉత్తర్వులు విడుదల చేశారు. ఇప్పటివరకు కార్యదర్శిగా పనిచేసిన తిరుమలేష్ జూన్ 30వ తేదీన ఉద్యోగ విరమణ చేయడంతో జిల్లా విద్యాశాఖ అధికారి ఆ మేరకు విజయభాస్కర్కు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు.

## రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ కు సినీ నటుడు సుమన్ అభినందన



గుంటూరు విద్య జూన్ 30 ప్రభాతవార్త: గుంటూరులోని చంద్రమౌళినగర్ భాష్యం మెయిన్ క్యాంపస్‌లో మంగళవారం ప్రముఖ సినీ నటుడు సుమన్ రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ ని మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులుగా బాధ్యతలు చేపట్టిన భాష్యం రామకృష్ణ ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సుమన్ ఆకాంక్షించారు. విద్యారంగం, సామాజిక సేవలో రామకృష్ణ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. రాజ్యసభ వేదికగా విద్య, యువత సంక్షేమం, దేశాభివృద్ధికి సంబంధించిన అంశాలపై భాష్యం రామకృష్ణ మరింత సమర్థవంతంగా సేవలందిస్తారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ సినీ నటుడు సుమన్ కి కృతజ్ఞతలు తెలుపుతూ, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణం, సమాజ శ్రేయస్సు కోసం మరింత అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు. ఈ మర్యాదపూర్వక భేటీ ఆత్మీయ వాతావరణంలో సాగింది.

## వారం రోజుల్లో ప్రతి రేషన్ షాపుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, జూన్ 30,ప్రభాతవార్త :గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో రేషన్ బియ్యం అక్రమ రవాణా, దుర్వినియోగానికి ఎట్టి పరిస్థితుల్లోనూ తావులేదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో జిల్లా సరఫరాల అధికారి కోమలి పద్మ, డిప్యూటీ తహసీల్దార్ బేగ్, డీఎం నాగేశ్వరరావు, ఏఎం క్రాంతి, నగర పరిధిలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం అక్రమంగా తరలింపు లేదా విక్రయానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను, పోలీసులను ఆదేశించారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు.రేషన్ దుకాణాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే, నియోజకవర్గంలోని ప్రతి రేషన్ షాప్‌లో వారం రోజులలోపు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం తప్పనిసరి అని ఆదేశించారు. కెమెరాల ఏర్పాటు ద్వారా పంపిణీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించే అవకాశం



ఉంటుందని, అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చని తెలిపారు.ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎలాంటి రాజకీయ ఒత్తిడులు ఉండవని స్పష్టం చేసిన ఎమ్మెల్యే, ఎవరైనా తమ పేర్లు లేదా ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పుకొని అక్రమాలకు పాల్పడేందుకు ప్రయత్నిస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. చట్టాన్ని ఉల్లంఘించే వారెవరికీ ఉపేక్ష ఉండదని హెచ్చరించారు. గతంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్న సందర్భాల్లో తమ పార్టీ నాయకులు స్వయంగా గుర్తించి పోలీసులకు అప్పగించిన ఘటనలను ప్రస్తావించిన ఎమ్మెల్యే, "అధికారులు చేయాల్సిన పనులను కూడా ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు చేయాల్సిన పరిస్థితి రావడం బాధాకరం" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు అందాల్సిన సరుకులు సక్రమంగా చేరేలా అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజా పంపిణీ వ్యవస్థకు భంగం కలిగితే తాను ఏమాత్రం సహించబోనని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తేల్చి చెప్పారు. ప్రజల హక్కులను కాపాడడం, ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులకు చేరేలా చూడడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో రేషన్ పంపిణీ పూర్తిగా పారదర్శకంగా, అవినీతి రహితంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

## గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆదేశాల మేరకు మహిళా గ్రీవెన్స్

గుంటూరు, జూన్ 30,ప్రభాతవార్త :గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆదేశాల మేరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో తెలుగు మహిళా అధ్యక్షురాలు ముత్తినేని శివలీల, ప్రధాన కార్యదర్శి చెంబేటి మణికుమారి గారు ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి వినతులు, అర్జీలు స్వీకరించారు. ప్రజలు తెలిపిన ప్రతి



సమస్యను నమోదు చేసుకుని ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని వారు పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, భద్రత, సాధికారత కోసం ప్రభుత్వం మరియు ప్రజాప్రతినిధులు కట్టుబడి పనిచేస్తున్నారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఇలాంటి గ్రీవెన్స్ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని, ప్రజలు నిర్భయంగా తమ సమస్యలను తెలియజేయాలని సూచించారు.

## ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ

గుంటూరు క్రైమ్,జూన్30,ప్రభాతవార్త: ప్రజలకు వేగవంతమైన,పారదర్శకమైన,నాణ్యమైన పోలీసు సేవలు అందించాలనే లక్ష్యంతో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో చేపడుతున్న చర్యల్లో భాగంగా గుంటూరు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ వకుల్ జిందల్ మంగళవారం కొత్తపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ స్టేషన్ ఆవరణను క్షుణ్ణంగా పరిశీలించి,పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలు,ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలు,కార్యాలయ నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులు,రిజిస్టర్లు,కేసు సంబంధిత పత్రాలను పరిశీలించి,వాటి నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు.అదేవిధంగా పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని సమీక్షించి,దర్యాప్తులను నాణ్యతతో,నిర్దేశిత గడువులో పూర్తి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కేసులో చట్టపరమైన విధివిధానాలను కచ్చితంగా పాటిస్తూ సమర్థవంతమైన దర్యాప్తు చేపడుతూ తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచిన ప్రభుత్వ ఆస్తులు,కేసు ఆస్తులు,రికార్డులను సంబంధిత ఆస్తులతో సరిపోల్చి స్వయంగా పరిశీలించారు.ప్రభుత్వ ఆస్తుల సంరక్షణలో నిర్లక్ష్యం ఉండరాదని,కేసు ఆస్తులను నిబంధనల ప్రకారం భద్రపరచడంతో పాటు రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ నిర్వహించాలని అధికారులకు సూచించారు.అనంతరం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు,సిబ్బందితో ఎస్పీ ప్రత్యేకంగా సమావేశమై వారి విధి నిర్వహణ,పని పరిస్థితులు,ఎదురవుతున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు.విధి నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులను స్వేచ్ఛగా తెలియజేయాలని,సిబ్బంది సంక్షేమానికి జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.ఈ సందర్భంగా పోలీసు సిబ్బందికి క్రమశిక్షణ,సమయపాలన,ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం,ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా స్వీకరించి త్వరితగతిన స్పందించడం వంటి అంశాలపై ఎస్పీ పోలీస్ అధికారులు,సిబ్బందికి పలు సూచనలు చేశారు.ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించే విధంగా ప్రతి పోలీసు అధికారి,సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడం,పోలీస్ స్టేషన్ల పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడం,కేసుల దర్యాప్తులో నాణ్యత పెంపొందించడం,రికార్డుల నిర్వహణలో పారదర్శకత పాటించడం,పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడం జిల్లా పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని ఎస్పీ వకుల్ జిందల్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు, ఎస్బి డీఎస్పీ అలహరి శ్రీనివాస్,కొత్తపేట సీఐ వీరయ్య,ఎస్ఐలు,ఎ ఎస్ ఐ లు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




## నేడు రికగ్నైజ్డ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులతో ఉన్నత అధికారుల సమావేశం

గుంటూరు విద్య జూన్ 30 ప్రభాతవార్త : అన్ని రికగ్నైజేషన్ అసోసియేషన్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్స్ సంబంధించిన నాయకులతో ఇంటర్మీడియట్ బోర్డు ఉన్నత అధికారులు జులై ఒకటో తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కార్యాలయం తాడేపల్లిలో సమావేశం జరగనున్నది. వాస్తవానికి సమావేశం జూన్ 30వ తేదీన జరగాల్సి ఉంది. అనివార్య కారణాలతో సమావేశాన్ని జులై ఒకటో తేదీ మధ్యాహ్నం 3 గంటలకు అధికారులు మార్చారు. ఆ మేరకు గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ వారికి, ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ అండ్ గజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ వారికి తగు సమాచార నిమిత్తం ఇంటర్మీడియట్ బోర్డు తాడేపల్లి కార్యాలయం సమాచారం పంపింది.

## పలు జిల్లాలకు ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ నియామకం

గుంటూరు విద్య జూన్ 30 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ లోని పలు జిల్లాలకు ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ లను నియమిస్తూ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డి శ్రీనివాస్ విటల్ ఉత్తర్వులు విడుదల చేశారు. మన్యం జిల్లా పార్వతీపురం కు పాలకొండ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గా పనిచేస్తున్న వి. హరగోపాల్ ను నియమించారు. కాకినాడకు కాకినాడ పీఆర్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గా పనిచేస్తున్న జే. రాంబాబును నియమించారు. వెస్ట్ గోదావరి భీమవరానికి పాలకొల్లు బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్న బి. అప్పారావు నియమించారు. బాపట్లకు కావూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్న ఎల్. కోదండరామ్ ను నియమించారు. పల్నాడు జిల్లా కు దుర్గి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్న కే. వేణు ను నియమించారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పెదనందిపాడు జూన్ 30 (ప్రభాతవార్త) కార్మికులు సమస్యలు పరిష్కరించాలని, దళితవాడల్లో సమస్యలపై త్వరలో సీపిఎం పార్టీ ఆధ్వర్యంలో సర్వే చేపట్టనున్నట్లు పార్టీ గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు చెప్పారు. మంగళవారం సిపిఎం పార్టీ మండల కమిటీ సమావేశం పెదనందిపాడు లోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో కందుల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ



సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు అమలు జరిగేలా జీతాలు పెంచాలని, ఇబ్బంది పెట్టే విధంగా ఉన్న యాప్ లు రద్దు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పెన్షన్, గ్రాట్యుటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. జూలై, ఆగస్టు నెలలలో సామాజిక సమస్యలపై దళిత వాడలలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సర్వే చేపట్టడం జరుగుతుందని తెలిపారు. సర్వేలలో వచ్చిన సమస్యలపై గ్రామ సచివాలయాలలో, మండల తహశీల్దార్ కార్యాలయంలో అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన, వినతి పత్రాలు అందించడం జరుగుతుందని చెప్పారు. గుంటూరు ఛానల్ పొడిగింపు కొరకు మిగిలిన గ్రామాలలో భూసేకరణకు వెంటనే నోటిఫికేషన్ ఇచ్చి, రైతుల ఖాతాలలో డబ్బులు జమ చేయాలని, కాలువ పొడిగింపు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. నల్లమడ వాగు ఆధునీకరణకు కేటాయిస్తామన్న 400 కోట్లు వెంటనే విడుదల చేయాలని, భారీ వర్షాలు, వరదల వల్ల గత సంవత్సరం పడిన గండ్లను యుద్ధ ప్రాతిపదికన పూడ్చాలని, వాగులో ముళ్ళకంప, పూడికతీత, కట్టల బలోపేతం పనులు వెంటనే చేపట్టాలని కోరారు. ఈ తీర్మానాలను సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించారు. మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ పెదనందిపాడు, నాగులపాడు గ్రామాలలో వాడుక నీటి చెరువులలో నీరు దుర్వాసన వస్తున్నాయని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే చెరువులను బాగు చేయించి పరిశుభ్రమైన వాడుక, త్రాగు నీటిని అందించాలని కోరారు. మండలంలో పలు గ్రామాలలో డ్రైనేజ్ సమస్యలు ఉన్నాయని, పూడికతీతల తీసి కాలువలు బాగు చేయాలని కోరారు. దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో మండల సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు, సభ్యులు జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, దేవరకొండ శ్రీనివాసరావు, నల్లమోతు రాజేంద్ర, పి. భువనేశ్వరి, పసుపులేటి శేషగిరిరావు, పోపూరి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## కౌలు రైతులకు గుర్తింపు కార్డులు,పంట రుణాలు ఇవ్వాలి

పెదనందిపాడు జూన్ 30 (ప్రభాతవార్త) కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు కోరారు. మంగళవారం పెదనందిపాడు తహశీల్దార్ కార్యాలయం వద్ద కౌలు రైతు, రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ నేడు వ్యవసాయ రంగంలో 60 శాతం మంది కౌలు రైతులు భూమిని సాగు చేస్తున్నారని తెలిపారు. కౌలు రైతులకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గుర్తింపు కార్డులు, పంట రుణాలు ఇస్తామని చెప్పారని, రెండు సంవత్సరాలు గడిచినా ఆ హామీ నెరవేరలేదని చెప్పారు. భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని, అన్నదాత సుఖీభవ పథకం కౌలు రైతులకు వర్తింపజేయాలని, పంట నష్టపరిహారం, ఇతర ప్రభుత్వ పథకాలు సాగు చేస్తున్న కౌలు రైతులకే అందించాలని కోరారు. పంటల బీమా పథకాన్ని ప్రభుత్వమే ఉచితంగా అమలు చేయాలని, రైతులు పండించిన అన్ని పంటలకు కనీస మద్దతు ధరల చట్టం తేవాలని కోరారు. గిట్టుబాటు ధరలు లేక రైతులు చేసుకుంటున్న ఆత్మహత్యల్లో కౌలు రైతులు, సన్న చిన్న కారు రైతులే అధికంగా ఉన్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన ఎరువుల యాప్ రైతులకు



ఇబ్బందికరంగా ఉందని, కౌలు రైతులకు యూరియా, డిఏపీ ఎరువులు అందటం లేదని సాగుదారులు చెప్పున్నారని చెప్పారు. వెంటనే ఎరువుల యాప్ ను రద్దుచేసి రైతు సేవా కేంద్రాలలో రైతులు, కౌలు రైతులకు ఎరువులు, విత్తనాలు సబ్సిడీ ధరల్లో అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కందుల శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు, సిఐటియు నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు నల్లమోతు రాజేంద్ర, రైతు సంఘం మండల అధ్యక్షులు పసుపులేటి శేషగిరిరావు, ఉపాధ్యక్షులు పోపూరి సుధీర్, నాయకులు జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, దేవరకొండ శ్రీనివాసరావు, పి. భువనేశ్వరి, అన్నదాసు ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

## విద్యతో పాటు విలువలను పెంపొందించుకోవాలి

పెదనందిపాడు జూన్ 30 (ప్రభాతవార్త): పెదనందిపాడు ఆర్ట్ అండ్ సైన్స్ కళాశాలలో సోమవారం కళాశాల పాలకవర్గ అధ్యక్షులు ఏ్శతాలు విజిటర్స్ ఎస్సి. కళాశాల సత్యనారాయణ ఆధ్వర్యంలో మేరకు కళాశాలను సందర్శించిన ఉత్తర ప్రదేశ్ అలీగఢ్ యూనివర్సిటీ రిటైర్డ్ తెలుగు ప్రొఫెసర్ షేక్ మస్తాన్. ఈ కళాశాల పూర్వ విద్యార్థి ప్రతిపాడు మండలం పాత మల్లాయపాలెం కు చెందిన వారు. కళాశాల



ప్రిన్సిపాల్ డాక్టర్ జి వీరరాఘవయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు స్ఫూర్తిదాయక ప్రసంగం చేసి వారి అభినందనలు అందుకున్నారు. విద్యార్థులకు ఉన్నత ఆశయాలు, క్రమశిక్షణ, నిరంతర అధ్యయనమే విజయానికి పునాది అని సూచించారు. 54 సంవత్సరాల క్రితం తాను ఇదే కళాశాలలో చదువుకొని లెక్చరర్ గా, ప్రొఫెసర్ గా, డీన్ గా అలీఘర్ ముస్లిం యూనివర్సిటీలో పనిచేసి రిటైర్మెంట్ తర్వాత ప్రస్తుతం దేశంలోనే ప్రతిష్టాత్మకమైన ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్) లాంటి పోటీ పరీక్షల నిర్వాహకులు తెలుగు సబ్జెక్టుకు సంబంధించిన తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నాను అని పేర్కొన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కాలానికి అనుగుణంగా విద్యార్థులు నూతన విషయాలు తెలుసుకుంటూ మీరు ఏ భాషలో మాట్లాడినా భావవ్యక్తీకరణ స్పష్టంగా ఉండాలి అని సూచించారు. తదనంతరం కళాశాల ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతున్న డిజేబుల్ స్టూడెంట్ అబ్దుల్ సత్తార్ తో ప్రత్యేకంగా మాట్లాడి విలువైన సూచనలు చేశారు . ప్రొఫెసర్ మస్తాన్ ని కళాశాల పాలకవర్గం తరఫున పలువురు అధ్యాపకులు విద్యార్థినీ విద్యార్థులు పట్టుశాలువాతో ఘనంగా సత్కరించారు.

## పెదనందిపాడు రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులుగా శ్రీనివాసరావు కోదండరామిరెడ్డి





పెదనందిపాడు జూన్ 30 (ప్రభాతవార్త)రోటరీ క్లబ్ ఆఫ్ పెదనందిపాడు 2026.27 నూతనకార్య వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రస్తుత రోటరీ క్లబ్ అధ్యక్షులు చిన్నం శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. నూతన అధ్యక్షులుగా పోపూరి నాగేశ్వరరావు. ఉపాధ్యక్షులుగా ఎలిశెట్టి రమణయ్య. కార్యదర్శి గా యన్నం కోదండరామిరెడ్డి . సహాయ కార్యదర్శిగా నాళం పుల్లారావు. కోశాధికారిగా కోడూరి నాగేశ్వరరావు లను ఎన్నుకోవడం జరిగిందన్నారు. నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జులై 5వ తేదీ సాయంత్రం 6 గంటలకు అశోక ఉన్నత పాఠశాల లో ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## హై స్కూల్ ప్లస్ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి నేడు దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు విద్య జూన్ 30 ప్రభాతవార్త : ఉమ్మడి గుంటూరు జిల్లాలో హై స్కూల్ ప్లస్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పి జి టి తెలుగు 3, ఇంగ్లీష్ 5, మ్యాథమెటిక్స్ 3,ఫిజిక్స్ 1 , కెమిస్ట్రీ 3, జువాలజీ 4, కామర్స్ 1 మొత్తం 21 పోస్టులను భర్తీ చేయుటకు అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు అప్లికేషన్స్ ను విద్యార్హతల సర్టిఫికెట్స్ ను ఈనెల 1వ తేదీ సాయంత్రం లోపు జిల్లా విద్యాశాఖ అధికారి గుంటూరు కార్యాలయంలో అందజేయవలసినదిగా గుంటూరుజిల్లా విద్యా శాఖాధికారి డాక్టర్ షేక్ సలీం భాష ఒక ప్రకటనలో తెలియజేశారు

## తెనాలి అభివృద్ధిపై మంత్రి నాదెండ్ల మనోహర్ సమీక్ష

తెనాలి జూన్30(ప్రభాతవార్త): తెనాలి మున్సిపల్ కార్యాలయంలో మంత్రి నాదెండ్ల మనోహర్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధం, తాగునీటి సరఫరా,



రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలపై సమగ్ర చర్చ నిర్వహించారు. అనంతరం మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం వద్దని స్పష్టం చేశారు. అలాగే పెండింగ్ పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రామ అప్పలనాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తెనాలిలో సదరం శిబిరం :దివ్యాంగులకు ఉచిత కృత్రిమ పాదాలు అందజేత

తెనాలి జూన్30(ప్రభాతవార్త): కాళ్లు కోల్పోయిన, ఇతర అంగవైకల్యం కలిగిన దివ్యాంగులకు అలిమ్కో సంస్థ అడిప్ పథకం కింద ఉచితంగా కృత్రిమ కాళ్లు అందిస్తున్నట్లు వికలాంగుల సంక్షేమ శాఖ గుంటూరు అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్. వెంకటరమణప్ప తెలిపారు. మంగళవారం స్థానిక కొత్తపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సదరం శిబిరానికి 35 మందికి పైగా దివ్యాంగులు హాజరయ్యారు. అలిమ్కో సంస్థ వైద్యులు డాక్టర్ తన్మై, డాక్టర్ కోమల్ లబ్ధిదారులను



పరీక్షించి, అవసరమైన కొలతలు తీసుకుని కృత్రిమ కాళ్లు అందించేందుకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఏడీ వెంకటరమణప్ప మాట్లాడుతూ, గుంటూరు జిల్లాలోని పత్తిపాడు, మంగళగిరి, పొన్నూరు నియోజకవర్గాల్లో ఇప్పటికే సదరం క్యాంపులు ఏర్పాటు చేసి అవసరమైన పరీక్షలు నిర్వహించి కృత్రిమ కాళ్లు ఇచ్చేందుకు సన్నద్ధం చేసినట్లు వెల్లడించారు. నేడు తెనాలి మండల పరిషత్ కార్యాలయం, పట్టణ పరిధిలోని చావాస్ గ్రాండ్‌లో శిబిరం నిర్వహించి లబ్ధిదారులను గుర్తించి కృత్రిమ కాళ్లు అందజేయనున్నట్లు తెలిపారు. బుధవారం తాడికొండలో, గురువారం గుంటూరు తూర్పు మరియు పశ్చిమ నియోజకవర్గాల్లో సదరం క్యాంపులు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అలిమ్కో సంస్థ, వికలాంగుల సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న వారి సేవల్ని ఎప్పటికీ మరువకూడదు : ప్రత్తిపాటి

### ..రూ.40 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్లు, డ్రైన్లకు శంకుస్థాపన చేసిన ప్రత్తిపాటి, లావు

యడ్లపాడు, జూన్ 30, ప్రభాతవార్త : తెలుగుదేశంపార్టీ కంచుకోట అయిన తిమ్మాపురం గ్రామాభివృద్ధి కోసం సామాజిక వేత్త బొడ్డపాటి సాంబశివరావు, టీడీపీ నేతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, గ్రామస్తులు సంయుక్తంగా చేస్తున్న కృషి, వారి సహాయ సహకారాల్ని గ్రామస్తులు ఎప్పటికీ మరువకూడదని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. మంగళవారం ఆయన నరసరావపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలుతో కలిసి తిమ్మాపురంలో పలు అభివృద్ధి పనులు



ప్రారంభించారు. యడ్లపాడు మండలం తిమ్మాపురంలో గివింగ్ బ్యాక్ టు సొసైటీ సంస్థ ప్రతినిధులు సమకూర్చిన రూ.6.50 లక్షలతో గ్రామస్తులకోసం ఏర్పాటుచేసిన శుద్ధ తాగునీటి కేంద్రాన్ని, ఇద్దరు దాతలు నాగళ్ల రాంబాబు, బొడ్డపాటి సాంబశివరావులు రూ.70 లక్షలతో అత్యాధునిక హంగులతో ఏర్పాటు చేసిన స్వర్గభూమిని, రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును గ్రామస్థులు, స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రత్తిపాటి, ఎంపీ లావు ప్రారంభించారు. అనంతరం రూ.40 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు, డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం వారు గ్రామస్తులను ఉద్దేశించి ప్రసంగించారు. తిమ్మాపురం గ్రామ టీడీపీ నాయకులు నాగండ్ల రాంబాబు, ప్రముఖ



సామాజిక వేత్త బొడ్డపాటి సాంబశివరావుల సహకారంతోనే గ్రామానికి శుద్ధ జల కేంద్రం, శ్మశానవాటిక, ఇతర మౌలిక వసతులు స్వల్పకాలంలో సమకూరాయని ప్రత్తిపాటి పేర్కొన్నారు. అలానే గివింగ్ బ్యాక్ టూ సొసైటీ ప్రతినిధులు ప్రజలకోసం మంచినీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ..అభివృద్ధి ప్రాజెక్టుల నిర్వహణను ప్రజలు తమ బాధ్యతగా భావించాలి : ఎంపీ లావు : ప్రభుత్వం, దాతలు, సామాజిక వేత్తలు అందించే అభివృద్ధి ప్రాజెక్టులను ప్రజలు సద్వినియోగం చేసుకోవడంతో పాటు. వాటి నిర్వహణను కూడా తమ ప్రధాన బాధ్యతగా భావించాలని ఎంపీ లావు సూచించారు. ప్రజల సహకారం, తోడ్పాటు లేకుంటే ప్రభుత్వాలు, దాతలు చేసే అభివృద్ధి నిరుపయోగమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తేళ్ల సుబ్బారావు, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, మండల మాజీ అధ్యక్షులు ముద్దన నాగేశ్వరరావు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, బీజేపీ నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, గ్రామ నాయకులు బోలినేని వీరశేఖర్, చుండీ లోకబ్రహ్మయ్య, నాగభూరు నరేంద్ర , వంకాయలపాటి గోపి, పావులూరి రామశ్రీను, కాండ్రు బ్రహ్మయ్య, కూటమి నాయకులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎపిఎంగా ఉద్యోగోన్నతి పొందిన సిసి శేషగిరి



నిజాంపట్నం, జూన్ 30, ప్రభాతవార్తః డిఆర్‌డిఎ వెలుగు శాఖ తరపున మండలంలోని పడమటపాలెం క్లస్టర్ సిసిగా పనిచేస్తున్న గుర్రంశేషగిరిరావు ఎపిఎంగా ఉద్యోగోన్నతి పొందారు. మంగళవారం ఈ విషయమై ఉన్నతాధికారులు జారీ చేసిన ఉత్తర్వులు స్థానిక శాఖా కార్యాలయానికి చేరాయి. ఈ సందర్భంగా ఎపిఎం మస్తాన్‌రావు మాట్లాడుతూ ఇక్కడ సిసిగా పనిచేస్తున్న శేషగిరిరావు సెర్ప్ ద్వారా పల్నాడు జిల్లాకు బదిలీపై వెళ్ళారన్నారు. అక్కడ ఆయన బాధ్యతలు చేపట్టారని చెప్పారు. శేషగిరిరావుకు అభినందనలు తెలియజేశారు.


## జూలై 3న గ్రీవెన్స్ సెల్

భట్టి ప్రోలు(రేపల్లె), జూన్ 30, ప్రభాతవార్త:భట్టిప్రోలు వ్యవసాయ మార్కెట్ యార్డులో జూలై 3వ తేదీ ఉదయం 10 గంటలకు జరిగే మండల స్థాయి గ్రీవెన్స్ సెల్ కార్యక్రమంలో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొంటారని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా మంగళవారం తెలిపారు. ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. ప్రభుత్వ శాఖల అధికారులు హాజరవుతున్నందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## నేడు ఉచిత వైద్యశిబిరం

భట్టి ప్రోలు(రేపల్లె), జూన్ 30, ప్రభాతవార్త:కేంద్ర ప్రభుత్వ సహకార వారోత్సవాల సందర్భంగా భట్టి ప్రోలు వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9 గంటలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘం ముఖ్య కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు, పిఎసిఎస్ చైర్మన్ పరుచూరి రమేష్‌లు మంగళవారం తెలియజేశారు. వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తామని తెలిపారు. ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాసరావు, రమేష్‌లు కోరారు.

## విఠలేశ్వరస్వామి దేవాలయంలో గాయత్రి హోమం



భట్టిప్రోలు(రేపల్లె), జూన్ 30, ప్రభాతవార్త:పరాభవ నామ సంవత్సరం నిజ జ్యేష్టమాస పౌర్ణమి సందర్భంగా మంగళవారం భట్టి ప్రోలులోని శ్రీ హేమ విఠలేశ్వర స్వామి దేవాలయంలో 371వ గాయత్రి హోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహాగణపతి, ఆది పురుషుడు మహాదేవునికి, కార్యసిద్ధి కోసం ఆంజనేయస్వామికి గాయత్రి మంత్రాలతో హోమం, పూజా కార్యక్రమాలు పూర్తి చేశారు. కౌతరపు పద్మావతి, తూనుగుంట్ల ఝాన్సీ రాణి, పెనుకొండ నాగరాజకుమారి, బొమ్మిశెట్టి వాణి, పురం నరసమ్మ, వేల్పూరి సౌజన్య, ఎం.నాగలక్ష్మి, పురం వెంకట నరసమ్మ, వరలక్ష్మి, వడ్రాణం నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ: పారిశుద్ధంపై సూచనలు, ఓటర్ జాబితాపై అవగాహన

తెనాలి మున్సిపాలిటీ జూన్30(ప్రభాతవార్త): పట్టణంలోని 4వ వార్డు నందులపేట, బి.సి. కాలనీలో మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పారిశుద్ధ్య



పనులను స్వయంగా పరిశీలించిన ఆయన, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఓటర్ జాబితా సవరణపై అవగాహన నిర్వహించారు. అనంతరం సవివర ఓటర్ జాబితా సవరణ, మ్యాపింగ్‌పై స్థానిక ప్రజలకు కమిషనర్ అవగాహన కల్పించారు. ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత బీఎల్ఓలకు అందజేశారు. వాటిని సకాలంలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. సవివర ఓటర్ జాబితా సవరణ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని బీఎల్ఓలను కమిషనర్ రామ అప్పలనాయుడు ఆదేశించారు. ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ అనుపమ, బీఎల్వోలు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్పైసెస్ బోర్డ్ సమావేశంలో కీలక అంశాలపై చర్చించిన సభ్యుడు కొత్తూరు సుబ్బారావు

గుంటూరు విద్య జూన్ 30 ప్రభాతవార్త : న్యూఢిల్లీ మినిస్ట్రీ కామర్స్ అండ్ ఇండస్ట్రీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వాణిజ్య భవన్ లో స్పైసెస్ బోర్డు సమావేశంలో బోర్డు సభ్యులు కొత్తూరు వెంకటసుబ్బారావు అనేక విషయాలు లేవనెత్తినట్లు వెల్లడించారు. గుంటూరు జిల్లాలో ఉన్న స్పైసెస్ పార్కు దాని అభివృద్ధి, మిగిలిన సైట్ అలాట్మెంట్ విషయం గురించి ప్రస్తావించినట్లు పేర్కొన్నారు. వీలునంత తొందరలో వాటిని ప్రయారిటీ ప్రకారంగా ఎక్స్పోర్ట్ మూడు సంవత్సరాల అకౌంట్స్



పరిశీలించి అలాట్మెంట్ చేయాలని , స్పైసెస్ పార్కులో రోడ్లు, డ్రైనేజీ, వాటర్, ఫెన్సింగ్, కరెంటు, క్యాంటీన్ విషయంలో శ్రద్ధ వహించాలని వాటి విషయంలో వెంటనే తగు చర్యలు తీసుకుని అభివృద్ధి పరిచయం బాధ్యత ఉన్నదని, స్పైసెస్ బోర్డు చైర్ పర్సన్ ఏబీవీ సంగీత విశ్వనాథన్ , అలాగే సెక్రటరీ మనివనియం ఐఏఎస్ కు సమావేశంలో తెలియ చేసినట్లు కొత్తూరు సుబ్బారావు పేర్కొన్నారు. చైనాలో గుంటూరు నుంచి పంపిన 3 మిర్చి కంటైనర్లు రిజెక్ట్ అయిన వాటి యాజమాన్యం లైసెన్స్ రద్దు చేయడం విషయం గురించి మాట్లాడాలని, ఇలా జరుగుతూ పోతే ఎక్స్పోర్ట్ బిజినెస్ తగ్గుతుందని, వాళ్లల్లో ఎక్స్పోర్ట్ చేసే నైతికత తగ్గిపోయి ఇతర వ్యాపారాల మీద దృష్టిపెడతారని, దాని ఎఫెక్ట్ రైతులు తక్కువ ధరలో మిర్చి అమ్ముకోవాల్సి వస్తుందని రైతులు కూడా నష్టపోతారని, ఆదాయం తగ్గుతుందని దీనివల్ల దేశ ఆర్థిక అభివృద్ధి తగ్గుతుందని తెలియజేశాననీ ఆయన తెలిపారు .వీలున్నంతవరకు మన బోర్డు ద్వారా సమస్యను పరిష్కరించవలసినదిగా కోరానన్నారు. దీనికి స్పైసెస్ బోర్డు నుంచి కూడా ఒక కమిటీ వేసి అతి తక్కువ సమయంలో త్వరలో పరిష్కరించగలుగుతామని, చైనా వాళ్లతో టాస్క్ చేయగలుగుతామని తెలియజేశారు. ఈ బోర్డు కార్యక్రమంలో చైర్ పర్సన్ సంగీత విశ్వనాదన్ , బోర్డు సెక్రటరీ మనివనియం , బోర్డు వైస్ చైర్మన్ షాజి రాఘవన్ నాయక్ , వివిధ మంత్రి శాఖల నుంచి సెక్రెటరీ లు పాల్గొన్నారనీ బోర్డు సభ్యులు ఎక్కడ సుబ్బారావు తెలిపారు.

## గుంటూరు పార్లమెంట్ పరిధి జనసేన పార్టీ కమిటీల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు విద్య జూన్ 30 ప్రభాతవార్త: జనసేన పార్టీ అధ్యక్షులు మరియు ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రివర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పార్టీ కమిటీల నియామక ప్రక్రియ చేపట్టడం జరిగిందనీ, ఈ నియామకాల కోసం దరఖాస్తులను బొలిశెట్టి శ్రీనివాస్ స్వయంగా స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. పార్టీ సిద్ధాంతాలను విశ్వసిస్తూ, సేవాభావంతో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలనే ఆసక్తి ఉన్న కార్యకర్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బొలిశెట్టి శ్రీనివాస్ కోరారు. డి.ఎం.ఆర్. కన్వెన్షన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, భగత్ సింగ్ విగ్రహం దగ్గర, గుంటూరు చిరునామాలో ఈనెల 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు దరఖాస్తు స్వీకరిస్తారు అన్నారు. పాస్పోర్ట్ సైజ్ ఫోటో, ఆధార్ కార్డు, జనసేన సభ్యత్వం ఐడి, ఈమెయిల్ ఐడి బ్యాంకు ఖాతా వివరాలు తీసుకురావాలన్నారు. అర్హులైన పార్టీ నేతలు, కార్యకర్తలు నిర్ణీత తేదీలలో అవసరమైన పత్రాలతో హాజరై దరఖాస్తులు సమర్పించాలని బొలిశెట్టి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

## హిందూ ఫార్మసీ కళాశాలలో జంతువులలో జ్ఞాపకశక్తిని అంచనా వేయడానికి వై మేజ్ పై వర్క్ షాప్

గుంటూరు విద్య జూన్ 30 ప్రభాతవార్త: స్థానిక హిందూ ఫార్మసీ కళాశాలలో ఫార్మకాలజీ విభాగం వారి ఆధ్వర్యంలో జంతువులలో జ్ఞాపకశక్తిని అంచనా వేయడానికి ఖివైమేజ్ఖి పై వర్క్ షాప్




నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి. నాగభూషణం తెలిపారు. ఈ సందర్భంగా ఫార్మకాలజి విభాగాధిపతి డాక్టర్ డి. బ్రహ్మ శ్రీనివాస రావు మాట్లాడుతూ హిందూ ఫార్మసీ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న బి. ఫార్మసి, ఎం. ఫార్మసీ మరియు ఫార్మ్.డి విద్యార్థులకు ఈ వర్క్ షాప్ శిక్షణ వలన ఔషధ పరిశోధనలో ప్రీ క్లినికల్ ట్రయల్స్ విభాగంలో ఉపాధి అవకాశాలు పొందవచ్చని అన్నారు. అనంతరం విభాగంలోని అధ్యాపక బృందం ప్రస్తుతం వై మేజ్ లో ఎక్కువగా ఉపయోగించే అధునాతన పద్ధతులపై కంప్యూటర్ వర్చ్యువల్ ఆనిమల్ మోడల్స్ ద్వారా విద్యార్థులకు తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులకు, విద్యార్థినీ విద్యార్థులకు కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు , సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదన రావు తమ అభినందనలను తెలియచేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.సీతారామయ్య, ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ డి. బ్రహ్మ శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రిస్టియన్ హక్కుల పరిరక్షణకు క్రిస్టియన్ అడ్వకేట్స్ లీగ్ ఏర్పాటు

గుంటూరు విద్య జూన్ 30 ప్రభాతవార్త: రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛ, క్రిస్టియన్ ప్రజల స్వేచ్ఛ. హక్కుల రక్షణ కోసం న్యాయపోరటం చేయడానికి విజయవాడ కు చెందిన పలువురు అడ్వకేట్స్ ఇటీవల సమావేశం జరిపిన అనంతరం క్రిస్టియన్ అడ్వకేట్స్ లీగ్ (కాల్) ను ఏర్పాటు ఆవిర్భావ ప్రకటన చేశారు. ఈ సంస్థ కు చీఫ్ అడ్వైసర్ గా సుప్రీం కోర్టు అడ్వకేట్ వడ్లమూరి. కృష్ణ స్వరూప్ వ్యవహరించనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు గా అడ్వకేట్ అరె. దయ కృప , ప్రధాన కార్యదర్శి గా సుదర్శనం అజయ్, రాష్ట్ర సలహా దారులు గా ఎస్. అరుణ లతకుమారి, దిడ్ల విద్యాసాగర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. క్రిస్టియన్ సమాజం ఎదురుకుంటున్న పలు సామాజిక. జీవన ఆర్థిక రాజకీయ, రక్షణ సమస్యలు పరిష్కారం చేయాలనీ ఎన్ డి ఏ సర్కార్ లను డిమాండ్ చేస్తూ త్వరలో విజయవాడ నగరం లో క్రిస్టియన్ ప్రజల హక్కుల రక్షణ ర్యాలీ ని నిర్వహించాలని కాల్ ముఖ్యుల సమావేశం తీర్మానం చేయడం జరిగిందనీ కృష్ణ స్వరూప్ వెల్లడించారు. క్రిస్టియన్ సమాజం పైన మనువాద మతోన్మాదులు ఫాసిస్ట్ మత సంస్థలు చేస్తున్న దాడులను అరికట్టాలని, భారత రాజ్యాంగం ఆర్టికల్ 25 ను కచ్చితంగా కేంద్రం, రాష్ట్ర ఎన్డిఏ సర్కార్ లు అమలు చేయాలనీ, క్రిస్టియన్ ఆర్థిక కార్పొరేషన్ ను బలోపేతం చేయాలనీ డిమాండ్ చేస్తున్నట్లు కృష్ణ స్వరూప్ తెలిపారు. దళిత క్రిస్టియన్ లను ఎస్సి జాబితా లో చేర్చుతూ భారత పార్లమెంట్ లో చట్టం చేయాలనీ ( ఎస్సి రిజర్వేషన్ శాతం ను పెంచాలి.), 1950 నాటి భారత రాష్ట్ర పతి ఉత్తరువు లను పార్లమెంట్ లో రద్దు చేయటానికి చర్యలు చేపట్టాలని, కబ్జా కు గురైతున్న క్రిస్టియన్ సంస్థల ఆస్తులను పరిరక్షణ చేయాలనీ అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేయాలని ,
ఆంధ్రప్రదేశ్ అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ ను రాష్ట్ర అసెంబ్లీ లో తేవాలని తదితర డిమాండ్ లతో క్రిస్టియన్ అడ్వకేట్స్ లీగ్ ( కాల్ ) పోరాటం చేస్తుందని ప్రధాన కార్యదర్శి సుదర్శనం, అజయ్ మీడియాకు విడుదల చేసిన ప్రెస్ నోట్ లో తెలిపారు.

## చేనేత సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తాం

భట్టిప్రోలు(రేపల్లె), జూన్ 30, ప్రభాతవార్త:చేనేత సమస్యలను పరిష్కరించని పక్షంలో కూటమి ప్రభుత్వంపై ఆందోళనకు పూనుకుంటామని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ హెచ్చరించారు.మంగళవారం భట్టి ప్రోలులోని ఎఐటియుసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూళ్ళూరుపేటలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణను రూపొందించినట్లు చెప్పారు.ఎన్నికల హామీలను నెరవేర్చని ప్రభుత్వం తీరుకు నిరసనగా సమస్యలకు పరిష్కారం సాధించే దిశగా పోరాటాలను ఉధృతం చేస్తామని ఆయన తెలిపారు.కూటమి రెండేళ్ళ పాలనలో చేనేత సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు.చేనేత భరోసా కింద రూ.25 వేల ఆర్థిక సహాయం అందజేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీకి సంవత్సరం పూర్తికావస్తున్నా చేనేత కార్మికులకు ఎటువంటి సహాయం అందలేదని ఆయన గుర్తు చేశారు.చేనేత సంఘాలకు బకాయిపడిన రూ.203 కోట్లు చెల్లింపులకు నోచుకోవడంలేదన్నారు.సహకార సంఘాల కార్మికుల ఉపాధి ప్రశ్నార్థకంగా మారిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.50 సంవత్సరాల వయసు నిండిన ప్రతి కార్మికునికి పెన్షన్ మంజూరు చేయాలని,చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని బాలాజీ డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యులు కొడాలి రామకోటేశ్వరరావు,కొరి ్నపాటి వీరమోహనరావు,కౌతరపు పార్థసారధి,ఎఐటియుసి నాయకుడు బండారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## మానవత సేవా సంస్థ కార్యవర్గం



రేపల్లె, జూన్ 30, ప్రభాతవార్త:పట్టణంలోని వివేకానంద విద్యావిహార్‌లో మంగళవారం మానవత సేవా సంస్థ కార్యవర్గ సమావేశం రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది.రేపల్లె శాఖనూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.అధ్యక్షునిగా కోడె గౌరీశంకర్,ఉపాధ్యక్షునిగా పిన్ని సాంబశివరావు,కార్యదర్శిగా కె.శివశంకరరాజు,సంయుక్త కార్యదర్శిగా బావిరెడ్డి వెంకటేశ్వరరావు,కోశాధికారిగా మేకా రామకృష్ణ,కార్యవర్గ సభ్యులుగా ఎం.బి.ఎల్.నారాయణమూర్తి, కె.అగస్త య్,కె.నటరాజు, పి.శ్రీనివాసరావు,గౌరవ డైరెక్టర్‌గా పి.వి.జగన్నాథ్‌లు ఎన్నికయ్యారు.వైద్య,విద్య,సామాజిక సేవ,క్లీన్,గ్రీన్ రేపల్లె కార్యక్రమాలతో పాటు విద్యార్థులకు అవగాహన సదస్సులు,పేద,బడుగు,బలహీన వర్గాలకు ఆర్థిక సహాయం అందజేసే విధంగా మానవత సేవా సంస్థ పనిచేస్తుందని రేపల్లె శాఖ అధ్యక్షుడు కోడె గౌరీశంకర్ ప్రకటించారు.ఈ సమావేశంలో నూతన కార్యవర్గంతో పాటు మల్లెల రామచంద్రరావు, ఎస్.శివలలిత ,పి.తులసీదేవి, కె.వెంకటేశ్వరరావు,వి.మస్తాన్ రావు పాల్గొన్నారు.

## కాకినాడ రూరల్ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి



రేపల్లె, జూన్ 30, ప్రభాతవార్త:వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై అసభ్యకర,అవమానకర,విద్వేష పూరితమైన రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన కాకినాడ రూరల్ శాసనసభ్యుడు పంతం వెంకటేశ్వరరావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం రేపల్లె పోలీస్ స్టేషన్‌లో వైకాపా రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహన్‌కృష్ణ ఫిర్యాదు చేశారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నాగమోహన్‌కృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు తన వైఖరిని మార్చుకోకుంటే తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వైకాపా రేపల్లె కన్వీనర్ కరేటి శేషగిరిరావు,చిత్రాల ఓబేదు,మహిళా నాయకులు,వైకాపా శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలకు ఇండక్షన్ స్టవ్,వంట పాత్రల పంపిణీ

రేపల్లె, జూన్ 30, ప్రభాతవార్త:రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు గ్యాస్ సిలిండర్లతో అవసరం లేకుండా సురక్షితమైన,వేగవంతమైన వంటల తయారీ కోసం అనువైన ఇండక్షన్ స్టవ్‌లు,వంట పాత్రలు సమకూర్చడం అభినందనీయమని రేపల్లె నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత అనగాని శివప్రసాద్ అన్నారు.మంగళవారం రేపల్లె,పల్లపట్ల ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలోని 211 మంది అంగన్‌వాడీలకు ఇండక్షన్ స్టవ్‌లు,వంట పాత్రలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో వంట ప్రక్రియ ఆధునీకరణకు ప్రభుత్వం సమగ్రమైన నిర్ణయం తీసుకున్నం దున సత్ఫలితాలు లభిస్తాయని స్పష్టం చేశారు.ఈ విధంగా వంట కార్యక్రమాలు పూర్తి చేయడం వలన కాలుష్యం, నిర్వహణ వ్యయం తగ్గుతుందని తెలిపారు.ఇండక్షన్ స్టవ్‌ల వాడకంతో అంగన్‌వాడీ సెంటర్లకు ప్రయోజనం చేకూరుతుందని అనగాని శివప్రసాద్ చెప్పారు.కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం చర్యలు తీసుకుంటున్నదని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల ప్రతినిధులు,సిడిపివో అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.



## రేపల్లె ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ



రేపల్లె, జూన్ 30, ప్రభాతవార్త:అగ్నిమాపక శాఖ విధి నిర్వహణలో ఎటువంటి లోపాలకు తావివ్వని విధంగా 39 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకుని మంగళవారం ఉద్యోగ విరమణ చేసిన రేపల్లె అగ్నిమాపక శాఖ అధికారి యార్లగడ్డ వెంకటేశ్వరరావుకు అగ్నిమాపక శాఖ సిబ్బంది,పలువురు ప్రముఖులు అభినందించారు.జీవితం సుఖంగా సాగాలని ఆకాంక్షించారు.ఫైర్ ఆఫీసర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు నిజాయితీ,క్రమ శిక్షణను ప్రశంసించారు.ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తన సర్వీస్‌లో ఎన్నో అనుభవాలతో కొనసాగిన విధి నిర్వహణ సంతృప్తినిచ్చిందని చెప్పారు.ఉద్యోగ జీవితంలో ఎంతో నేర్చుకుని ఉత్తమ సేవలు అందించానని ఆయన పేర్కొన్నారు.ఉన్నతాధికారుల సలహాలు,సూచనలు తనకు ఎంతగానో దోహదపడ్డాయని వివరించారు.ప్రతి ఉద్యోగి సజావుగా విధి నిర్వహణ కొనసాగిస్తే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఆయన సూచించారు.వివిధ స్థాయిల్లో ఎల్లవేళలా సహకరించిన అగ్నిమాపక శాఖ సిబ్బంది సహకరించారని వెంకటేశ్వరరావు సంతృప్తి వ్యక్తం చేశారు.

## మధ్యాహ్న భోజన పథకాన్ని పక్కాగా అమలు చేయాలి


**-సర్వశిక్షా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఇడుపులపాటి పద్మావతి**

పొన్నూరు, జూన్ 30,ప్రభాతవార్త: మధ్యాహ్న భోజన పథకంలో ఎలాంటి అవకతవకలు ఆస్కారం లేకుండా పక్కాగా అమలు చేయాలని సర్వశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఇడుపులపాటి పద్మావతి ఆదేశించారు. నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంత మంది విద్యార్థులు పాఠశాలకు వస్తున్నారు. వస్తున్నవారిలో ఎంత మంది విద్యార్థులు భోజనం చేస్తున్నారు..? తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మెనూ సక్రమంగా అమలు చేస్తున్నారా..?లేదా..? అనే విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. మనబడి మన భవిష్యత్తుకు సంబంధించిన పనులు ఏ మేరకు అయ్యాయో అడిగి తెలుసుకున్నారు. అసంపూర్తిగా ఉన్న భవనాల నిర్మాణాన్ని వేగిరమే పూర్తి చేయాలన్నారు. భవనాలను త్వరితగతిన వినియోగంలోకి తెచ్చేవిధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంత మంది విద్యార్థులకు కిట్లు అందజేశారనే వివరాలను సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ నూతన విద్యా సంవత్సరంలో ఎంత మంది కొత్త విద్యార్థులు ప్రవేశాలు పొందారు. వారిలో ఎంత మంది ప్రైవేట్ పాఠశాలల నుంచి వచ్చినవారున్నారనే వివరాలను అడిగి తెలుసుకొన్నారు. ఈ ఏడాది పదో తరగతి చదవే విద్యార్థులు ఎంత మంది ఉన్నారు. వారికి ఏ విధంగా తర్ఫీదు ఇస్తున్నారనే విషయాలను ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులను అడిగి తెలుసుకొన్నారు. విద్యాశాఖ నిబంధనలను ప్రతి ఒక్కరూ అనుసరించాల్సిందేనని ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు దూపం రాజు, కొల్లి విజయభాస్కర్, జడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు శివరామకృష్ణ తదితరులున్నారు.



## విద్యార్థులకు పెన్సిల్ కిట్స్, పెన్నులు పంపిణీ

సత్తెనపల్లి, జూన్30, ప్రభాతవార్త: చిన్నారులు. మన్నెం. వెంకట ప్రసన్న, కంబాల జ్యోత్స్న శ్రీ ల పుట్టినరోజు సందర్భంగా జన విజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు ఆర్థిక సహాయంతో పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణం వడ్డవల్లి శాలివాహన నగర్ లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల. ఉర్దూ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు పెన్సిల్ కిట్స్,పెన్నులు పంపిణీ చేశారు మార్కెట్ యార్డ్ చైర్మన్ తెలుగు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కొమటినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటూ మంచి ఉన్నత స్థాయికి వెళ్లాలన్నారు లయన్స్ జీ. ఎస్. టి జిల్లాకోఆర్డినేటర్ కంబాల వెంకటేశ్వరరావు. మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థిని విద్యార్థులు గొప్ప స్థాయికి వెళ్లాలని వెంకటేశ్వరరావు కోరారు కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది బగ్గి నరసింహారావు. కంబాల శ్రీనివాసరావు. దాసరి తిరుపతిరావు. టి రామ తిరుపతిరావు. పాఠశాల ఉపాధ్యాయులు కలపాల ప్రేమ్ కుమార్. ఖాదర్ వలీ. పి శ్రీనివాసరావు. నజీర్ స్నేసా విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



## భాష్యం రామకృష్ణకు అభినందనలు తెలిపిన స్ప్లెల్టో నాయకులు

పొన్నూరు, జూన్ 30,ప్రభాతవార్త: ఇటీవల రాజ్యసభ సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన భాష్యం రామకృష్ణను సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పయర్ధ నాగయ్య, నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ప్రైవేట్ ఉపాధ్యాయునిగా జీవితాన్ని ప్రారంభించిన రామకృష్ణ అంచెలం చెలుగా ఎదిగి రాజ్యసభ సభ్యునిగా ఎదగడం తమకు ఎంతో గర్వకారణమని సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పయర్ధ నాగయ్య అన్నారు. భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ భాష్యం విద్యాసంస్థలను స్థాపించక పూర్వం తాను కూడా ఒక ప్రైవేట్ పాఠశాలలో గణితశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేశానని, ప్రస్తుతం రాజ్యసభ సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నికవడం ఆనందంగా ఉందన్నారు. తనకు వచ్చిన అవకాశాన్ని ప్రజా సేవకు అంకితం చేసి తన విద్యుక్త ధర్మాన్ని తు.చ తప్పకుండా నిర్వహిస్తానని చెప్పారు. రామకృష్ణకు అభినందనలు తెలిపినవారిలో స్ప్లెల్టో కళాశాల జాతీయ అధ్యక్షుడు కావూరి గోవిందరాజులు, పాఠశాల జాతీయ అధ్యక్షుడు కొండపల్లి విల్సన్, జాతీయ కార్యదర్శి ఎం.రాకేష్, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు భరివి వెంకటరమణ, షేక్ జాఫర్, సంస్థ జాతీయ, రాష్ట్రస్థాయి నాయకులు పాల్గొన్నారు.



## రాముడి పేరుతో రాజకీయ పబ్బం గడుపుకొంటున్న బిజెపి

### -కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అందె దిలీప్

పొన్నూరు, జూన్ 30,ప్రభాతవార్త: అయోధ్య రామమందిర నిర్మాణం పేరిట దశాబ్దాలుగా బిజెపి తన రాజకీయ పబ్బం గడుపుకొంటుందని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అందె దిలీప్ అన్నారు. అయోధ్య రామమందిర నిర్మాణంలో జరిగిన వేలాది కోట్ల రూపాయల అవకతవకలపై దిలీప్ మాట్లాడారు. బిజెపికి రాముడన్నా, హిందువులన్నా భయభక్తులుగానీ, భక్తి విశ్వాసాలు కాని లేవన్నారు. శ్రీరాముల వారిని బిజెపి తన ఉనికిని కాపడుకునే రక్షణ కవచంలా వాడుకొంటుందని విమర్శించారు. రామజన్మభూమి తీర్థ ట్రస్ట్‌లో ఒక క్రమ పద్ధతిలో ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ నాయకులను నియమింపచేసిన బిజెపి దశాబ్దాలుగా అయోధ్య రామమందిర నిర్మాణం పేరిట దేశవ్యాప్తంగా హిందూ భక్తులు అందిస్తూ వస్తున్న విరాళాలను తయ రాజకీయ మనుగడకు వాడుకొంటూ, అధికారంలోకి రావడం, అధికారులను కొనటం చేస్తూ వచ్చిందన్నారు. ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ సంస్థలుగా అనేక పర్యాయాలు నిషేధాలు ఎదుర్కోవడంతో జనసంఘ్ పేరిట రాజకీయ అవతారం ఎత్తాయని, కాలానుగుణంగా జనసంఘ్ బిజెపిగా రూపాంతరం చెందిందన్నారు. ఒక విషపు ఆలోచనతో మొదలైన ఆర్ఎస్ఎస్ సంస్థ విభజన, విద్వేషభావాలను రెచ్చగొడుతూ నిత్యం దేశంలో అలజడులు సృష్టిస్తూ తమ అస్తిత్వాన్ని కాపాడుకొంటూ వందేళ్ళు పూర్తి చేసుకొందన్నారు. ఇక బిజెపి దేశ ప్రజల మనోభావాలతో, ఆర్థిక విరాళాలతో ఆడుకోవడం కొత్తకాదన్నారు. పిఎం కేర్స్ పేరిట కోవిడ్ సమయంలో వేలాది కోట్ల విరాళాలు సేకరించారని, వాటి గురించి నేటికీ బిజెపి లెక్కలు చెప్పలేదన్నారు. ఇప్పుడు మరోసారి అయోధ్య రామమందిర నిర్మాణంలో సేకరించిన వేల కోట్ల విరాళాలను తమ రాజకీయ అవసరాలకు దారిమళ్లించారని దుయ్యబట్టారు. విరాళాల వివరాలను కోరుతుంటే వ్యవస్థలను వశపరచుకొని తమకు అనుకూలంగా దాటవేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తక్షణం పీఎం కేర్స్, రామజన్మభూమి తీర్థ ట్రస్ట్ ద్వారా సేకరించిన విరాళాల వివరాలను ఈ దేశ ప్రజల ముందు బహిర్గతం చేయాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. సమావేశంలో ఎలమంద, తదితరులున్నారు.



## గిరిజన మహిళపై దాడిచేసిన వారిని శిక్షించాలి

**-వైకాపా జిల్లా అధికార ప్రతినిధి వెంకటసుబ్బయ్య**

పొన్నూరు, జూన్ 30,ప్రభాతవార్త: నెల్లూరు జిల్లా, కావలి నియోజకవర్గం కచ్చేరి మిట్టలో ఎస్టీ(గిరిజన)సామాజిక వర్గానికి చెందిన మహిళపై జరిగిన అమానుష దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వైకాపా జిల్లా అధికార ప్రతినిధి ఎందేటి వెంకటసుబ్బయ్య అన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.గిరిజన మహిళపై టిడిపి మాజీ కౌన్సిలర్ ఇబ్రహీం, అతని అనుచరులు జూన్ 19 రాత్రి దాడికి తెగబడి బాధితురాలని ఇంటిలో నుంచి వీధిలోకి లాగి వివస్త్రను చేసి కాళ్ళతో చేతులతో విచక్షణారహితంగా దాడి చేయడం అమానుషమన్నారు. ఈ సంఘటనకు సంబంధించి బాధితురాలు ఫిర్యాదు చేసినప్పటికీ, అధికార పార్టీ నేతల ఒత్తిళ్ళ కారణంగా పోలీసులు సకాలంలో కేసు నమోదు చేయకుండా పక్షపాతంగా వ్యవహరించారన్నారు. గిరిజన మహిళ మాన ప్రాణాలకు భంగం కలిగించి, అనాగరికంగా ప్రవర్తించిన టీడీపి మాజీ కౌన్సిరల్ ఇబ్రహీం, అతని అనుచరులను కఠినంగా శిక్షించాలని, బాధితురాలికి రక్షణ కల్పించి, ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తప్పుడు సెక్షన్లతో కాకుండా బాధితురాలికి న్యాయం జరిగేలా ఎఫ్ఐఆర్‌లో కఠినమైన చట్టపరమైన సెక్షన్లను నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు, ముఖ్యంగా దళిత, గిరిజన వర్గాలకు రక్షణ కరవైందన్నారు. పోలీసులు ఈ ఘటనపై స్పందించి బాధితురాలకి న్యాయం చేయాలని, లేని పక్షంలో న్యాయం జరిగే వరకు వివిధ మార్గాల ద్వారా న్యాయం పోరాటం చేస్తామని హెచ్చరించారు.



## బిఎల్వోలు డిజిటైజేషన్ వేగవంతం చేయాలి

**-నియోజకవర్గ ఓటు నమోదు అధికారి ఇడుపులపాటి పద్మావతి**

పొన్నూరు, జూన్ 30,ప్రభాతవార్త: బిఎల్వోలు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు సంబంధించి ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ చాలా వరకు పూర్తయిన నేపథ్యంలో డిజిటైజేషన్‌ను కూడా వేగవంతం చేయాలని సర్వశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్, నియోజకవర్గ ఓటు నమోదు అధికారి ఇడుపులపాటి పద్మావతి ఆదేశించారు. నియోజకవర్గంలో 2,28,214మంది ఓటర్లు ఉండగా 2,23,832మంది ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. మొత్తం మీద నియోజకవర్గంలో 98.08శాతం ఫారాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. పొన్నూరురూరల్, పట్టణ పరిధిలో 99.99శాతం పంపిణీ చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా బిఎల్వోలు ఓటర్ల వద్ద నుంచి పూర్తి చేసిన ఫారాలను తీసుకొని డిజిటైజేషన్ కార్యక్రమాన్ని కూడా వేగవంతం చేయాలన్నారు. నియోజకవర్గం మొత్తం మీద 32.18శాతం మాత్రమే డిజిటైజేషన్ చేసినట్లు చెప్పారు. ఓటర్లు కూడా పూర్తి చేసిన ఫారాలను బిఎల్వోలకు తర్వగా ఇచ్చినట్లయితే డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఓటర్లు బిఎల్వోలకు సహకరించాలన్నారు. బిఎల్వోలు విధుల్లో అలసత్వం వహించకుండా చురుగ్గా పనిచేసి నూరుశాతం ఫలితాలు సాధించేవిధంగా కృషి చేయాలన్నారు. ప్రత్యేకాధికారి వెంట తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్, కంప్యూటర్ ఆపరేటర్ షేక్ సిరాజుద్దీన్, బిఎల్వోలున్నారు. మునిపల్లె గ్రామంలోని 162,163పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పట్టణంలో జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, తదితర పాఠశాలల్లోని పోలింగ్ స్టేషన్లను ఆమె పరిశీలించారు. అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు.



## ప్రతి పౌరుడి ఓటు కాపాడాల్సిన బాధ్యత బిఎల్యేలదే

**-నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ**



చేబ్రోలు(పొన్నూరు), జూన్ 30,ప్రభాతవార్త: ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడి ఓటుని కాపాడాల్సిన బాధ్యత బిఎల్యేలపై ఉందని వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. చేబ్రోలు మండల పరిధిలోని వేజండ్ల గ్రామంలో చేబ్రోలు మండలంలోని అన్ని బూత్‌లెవల్ ఏజెంట్లు, ముఖ్యనాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా బూత్ లెవల్ ఆఫీసర్లతో కలిసి ప్రతి ఓటరుకు అవగాహన కల్పించే విధంగా కృషి చేయాలన్నారు. ఓటర్లకు ఫారాలను పూర్తి చేసే ప్రక్రియపై కూడా అవగాహన కల్పించాలన్నారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా తయారు చేసుకోవడం ద్వారా రాబోయే రోజుల్లో మనం జగనన్నను ముఖ్యమంత్రిగా చూసే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి బిఎల్యే సైనికుడిలా పనిచేయాలన్నారు. కార్యకర్తలు, నాయకులు బిఎల్యేలకు మద్దతుగా ఉండి కార్యక్రమాన్ని సజావుగా పూర్తి చేయాలని సూచించారు.

# తవ్వుకో..అమ్ముకో..

## ప్రైవేటు భూమిలో మట్టి తోడేళ్లు.
## పల్లపాడులో మట్టి అక్రమార్కుల దోపిడీని ఆపేదెవరు?

ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), జూన్ 30, ప్రభాతవార్త : మట్టి మాఫియా రాజ్యమేలుతుంది. జెసిబిలు, ట్రాక్టర్లు వినియోగించి పెద్ద ఎత్తున ప్రైవేటు లేఅవుట్లకు, ఇళ్ల స్థలాలకు, పల్లపు భూములకు మెరక చేసుకునేందుకు తరలించి సొమ్ము చేసుకుంటుంది. అధికారుల అలసత్వాన్ని అడ్డుపెట్టుకొని రూ.లక్షలు గడిస్తున్నారు. అక్రమార్కులు ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో మట్టిని పెద్దఎత్తున తరలిస్తున్న చర్యలు లేకపోవడంపై స్థానికంగా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రత్తిపాడు నియోజకవర్గం, వట్టిచెరుకూరు మండలంలోని పల్లపాడు, కొర్నెపాడు, లేమల్లెపాడు, ముట్లూరు, కోవెలమూడి, తదితర గ్రామాలలోని చెరువుల్లో నీరు ఉండడంతో అక్రమార్కుల చూపు డ్రైనేజ్ కాలువలు, వాగు పోరంబోకు స్థలాలపై పడి నిలువునా మట్టి మింగేస్తున్నారు. గతంలో రాత్రి వేళల్లో మట్టిని చాటుమాటుగా తరలించేవారు. ప్రస్తుతం అక్రమార్కులు పట్టపగలే బహిరంగంగా పనికానిచ్చేస్తున్నారు. వందల ట్రాక్టర్లతో మట్టిని తరలించి ఒక్కొక్క ట్రాక్టర్ కు దూరాన్ని బట్టి రూ.1300 నుంచి రూ.1500 వరకు విక్రయిస్తున్నారు. ఈ రకంగా రోజుకు లక్షల రూపాయలు అక్రమార్జన చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. ప్రభుత్వానికి ఒక్కపైసా రుసుము చెల్లించకుండానే తమపని కానిచ్చుకుంటున్నారు. ..మండలంలోని పల్లపాడు గ్రామానికి చెందిన ఓవ్యక్తి మిర్చి వ్యాపారం చేయడానికి గ్రామానికి చెందిన కొంతమంది సన్నకారు రైతుల వద్ద నుండి పెద్ద మొత్తంలో డబ్బులు అప్పుగా తీసుకున్నాడు. ఈ డబ్బులతో వ్యాపారం చేస్తూ ఉన్న క్రమంలో అప్పులు సవిచూ డాల్సి వచ్చిందని బాధితుడు తెలుపుతున్నాడు. అప్పులు ఇచ్చినవారు బాధితుడిపై ఒత్తిడి తేవడంతో, అప్పుల వారికి సరైన సమాధానం చెప్పలేక తన పేరుతో ఉన్న ఐదు ఎకరాల వ్యవసాయ భూమిని ఐపిపెట్టి కోర్టులో పిటీషన్ దాఖలు చేసుకున్నాడు. దీనితో అప్పులు ఇచ్చిన వారు అగ్గిమీద గుగ్గిలమై మాకు సరైన సమాధానం చెప్పకుండా, డబ్బులు ఇవ్వకుండా, కోర్టులో పిటిషన్ వేయటం ఎంతవరకు సమంజసమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనితో డబ్బులు ఇచ్చిన రైతులు మొత్తం ఏకమై, రుణదాత వ్యవసాయ భూమిలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా రాత్రి పగళ్ళు మట్టి తోలకాలు జరుపుతున్నారు. ఈ భూమిలో అక్రమార్కులు ఎక్కువ లోతు పెట్టి మట్టిని తీస్తున్నారు. సిఫార్సులతో వెనక్కి తగ్గుతున్న అధికారులు ఈ గ్రామంలో అక్రమ మైనింగ్ జోరు ఏమాత్రం తగ్గలేదు. అధికారుల అడ్డగింతలు, నేతల సిఫార్సులతో అక్రమార్కులకు మూడు పువ్వులు ఆరు కాయలు చందంగా తయారయింది. అక్రమ మట్టి దందా వ్యవహారం భారీగా జరుగుతుంది. ఈ అక్రమ మైనింగ్ ను అంటుకునేవారు, అడ్డు చెప్పేవారు లేకపోవడంతో అక్రమార్కులు ఆడిందే ఆట పాడిందే పాటగా పరిస్థితి మారింది. ఇంతభారీ అక్రమ మైనింగ్ జరుగుతున్నగాని రెవిన్యూ, పోలీస్, జల వనరులు, మైనింగ్, తదితర శాఖల అధికారులు మామూళ్ల మత్తులో ఉండి, కబోధి పక్షుల్లా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వోల్టా చట్ట ప్రకారం సంబంధిత శాఖల నుండి అనుమతులు తీసుకోకుండానే వాగులు, చెరువులు, ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో మట్టిని బేస్మెంట్లకు, ఇతర అవసరాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.



## 20 లక్షల ఉద్యోగాలు అందించడమే కూటమి లక్ష్యం: జూలకంటి గౌతమ్‌రెడ్డి

మాచర్ల, జూన్ 30 ప్రభాతవార్త: యువతకు 20 లక్షల ఉద్యోగాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ యువ నాయకులు జూలకంటి గౌతమ్‌రెడ్డి ఉద్ఘాటించారు. మంగళవారం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, కృష్ణవేణి విద్యాసంస్థలు సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఎస్వీఆర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన మెగాజాబ్ మేళా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను పటిష్టమైన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ అహర్నిశలు పాటుపడుతున్నారన్నారు. రూ.24 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొచ్చి, యువత ఉపాధికి పెద్దపీట వేస్తున్నారని వివరించారు. ఎమ్మెల్యే జూలకంటి సారథ్యంలో మాచర్ల నియోజకవర్గం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతుందని తెలిపారు. మల్టీనేషనల్ కంపెనీలతో మెగాజాబ్ మేళా నిర్వహిస్తున్నామని, నియోజకవర్గ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, మంచి ఉద్యోగాలు సాధించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి తమ్మాజీరావు, ప్లేస్‌మెంట్ అధికారి రామాంజనేయులు, రవీంద్రనాయక్, కళాశాల ప్రిన్సిపల్ వెంకటరామయ్య, టీడీపీ సీనియర్ నాయకులు యాగంటి మల్లికార్జునరావు, పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు, కంభంపాటి అనిల్‌కుమార్, శశిధర్‌రెడ్డి, మద్దిగపు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## టీ ఎన్ నగర్ లో ఆయుర్వేద ఆరోగ్య శిబిరం: డాక్టర్ ఆర్ శ్రీనివాస్

రాజుపాలెం, జూన్ 30, ప్రభాతవార్త: పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం టి ఎన్ నగర్లో పై అధికారుల డాక్టర్ ఎం శేఖర్ రాజు ప్రాంతీయ ఉపాసంచాలకుల ఆదేశానుసారం డాక్టర్ ఆర్ శ్రీనివాస్ ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధుల పైన ఆరోగ్యం పైన అవగాహన సదస్సు మరియు వైద్య శిబిరం డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆరోగ్యం పైన అందరూ అవగాహన కలిగి ఉండాలని వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత వాటి ప్రాముఖ్యత గురించి తెలియపరచి కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండలంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల కోట నెమలిపురి మరియు గణపవరం నందు ఆయుర్వేద ఉచిత వైద్య సేవలను అందిస్తున్నారని ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు వైద్య సేవలను మండలంలోని గ్రామ ప్రజలందరూ వినియోగించుకోవాలని డాక్టర్ శ్రీనివాస్ మరియు డాక్టర్ కాంచన కోరుచున్నారు మరియు యోగా శిబిరాలు యోగా ఇన్స్పెక్టర్ల చేత యోగాను నేర్చుకొని ఆరోగ్యంగా ఉండాలని తెలియపరుస్తున్నారు అన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధులకు తరుణ వ్యాధులకు వైద్యము అందించబడున. వృద్ధులు గర్భిణీ స్త్రీలు పిల్లలు సీజనల్ వ్యాధుల, నీరసం నుంచి తప్పించుకోవడానికి ప్రతిరోజూ 34లీటర్ల నీరు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, పండ్ల రసాలు తీసుకోవాలి. పుచ్చకాయ, దోసకాయ వంటి నీటి శాతం ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం ద్వారా శరీరాన్ని చల్లగా ఉంచుకోవచ్చు. తరచుగా నీరు తాగాలి, నిమ్మరసం, కొబ్బరి నీరు, సబ్జనీరు రాగి జావా సంకటి మజ్జిగ మరియు ఒక గ్లాస్ నీటిలో నిమ్మకాయ రసం చిటికెడు ఉప్పు కొంచెం కండ చక్కెర కలుపుకొని త్రాగవలెను వారందరికీ వైద్య శిబిరం నిర్వహించే ఆయుష్ మందులను పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో జాన్ సైదా వెంకటేశ్వర్లు మార్తమ్మ సుబ్బారావు గ్రామస్తులు మొదలగు వారు పాల్గొన్నారు




## నూతన వస్త్ర బహుకరణ కార్యక్రమంలో పాల్గొన్న సమన్వయకర్త డాక్టర్ గజ్జల

సత్తెనపల్లి, జూన్30, ప్రభాతవార్త: సత్తెనపల్లి రూరల్ మండలం కంటే పూడి గ్రామంలో మద్దు రాజశేఖర్ శివ పార్వతి కుమారుడు, కుమార్తె, రోహిత్, జయశ్రీ గార్ల నూతన వస్త్ర బహూకరణ కార్యక్రమంలో పాల్గొని చిరంజీవులను ఆశీర్వదించిన సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుదీర్ భార్గవ రెడ్డి. ఈ కార్యక్రమంలో కళ్ళం విజయ భాస్కర్ రెడ్డి గారు, కొర్లకుంట వెంకటేశ్వర్లు గారు, జంగా మల్లిఖార్జునరెడ్డి గారు, కొమేర శివశంకర్ గారు, గురవయ్య గారు, కాకి హనుమంతరావు, అశోక్, రామ్ దాసు,నామాల నాగార్జున , మద్దు పురుషోత్తం, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## సీనియర్ సిటిజన్స్ హక్కుల పరిరక్షణ పై న్యాయ అవగాహన సదస్సు

సత్తెనపల్లి, జూన్30, ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు, సత్తెనపల్లి న్యాయ సేవాధికార మండల కమిటీ చైర్మన్,మరియు సీనియర్ సివిల్ జడ్జి వి.విజయ్ కుమార్ రెడ్డి గారి సూచనలతో సీనియర్ సిటిజన్స్ కు వారి హక్కుల పట్ల అవగాహన కల్పించటం జరిగింది. సత్తెనపల్లి పట్టణం లోని పెన్షనర్స్ ఆసోషియేషన్ కార్యాలయంలో కె.బి.అర్.జె. ప్రసాద్ అద్యక్షతన సమావేశము మంగళవారం ఎర్పాటు చేయటం జరిగింది. ముఖ్య అతిధిగా దివ్వెల శ్రీనివాస రావు హజరైనారు. ఆయన మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ కు ఉన్న సమస్యలమ న్యాయ వ్యవస్థ ద్వార తీర్చుకోవచ్చని తెలియజేశారు. న్యాయ వ్యవస్థ తో పాటు ప్రజల సహకారం కావాలన్నారు. వృద్ధులైన తల్లిదండ్రులను ఆదరించాల్సిన బాధ్యత బిడ్డలపై ఉందని తెలిపారు. పారా లీగల్ వాలంటీర్లు షేక్ సుభాని, కె.బి.ఆర్.జె. ప్రసాద్ అవగాహన సదస్సు ప్రాముఖ్యత ను వివరించారు. ఈ కార్యక్రమంలో వెంకటాద్రి, జయనుల్లా, సుందర సింగ్, శృంగారం, మల్లేశ్వరరావు, జగన్నాథ నాయుడు, సుబ్బరావు, మురహరిరావు, రామ కోటయ్య, క్రీస్తుదాసు, ఖాదర్ వలి, రాజారావు, నాగ వర్ధన్, హనుమంతరావు, మోహిద్దీన్, వెంకట రావు తదితరులు హాజరయ్యారు.



## ఎస్టీ వర్గీకరణతోనే యానాదులకు సామాజిక న్యాయం

మంగళగిరి, జూన్ 30, ప్రభాతవార్త: రాష్ట్రంలో ఎస్టీ వర్గీకరణను తక్షణమే అమలు చేయడంతో పాటు యానాది తెగ అభ్యున్నతి కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని యానాది రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరు పెంచలయ్య యానాది ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళగిరి పట్టణంలోని ఆర్ అండ్ బి బంగ్లా వద్ద నుంచి గౌతమ బుద్ధ రోడ్డు మీదగా ర్యాలీగా అంబేద్కర్ సెంటర్ కు చేరుకొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన "యానాది మహా గర్జన సభ అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు 2025 ఆగస్టులో ఇచ్చిన తీర్పు ప్రకారం ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది గిరిజనులు ఉండగా, 33 గిరిజన తెగల్లో యానాది తెగకు




చెందినవారు దాదాపు 10 లక్షల మంది ఉన్నారని తెలిపారు. జనాభాలో అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ విద్య, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు, రాజ్యాంగ పరిరక్షణ, రిజర్వేషన్ ప్రయోజనాలు యానాది సమాజానికి సముచితంగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యానాది సమాజానికి న్యాయమైన హక్కులు, సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతోనే "యానాది మహా గర్జన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన వెంటనే యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. యానాదుల సామాజిక, ఆర్థిక పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, ఆ కమిషన్ నివేదిక ఆధారంగా ఎస్టీ వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాపట్ల బ్రహ్మయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు రావూరి రాజు, గుంటూరు జిల్లా అధ్యక్షులు బాకుల మురళి, మహిళా నాయకులు చంబేటి ఉష, కృష్ణవేణి, వివిధ జిల్లాల అధ్యక్షులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు

## ఎంఈఓగా విద్యారంగంలో నిస్వార్థ సేవలు అందించారు : అర్తిమల్ల

పెదకూరపాడు,జూన్ 30, ప్రభాతవార్త: మండల విద్యాశాఖ అధికారి 2 గా విధులను నిర్వర్తించిన సత్యనారాయణ విధి నిర్వహణలో నిస్వార్థంగా తమ సేవలందించి పదవి విరమణ చేశారని జిల్లా మాజీ టిడిపి కార్యదర్శి అర్తిమల్ల రమేష్ అన్నారు. ఆయన సేవలకు గుర్తుగా చిరుకానుకను అందించి దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అంటే ఎంతో ఉన్నతమైన వృత్తి అని అలాంటి రంగంలో సత్యనారాయణ మాస్టారు ఎన్నో సేవలు విద్యార్థులకు ఉపాధ్యాయులకు అందించి ఈరోజు ఉద్యోగ విరమణ లో భాగంగా విశ్రాంతి తీసుకుంటున్నారని అన్నారు. మండల వ్యాప్తంగా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు హై



స్కూల్ ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని ఆయనకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఏ కుల ప్రసాదరావు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మక్కెనసాగర్, 14వ డిసి సంఘం చైర్మన్ వడ్లమూడి అప్పారావు, నెల్లూరి మల్లికార్జునరావు, పివిడి ప్రసాద్ మాస్టర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి నేత గోవాడ దుర్గారావుకు పూర్వ విద్యార్థులు పరామర్శ

తాడేపల్లి, జూన్ 30, ప్రభాతవార్త: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఆంజనేయ కాలనీలో ఇటీవల మెట్లు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారిపడి ఎడమ కాలు ఎముక విరిగి చికిత్స పొంది తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న సౌత్ ఇండియా కాపు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గోవాడ దుర్గారావును మంగళవారం స్థానిక సికె హైస్కూల్ 1982 83 సంవత్సరం 10వ తరగతి పూర్వ విద్యార్థులు పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడారు. చిన్నతనం నుండే చురుకైన స్వభావం గల గోవాడ దాన్ని కొనసాగిస్తూ రాజకీయంగా, సామాజికంగా ముందుకు సాగుతు న్నారన్నారు. అందరితో కలిసిమెలసిగా ఉండే గోవాడకు కాలు



విరగడం బాధాకరమన్నారు. బాల్య మిత్రులను ఒకే వేదిక మీదకు తీసుకురావడానికి గోవాడ ఎంతో కృషి చేశారని, ఆయన త్వరగా కోలుకొని మిత్రులు, రాజకీయ, కాపు సామాజిక కార్యక్రమాలలో యధావిధిగా పాల్గొనాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, వీజే విద్యాసంస్థల ప్రగడ రాజశేఖర్, రోప్ పార్టీ ఎస్ఐ యేమినేని సాంబశివరావు, మాజీ కౌన్సిలర్ జంజనం శ్రీనివాసరావు, తిరువీధుల శ్రీనివాసరావు కమతం శ్రీనివాసరావు, సింహాద్రి వీరాంజనేయులు, జంపా ప్రభాకర్, నందిగం ధనరాజు, గోకవరపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 26 ఏళ్ల సేవలకు వీడ్కోలు
### అంగనవాడి ఉపాధ్యాయిని కంచర్ల అన్నమ్మ ఘనంగా పదవీ విరమణ

కాకుమాను జూన్ 30 ( ప్రభాత వార్త ): మండల పరిధి పాండ్రపాడు సెక్టర్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న కొల్లిమర్ల గ్రామవాసి, సీనియర్ అంగనవాడి ఉపాధ్యాయిని కంచర్ల అన్నమ్మ మంగళవారం అంగన్వాడి ఉపాధ్యాయురాలు పదవీ విరమణ చేశారు.దాదాపు 27సంవత్సరాల పాటు విద్యా సేవలో తరించిన ఆమెకు అంగన్వాడి కేంద్రంలోని ఆవరణలో తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఘనంగా వీడ్కోలు పలికి సన్మానించారు.ఈ కార్యక్రమంలో



అంగనవాడి ఉపాధ్యాయులు,పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు,పాండ్రపాడు సెక్టర్ సూపర్వైజర్ ప్రేమలత పాండ్రపాడు సెక్టర్ పరిధిలో అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు

## ఓటరు మ్యాపింగ్, డిజిటలైజేషన్ను త్వరగా పూర్తిచేయాలి..


ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), జూన్ 30, ప్రభాతవార్త : ఓటరు డిజిటలైజేషన్, మ్యాపింగ్ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని ఇన్చార్జి తహసీల్దార్ రాజీవ్ కుమార్ పేర్కొన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అంశంపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వెలుగు సిబ్బంది, అంగనవాడి కార్యకర్తలు, బిఎల్ఓలకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్చార్జ్ తహసీల్దార్ మాట్లాడుతూ...ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువును పాటించడం అత్యంత కీలకమని, నిర్లక్ష్యం చేస్తే ఎన్నికల సంఘం నుంచి షోకాజ్ నోటీసులు జారీఅయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం ప్రక్రియ ప్రారంభమై ఇప్పటికే 15 రోజులు గడిచాయని, ఇంకా 14–15 రోజుల సమయం మాత్రమే మిగిలి ఉందని పేర్కొన్నారు. మండలంలో ఓటర్ల డిజిటలైజేషన్, మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని, నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలంటే ప్రతిరోజు కనీసం 10శాతం మేర పురోగతి సాధించాలని తెలియజేశారు. చివరి రోజుల్లో కొంతమంది ఓటర్లకు సంబంధించిన వివరాల ధృవీకరణ, పత్రాల పరిశీలన వంటి పనులకు అదనపు సమయం



అవసరమవుతుందని, అలాగే ప్రక్రియలో ఏవైనా లోపాలు తలెత్తితే వాటిని సరిదిద్దేందుకు కూడా రెండు నుంచి మూడు రోజుల సమయం కేటాయించాల్సి ఉంటుందని, అందువల్ల ముందస్తు ప్రణాళికతో వేగవంతంగా పనిచేసి, గడువుకు ముందుగానే డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని బిఎల్ఓలను ఆదేశించారు. బీఎల్ఓలకు సహాయకులుగా అంగన్వాడీలు, వెలుగు సిబ్బంది ఉంటూ పరస్పర సమన్వయంతో పనిచేసి డిజిటలైజేషన్ ప్రక్రియను ఈనెల 14వ తేదీ గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా ఎన్నికల ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. నిరంతర పర్యవేక్షణ, పూర్తిబాధ్యతతో పనిచేస్తే ఓటర్ మ్యాపింగ్, డిజిటలైజేషన్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయగలరని పేర్కొన్నారు. డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతగా చేపట్టి, ఎటువంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అన్ని వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. మండలంలోని 45 పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు మండలంలో 27.37 శాతం మాత్రమే డిజిటలైజేషన్ పూర్తయిందని చెప్పారు. సమయం తక్కువగా ఉండగానే బిఎల్ఓలు డిజిటలైజేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారి శరణ్య, వీఆర్వో గిరిధర్, వెలుగు సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేసిన వారికి ప్రాధాన్యత

గుంటూరు, జూన్ 30, ప్రభాతవార్త: జనసేన పార్టీ బలోపేతానికి కృషిచేసిన కార్యకర్తలకు సముచిత స్థానం ఇవ్వనున్నట్లు తాడేపల్లిగూడెం జనసేన పార్టీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, గుంటూరు పార్లమెంట్ దరఖాస్తు స్వీకరణ పరిశీలకులు బొలిశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గుంటూరు రూరల్ మండలంలోని ఇన్నర్ రింగ్ రోడ్డు, ఫేస్1లోని డిఎంఆర్ కన్వర్షన్లో గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తాడేపల్లిగూడెం శాసనసభ్యులు , ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాసరావు హాజరై మాట్లాడుతూ..జనసేన పార్టీని బలోపేతం చేయడంపై అధిష్ఠానం దృష్టి పెట్టిందన్నారు. ఇందులో



భాగంగా పార్టీ నేతలతో జనసేన సమాచార సేకరణ కమిటీ, గుంటూరు పార్లమెంట్ పరిశీలకులుగా అధిష్టానం తనను నియమించినట్లు చెప్పారు. ఇప్పటి వరకు పార్టీకి సేవలందించి, పార్టీ పటిష్టతకు ఎవరు ఏవిధంగా కృషి చేశారు?, భవిష్యత్తులో ఏ విధమైన సేవలు అందించడానికి ఆసక్తి చూపుతున్నారనే దానిపై కార్యకర్తలు, నేతల నుండి అభిప్రాయాలు సేకరించారు. పంచాయతీ, మండల, అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ఏస్థాయిలో సేవలందించాలనుకుంటున్నారో వారినుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు సమావేశం నిర్వహించారు. వారి నుంచి సేకరించిన దరఖాస్తులను పార్టీ అధినేత ముందుకు తీసుకువెళ్లనున్నట్టు తెలిపారు. పార్టీకోసం ఎన్నో సంవత్సరాలుగా సేవలు అందించిన కార్యకర్తలు తమ రాజకీయ, సామాజిక సేవా కార్యక్రమాల వివరాలను అర్జీల రూపంలో అతిథికి అందించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు గుంటూరు పార్లమెంటు పరిశీలకులు వడ్రాణం మార్కండేయ బాబు, మానస, గాదె వెంకటేశ్వరరావు, సునీల్ కుమార్, మరియు పార్లమెంటు సమాచార కమిటీ సభ్యులు, జన సైనికులు, వీర మహిళలు,తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## తవ్వుకో..అమ్ముకో....
## పల్లపాడులో మట్టి అక్రమార్కుల దోపిడీని ఆపేదెవరు?

ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), జూన్ 30, ప్రభాతవార్త : మట్టి మాఫియా రాజ్యమేలుతుంది. జెసిబిలు, ట్రాక్టర్లు వినియోగించి పెద్ద ఎత్తున ప్రైవేటు లేఅవుట్లకు, ఇళ్ల స్థలాలకు, పల్లపు భూములకు మెరక చేసుకునేందుకు తరలించి సొమ్ము చేసుకుంటుంది. అధికారుల అలసత్వాన్ని అడ్డుపెట్టుకొని రూ.లక్షలు గడిస్తున్నారు. అక్రమార్కులు ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో మట్టిని పెద్దఎత్తున తరలిస్తున్న చర్యలు లేకపోవడంపై స్థానికంగా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రత్తిపాడు నియోజకవర్గం, వట్టిచెరుకూరు మండలంలోని పల్లపాడు, కొర్నెపాడు, లేమల్లెపాడు, ముట్లూరు, కోవెలమూడి, తదితర గ్రామాలలోని చెరువుల్లో నీరు ఉండడంతో అక్రమార్కుల చూపు డ్రైనేజ్ కాలువలు, వాగు పోరంబోకు స్థలాలపై పడి నిలువునా మట్టి మింగేస్తున్నారు. గతంలో రాత్రి వేళల్లో మట్టిని చాటుమాటుగా తరలించేవారు. ప్రస్తుతం అక్రమార్కులు పట్టపగలే బహిరంగంగా పనికానిచ్చేస్తున్నారు. వందల ట్రాక్టర్లతో మట్టిని



తరలించి ఒక్కొక్క ట్రాక్టర్ కు దూరాన్ని బట్టి రూ.1300 నుంచి రూ.1500 వరకు విక్రయిస్తున్నారు. ఈ రకంగా రోజుకు లక్షల రూపాయలు అక్రమార్జన చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. ప్రభుత్వానికి ఒక్కపైసా రుసుము చెల్లించకుండానే తమపని కానిచ్చుకుంటున్నారు. ..మండలంలోని పల్లపాడు గ్రామానికి చెందిన ఓవ్యక్తి మిర్చి వ్యాపారం చేయడానికి గ్రామానికి చెందిన కొంతమంది సన్నకారు రైతుల వద్ద నుండి పెద్ద మొత్తంలో డబ్బులు అప్పుగా తీసుకున్నాడు. ఈ డబ్బులతో వ్యాపారం చేస్తూ ఉన్న క్రమంలో అప్పులు సవిచూ డాల్సి వచ్చిందని బాధితుడు తెలుపుతున్నాడు. అప్పులు ఇచ్చినవారు బాధితుడిపై ఒత్తిడి తేవడంతో, అప్పుల వారికి సరైన సమాధానం చెప్పలేక తన పేరుతో ఉన్న ఐదు ఎకరాల వ్యవసాయ భూమిని ఐపిపెట్టి కోర్టులో పిటీషన్ దాఖలు చేసుకున్నాడు. దీనితో అప్పులు ఇచ్చిన వారు అగ్గిమీద గుగ్గిలమై మాకు సరైన సమాధానం చెప్పకుండా, డబ్బులు ఇవ్వకుండా, కోర్టులో పిటిషన్ వేయటం ఎంతవరకు సమంజసమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనితో డబ్బులు ఇచ్చిన రైతులు మొత్తం ఏకమై, రుణదాత వ్యవసాయ భూమిలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా రాత్రి పగళ్ళు మట్టి తోలకాలు జరుపుతున్నారు. ఈ భూమిలో అక్రమార్కులు ఎక్కువ లోతు పెట్టి మట్టిని తీస్తున్నారు.

**సిఫార్సులతో వెనక్కి తగ్గుతున్న అధికారులు..**

ఈ గ్రామంలో అక్రమ మైనింగ్ జోరు ఏమాత్రం తగ్గలేదు. అధికారుల అడ్డగింతలు, నేతల సిఫార్సులతో అక్రమార్కులకు మూడు పువ్వులు ఆరు కాయలు చందంగా తయారయింది. అక్రమ మట్టి దందా వ్యవహారం భారీగా జరుగుతుంది. ఈ అక్రమ మైనింగ్ ను అంటుకునేవారు, అడ్డు చెప్పేవారు లేకపోవడంతో అక్రమార్కులు ఆడిందే ఆట పాడిందే పాటగా పరిస్థితి మారింది. ఇంతభారీ అక్రమ మైనింగ్ జరుగుతున్నగాని రెవిన్యూ, పోలీస్, జల వనరులు, మైనింగ్, తదితర శాఖల అధికారులు మామూళ్ల మత్తులో ఉండి, కబోధి పక్షుల్లా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వోల్టా చట్ట ప్రకారం సంబంధిత శాఖల నుండి అనుమతులు తీసుకోకుండానే వాగులు, చెరువులు, ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో మట్టిని బేస్మెంట్లకు, ఇతర అవసరాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

## పొదుపు చేసుకోండి..అధిక రుణాలు పొందండి

కొల్లిపర,జూన్ 30 ప్రభాతవార్త: డ్వాక్రా మహిళలు పొదుపు ఎక్కువగా చేసుకుంటే అధికంగా రుణాలు పొందే అవకాశం ఉందని డిఆర్డిఏ ఏపిఎం రమాదేవి అన్నారు.మంగళవారం మండల కేంద్రం కొల్లిపర స్త్రీశక్తి భవనంలో పొదుపు సంఘాల సభ్యులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించి..రికార్డులు పరిశీలించి..రుణాలపై తగిన సూచనలు ఇచ్చారు.ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ బ్యాంకు నుండి తీసుకున్న రుణాలను అభివృద్ధి



కార్యక్రమాలకు మాత్రమే వినియోగించుకోవాలన్నారు.బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను నిర్ణీత వ్యవధిలో చెల్లించాలన్నారు.పుస్తక నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు.నెల..నెలా డ్వాక్రా మహిళలు సమావేశం ఏర్పాటు చేసుకోవటం మంచిదన్నారు.సమావేశంలో సీసీలు బుజ్జిబాబు, విజయకుమార్,ప్రమీలాదేవి,టి.మధు,ఎమ్ ఎస్ ఏ సీతామహాలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన విద్యనందించండి..విద్యార్థుల పురోగతిని తెలపండి

కొల్లిపర,జూన్ 30 ప్రభాతవార్త: మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని ఎంఈవో ఝాన్సీలత పేర్కొన్నారు.మంగళవారం మండల పరిధిలోని అత్తోట ప్రాథమిక,ప్రాథమికోన్నత పాఠశాలలను ఆయన తనిఖీ నిర్వహించి రికార్డులు..హాజరు పట్టీలు పరిశీలించి



ఉపాధ్యాయులకు తగిన సూచనలు..సలహాలు ఇచ్చారు.ఈ సందర్భంగా ఝాన్సీలత మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యనందిస్తూ..విద్యార్థుల యొక్క పురోగతిని తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు.

## సదుపాయాలు కల్పిస్తాం..ఉపాధి పనులకు రండి



కొల్లిపర,జూన్ 30 ప్రభాతవార్త: ఉపాధి పనులలో మెడికల్ కిట్లు..టెంట్లు వంటి మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేసామని..ఉపాధి పనులకు జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ హాజరుకావాలని ఏపిఓ వెంకయ్య అన్నారు.మంగవారం మండల పరిధిలోని వల్లభాపురం,పిడపర్రు,కొల్లిపర,మున్నంగి గ్రామాలలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ పేదలకు ఉపాధి పనులు కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని కావున ఉపాధి హామీ పనులను సద్వినియోగించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో పీల్డ్ అసిస్టెంటు కోటేశ్వరరావు,వల్లభాపురం బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## కొండపాటూరు విద్యార్థులకు ఆర్టీసీ మాజీ ఉద్యోగల వితరణ

కాకుమాను జూన్ 30 ( ప్రభాత వార్త): మండల పరిధి కొండపాటూరు పాఠశాల విద్యార్థులకు బాపట్లకు చెందిన ఆర్టీసీ రాష్ట్ర మాజీ ఉద్యోగ సంఘ నాయకులు నోటు పుస్తకాలు, పెన్నులు, బిస్కెట్ ప్యాకెట్లు వితరణగా అందజేశారు. ఇదే స్కూల్లో చదువుకుని ఆర్టీసీలో కండెక్టరుగా ఉద్యోగ విరమణ చేసిన తిరుపతిరావుతో వీరంతా సోమవారం బాపట్ల నుంచి కొండపాటూరు వచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానిక మండల విద్యాశాఖ అధికారి కె.ఎఫ్.కెన్నడీ ప్రసంగించారు. కొండపాటూరు స్కూలుకు ఇదే గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు వివిధ రకాలుగా సహాయ, సహకారులు అందజేస్తుండటం గొప్ప విషయమన్నారు. కేఎంసీ హాస్పిటల్ చైర్మన్ కాటూరి సుబ్బారావు హైస్కూలు భవన నిర్మాణానికి ఈపాటికే కోటి రూపాయలు డిపాజిట్ చేశారని, త్వరలో దాని నిర్మాణం పూర్తయితే అన్ని హంగులతో అది



అందుబాటులోకి రానున్నదన్నారు. తన పరిధిలోని కొండపాటూరు పాఠశాల అన్ని విషయాల్లో ముందుందని ప్రశంసించారు. ఈ ఏడాది పదో తరగతికి వచ్చిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు పొందేలా కృషి చేయాలని సూచించారు. ఆర్టీసీ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ ఉద్యోగులకు పించన్లు తక్కువ స్థాయిలో వస్తున్నప్పటికీ విద్యార్థుల చదువులకు తోడ్పాటు అందించడం కోసం తాము వివిధ స్కూళ్లకు ఈవిధంగా వీటిని అందజేస్తూ సహకరిస్తున్నామని చెప్పారు. హైస్కూలు హెడ్మాస్టర్ జూపూడి ప్రకాశరావు మాట్లాడుతూ హైస్కూలుగా అప్ గ్రేడ్ అయిన తమ పాఠశాలలో గత ఏడాది 133 మంది విద్యార్థులు ఉండగా కాటూరి సుబ్బారావు కొత్త భవనం నిర్మించనుండటం, గ్రామంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పర్యటించి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం వల్ల ఆ సంఖ్య ఇప్పటికి 180 కి చేరుకుందని చెప్పారు. అడ్మిషన్లు ఇంకా జరుగుతున్నందున మరి కొందరు చేరనున్నారని తెలిపారు. హైస్కూలు అభివృద్ధి కమిటీ కన్వీనరు టీడీ ప్రసాద్ ప్రసంగిస్తూ తమ పాఠశాలకు అన్ని వనరులు సమకూరుతున్నందున విద్యార్థుల చేరిక గణనీయంగా పెరిగిందని అందుకు కృషి చేసిన ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. రూ. కోటి నిధులు బ్యాంకులో ఉన్నప్పటికీ హైస్కూలు నిర్మాణం కాటూరి సుబ్బారావు ఎప్పుడు మొదలెడతారని ప్రతివారు అడుగుతున్నారని, దీనికి అన్ని అనుమతులు లభించిన విషయం కాటూరి సుబ్బారావు దృష్టిలో ఉన్నందున త్వరలో మొదలెడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గన్నపనేని రాఘవరావు, బాబురావు ఆర్టీసీ రాష్ట్ర ఉద్యోగుల సంఘ నాయకులు పీవీకే రామారావు, వై.శ్రీనివాసరావు, కె.తిరుపతి రావు, పి.ఆర్.కోటేశ్వరరావు, బి.వి.రమణ, పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మీవో కెన్నడీ విద్యార్థులతో కలిసి భోంచేసి ఆహార పదార్థాలు అన్నీ బాగున్నాయన్నారు. తమ పాఠశాలకు వితరణ అందజేసిన వారందరని ప్రధానోపాధ్యాయుడు ప్రకాశరావు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి ధన్యవాదాలు తెలిపారు.

## అంగన్వాడీ కార్యకర్త అన్నమ్మకు సన్మానం..
## 27 ఏళ్ల సేవలకు ఘన వీడ్కోలు..

కాకుమాను, జూన్ 30, ప్రభాతవార్త : ప్రతిపాడు నియోజకవర్గం, కాకుమాను మండలం, పాండ్రపాడు ఐసిడిఎస్ సెక్టార్లోని కొల్లిమర్ల గ్రామం అంగనవాడి కేంద్రంలో అంగన్వాడి కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్న కంచర్ల అన్నమ్మ 27సంవత్సరాల పాటు సేవలందించి, పదవీ విరమణ పొందిన సందర్భంగా మంగళవారం తోటి అంగన్వాడీ కార్యకర్తలు ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సెక్టార్ సూపర్వైజర్ ఎం.ప్రేమలత హాజరై మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు ఎక్కడ విధులు నిర్వహిస్తున్న గాని పదవీ విరమణ అనేది సర్వసాధారణం అన్నారు.



కొల్లిమర్ల గ్రామవాసి, సీనియర్ అంగనవాడి ఉపాధ్యాయిని కంచర్ల అన్నమ్మ అంగన్వాడి ఉపాధ్యాయురాలుగా 27 సంవత్సరాలు విధులు నిర్వహించి పదవి విరమణతో ఆమె సేవలను కొనియాడారు.విద్యా సేవలో తరించిన ఆమెకు అంగన్వాడి కేంద్రంలో తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఘనంగా వీడ్కోలుపలికి సన్మానించడం అదృష్టంగా భావించాలన్నారు. చిన్నారుల విద్యాభివృద్ధి, ఆరోగ్య పరిరక్షణతో పాటు అంగన్వాడీ కార్యకర్తల సంక్షేమం కోసం అన్నమ్మ విశేష కృషి చేశారని ప్రశంసించారు. ఆమె సేవలను గుర్తు చేసుకుంటూ అభినందనలు తెలిపారు. అనంతరం అన్నమ్మను సన్మాన పత్రం, శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈమె సర్వీస్ లో ఎంతోమంది విద్యార్థులు ఇంజనీర్లు, డాక్టర్లు, ఉపాధ్యాయులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినట్లు వివరించారు. కార్యక్రమంలో అంగనవాడి కార్యకర్తలు ఏ. వాసవి, ఇ.వెంకట రమణ, కె.సుజాత, ఎం.వెంకాయమ్మ, డి. విజయ, ఏ.శోభారాణి, కె. సుగుణమ్మ, శ్రీదేవి, కె.మల్లేశ్వరి, ఎస్కే. లావణ్య, టి.శ్రావణి, తదితర కార్యకర్తలు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మండలానికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు రూ. 2.93 కోట్లు విడుదల..

ప్రత్తిపాడు(వట్టిచెరుకూరు), జూన్ 30, ప్రభాతవార్త: జూలై నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీకి మండలానికి రూ.2.93 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని ఎంపీడీవో ఎలీషాబాబు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ..మండల వ్యాప్తంగా మొత్తం 6754 మంది లబ్ధిదారులకు నేటి ఉదయం నుంచే లబ్ధిదారుల ఇళ్లవద్దకే వెళ్లి నేరుగా పెన్షన్లను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ప్రతి నెలా ఒకటో తేదీనే పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని పేర్కొన్నారు. వృద్ధాప్య పెన్షన్ దారులు 3818 మంది, వితంతువులు 1761మంది, అంగవైకల్యం కలిగిన వారు 598 మంది, ఒంటరి మహిళలు 291 మంది, 19 మంది డప్పు కళాకారులు, 163 మంది అభయహస్తం లబ్ధిదారులు,



13 మంది ప్రభుత్వ ప్రైవేటు సికె డి యు, హిమోఫిలియా వ్యాధిగ్రస్తులు నలుగురు, కిడ్నీ, లివర్, గుండె మార్పిడి వ్యాధిగ్రస్తులు 7, 12 మంది పక్షవాతం వ్యాధిగ్రస్తులు, 20 మంది యాక్సిడెంట్ రోగులు, 15 మంది కుష్టు వ్యాధిగ్రస్తులు, తదితరులకు నేడు ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లను అందించేందుకు సిద్ధం చేసి, సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు ఆయన వివరించారు.

## ఘనంగా అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవం

తాడేపల్లి, జూన్ 30, ప్రభాతవార్త, కే ఎల్ యూనివర్సిటీ లో మంగళవారం నాడు వేల్యూ ఎడ్యుకేషన్ సెల్, ఎఫ్ ఇడి ఆధ్వర్యంలో ఎన్ సిసి, ఉమెన్ డెవలెప్ మెంట్ సెల్, సిఇఎ విభాగాల సహకారంతో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా హాజరైన గుంటూరు జిల్లా అడిషనల్ ఎస్పి జి. వి.రమణ మూర్తి ముఖ్య అతిగా హాజరయి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను



ఉద్దేశించి మాట్లాడుతూ . డ్రగ్స్ నేటి యువత భవిష్యత్ ను కభళించి వేస్తుంది అని.. వీటి బారిన పడిన జీవితాలు... కష్టాల బాట పడతాయని తెలియజేసారు. నేటి యువత దేశాభి వృద్ధికి.. అత్యంత అవసరమని.. వారు దుర్యసనాలకు, ముఖ్యం గా మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని.. హితవు పలికారు. మాదకద్రవ్యాలను వినియోగించే వారితో స్నేహం అత్యంత ప్రమాదకరమని.. అటువంటి వారి సమాచారాన్ని దగ్గర లో ఉన్న పోలీస్ స్టేషన్ కు తెలియ జేయాలని. ఈ కార్యక్రమంలో వర్శిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి. పార్థసారధి వర్మ, ప్రో వైస్ చాన్సులర్లు డాక్టర్ ఎన్. వెంకట్ రామ్, డాక్టర్ కె. రాజశేఖర్ రావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇంచార్జి డీన్ డాక్టర్ కెఆర్ ఎస్. ప్రసాద్, డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, తాడేపల్లి సిఐ వీరేంద్రబాబు, అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీధర్, ఎఫ్ ఇడి ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణా రెడ్డి, ఉమెన్ డెవలెప్ మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ కె. రూత్ రమ్య, ఎన్ సిసి ఆఫీసర్లు లెఫ్టినెంట్ వి.మోనిక, డాక్టర్ దారా విక్రమ్, వాల్యూ ఎడ్యుకేషన్ సెల్ విభాగాధిపతి డాక్టర్ బి.పవన్ కుమార్, సిఇఎ కో ఆర్డినేటర్ డాక్టర్. వెంకటేశ్వర్లు, ఎన్ ఎస్ఎస్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ శ్రీకాంత్ రెడ్డి, హాబీ క్లబ్ ప్రొఫెసర్ ఇంచార్జ్ ఆర్. సుభాకర్ రాజు, ఈవెంట్ కోఆర్డినేటర్ విజయ రత్నం తదితరులు పాల్గొన్నారు.

1-7Pg5_1-7Pg5.qxd 30/Jun/26 10:29 PM Page 1



# భారత్ షేరునే కొనుగోలుచేస్తా

## అమెరికా సెనేటర్ స్టీవ్ డైన్స్ ప్రశంసలు

**వాషింగ్టన్,జూన్ 30:** దేశాలను స్టాక్ మార్కెట్లో షేర్లలా చూస్తే, తాను కచ్చితంగా భారత్ షేరునే కొనుగోలు చేస్తానంటూ అమెరికాకు చెందిన రిపబ్లికన్ సెనేటర్ స్టీవ్ డైన్స్ భారత్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో భారత్ వేగంగా ఎదుగుతోందని, అమెరికాతో ఆ దేశ సంబంధాలు అత్యంత కీలక మని ఆయన అభిప్రాయపడ్డారు. వాషింగ్టన్ డీసీలో జరుగుతున్న యూఎస్ఇండియా స్ట్రాటజిక్ పార్ట్ నర్‌షిప్ ఫోరమ్ (యూఎస్ఐఎస్‌పీఎఫ్) సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్య క్షుడు డొనాల్డ్ ట్రంప్ పార్టీ అయిన రిపబ్లికన్ పార్టీ సెనేట్ ఎన్నికల ప్రచార విభాగానికి స్టీవ్ డైన్స్ అధిపతిగా ఉన్నారు. దీంతో ఆయన ట్రంప్ పార్టీ నాయకత్వానికి అత్యంత సన్నిహితుడిగా, రాజకీ యంగా కీలక వ్యక్తిగా గుర్తింపు పొందారు. భారత్ ఆర్థిక వృద్ధిని ఉటంకిస్తూ ఆయన తన ప్రశంసలకు కారణాలను వివరించారు. జిడిపి దృష్ట్యా చూస్తే ప్రపంచంలోని టాప్ 20 ఆర్థిక వ్యవస్థలలో భారత్ ఐదో స్థానంలో ఉంది. త్వరలోనే జపాన్‌ను అధిగమించి నాలుగో స్థానానికి చేరుకోనుంది. ఈ టాప్ 20 దేశాలలో ఈ ఏడాది, వచ్చే యేడాది కూడా అత్యధిక జిడిపి వృద్ధి రేటును నమోదు చేయబోయేది భారతే. అందుకే భారత్ ఎదుగుదల స్పష్టంగా కనిపిస్తోందని డైన్స్ పేర్కొన్నారు.



ఇదే సదస్సులో మరో సందర్భంలో మాట్లాడిన డెమోక్రాటిక్ పార్టీకి చెందిన భారత సంతతి నేత రో ఖన్నా మాత్రం ఇందుకు పూర్తి భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గత 30 యేళ్లలో భారత్ అమెరికా సంబంధాలు అత్యంత కనిష్ఠ స్థాయికి పడిపోయాయని ఆయన ఆరోపించారు. ఇరాన్‌తో యుద్ధానికి దిగాలన్న ట్రంప్ విధానాలు పూర్తిగా విధ్వంసకరమైనవి. ఆ ప్రభావంతో భారత్‌లో గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయి. నమ్మకం లేకపోతే భారత విదేశాంగ మంత్రి జై శంకర్‌ను అడగండని ఉటంకిస్తూ రో ఖన్నా అన్నారు. ఒకవైపు డైన్స్ భారత్‌ను నమ్మకమైన భాగస్వామి అని, ప్రధాని నరేంద్ర మోడీతో సంబంధాలను బలో పేతం చేయడానికి ట్రంప్ కట్టుబడి ఉన్నారని చెబుతున్నప్పటికీ, ట్రంప్ ప్రభుత్వ చర్యలు మాత్రం అందుకు విరుద్ధంగా కనిపిస్తున్నాయి. గత ఏడాది భారత్ నుంచి దిగుమతయ్యే వస్తువులపై ట్రంప్ ప్రభుత్వం 50 శాతం వరకు సుంకాలు విధించింది. ఈ సుంకాల వల్ల 2025 ఆర్థిక సంవత్సరంలో భారత జిఇపి వృద్ధికి ఒక శాతం వరకు గండి పడవచ్చని ఆర్థికవేత్తలు అప్పట్లో అంచనా వేశారు. ప్రస్తుతం ఈ సుంకాలు 18 శాతానికి తగ్గినా, ఇతర ఆసియా దేశాలతో పోలిస్తే ఇది ఇంకా ఎక్కువే. అమెరికాకు భారతీయ విద్యార్థులు, నైపుణ్యం ఉన్న ఉద్యోగులు అవసరమని డైన్స్ చెబుతున్నప్పటికీ, ట్రంప్ ప్రభుత్వం మాత్రం విద్యార్థి వీసాలు, హెచ్1బీ వర్క్ పర్మిట్లపై కఠిన నిబంధనలు విధించింది. ఫారిన్ స్టూడెంట్స్ కోసం ఉద్దేశించిన ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్‌ను తొలగించడం, హెచ్1బీ వీసా దరఖాస్తు రుసుమును ఒక లక్ష డాలర్లకు పెంచడం వంటి చర్యలు భారత విద్యార్థులు, నిపుణులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.

భారతీయ అమెరికన్లపై పెరుగుతున్న ద్వేషపూరిత దాడుల గురించి ప్రశ్నించగా, ద్వేషం ఏ రూపంలో ఉన్నా దానిని ఎదుర్కోవాలి. ఇక్కడ భారతీయ అమెరికన్లు చాలా సురక్షితంగానే ఉన్నారని డైన్స్ సమాధానమిచ్చారు. ఎఫ్‌బీఐ డేటాను విశ్లేషిస్తూ ఈ యేడాది ఏప్రిల్‌లో 2015 నుంచి 2025 మధ్య ఆసియన్లపై ద్వేషపూరిత నేరాలు 195 శాతం పెరిగాయని తేలింది.



## 'సర్'పై విపక్షాల అభ్యంతరం

### సిజెఐకి 23 రాజకీయ పార్టీల లేఖ

### ఎన్నికల సంఘం తీరుపైనా ప్రస్తావన

**న్యూఢిల్లీ, జూన్ 30:** భారత ఎన్నికల సంఘం చేపట్టిన 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (ఎస్ఐఆర్) ప్రక్రియ, ఎన్నికల ప్రక్రియ విపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ అంశాలపై భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ సూర్యకాంత్‌కు 23 రాజకీయ పార్టీలు, ఒక స్వతంత్ర ఎంపి ఉమ్మడిగా లేఖ రాశాయి. ఈ విషయాన్ని మంగళవారం కాంగ్రెస్ ఎంపి జైరాం రమేష్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. "జూన్ 8న జరిగిన 'ఇండియా' కూటమి సమావేశానికి 21 రాజకీయ పార్టీలు, ఒక స్వతంత్ర అభ్యర్థి హాజరయ్యారు. ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ ప్రక్రియ, ఇతర ఎన్నికల సంబంధిత అంశాలపై భారత ప్రధాన న్యాయమూర్తికి ఉమ్మడి లేఖ రాయాలని ఆ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం మరో రెండు పార్టీలు మద్దతు తెలపడంతో మొత్తం 23 పార్టీలు ఈ లేఖపై సంతకం చేశాయి. ప్రతిపక్ష పార్టీలు సంఘీభావం, ఐక్యత, ప్రతిఘటన అనే సూత్రంపై దృఢంగా నిలిచి ఉన్నాయి. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ పరిరక్షణ, ఎన్నికల పారదర్శకత కోసం కలిసి పోరాడతామని స్పష్టం చేశారు" అని జైరాం రమేష్ పేర్కొన్నారు.

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వల్ల కోట్లాది మంది ఓటు హక్కులు ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఇండియా కూటమి ఆందోళన వ్యక్తం చేసింది. సరైన ధ్రువీకరణ లేకుండా పేర్లు తొలగించే పరిస్థితులు తలెత్తితే ప్రజాస్వామ్యానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని పేర్కొంది. అలాగే ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, స్వతంత్రత కొనసాగాలని, ఎన్నికల సంఘం తీసుకునే చర్యలు ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీయకుండా ఉండాలని లేఖలో ప్రస్తావించినట్లు సమాచారం.

### ఆ అగ్నిపర్వతం నుంచి 18.9 కోట్ల విలువైన

## బంగారం ధూళి గాలిలోకి..

**రాస్ ఐలాండ్, జూన్ 30:** అంటార్కిటిక్‌లోని ఎరెబస్ అగ్నిపర్వతం.. యేటా రూ. 18.9 కోట్ల విలువైన బంగారం ధూళి గాల్లోకి విరజిమ్ముతున్నట్లు జియోఫి జికల్ పరిశోధనలు వెల్లడించాయి. 1991 నాటి సర్వే ప్రకారం.. రాస్ ద్వీపం సమీపంలో ఉన్న ఎరెబస్ అగ్నిపర్వతం రోజుకు 80 గ్రాముల బంగారు ధూళి గాల్లోకి విరజిమ్ముతోంది. ఈఅగ్నిపర్వత లావా నుంచి విడుదలయ్యే వాయువులుస్వచ్ఛమైన బంగారు సూక్ష్మకణాలను మోసుకెళ్తున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు.



అవి అంటార్కిటిక్ మంచుపై స్థిరపడటా నికి ముందు 1,000 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తా యని తెలిపారు. ఎలక్ట్రాన్ మైక్రోస్కోప్‌ను ఉయోగించి.. 60 మైక్రోమీటర్ల వరకు వ్యాసం కలిగి ఉంటే ఈ బంగారు స్ఫటికాలను గుర్తించినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. లావాతోపాటు స్వచ్ఛమైన బంగారు సూక్ష్మ స్ఫటికాలను వాతావరణంలోకి ఈ అగ్నిపర్వతం విడుదల చేస్తోందని చెప్పారు. అగ్నిపర్వత వాయువులలో బంగారం దొరకడం పూర్తిగా అసాధారణ విషయమేమీ కాదని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. హవాయిలోని కిలావుయా, ఇటలీలోని మౌంట్ ఎట్నా, అలాస్కాలోని ఆగస్టీన్, మెక్సికో లోని ఎల్ చిచోన్ వంటి అగ్నిపర్వతాల వద్ద కూడా స్వల్ప మొత్తంలో బంగారాన్ని గుర్తించామన్నారు.



## కొత్త ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేథ్

### - బాధ్యతలు స్వీకరణ

**న్యూఢిల్లీ, జూన్ 30:** దేశానికి నాలుగు దశాబ్దాలకు పైగా విశిష్ట సేవలు అందించి పదవీ విరమణ చేసిన జనరల్ ఉపేంద్ర ద్వివేది స్థానంలో జనరల్ ధీరజ్ సేథ్ ఈ రోజు 31వ ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు. జనరల్ సేథ్ పుణెలోని ఖడక్‌వాస్లాలో ఉన్న జాతీయ రక్షణ అకాడమీ పూర్వ విద్యార్థి. ఆయన డిసెంబర్ 1986లో ఆర్మర్డ్ కార్ప్స్‌లో నియమితులయ్యారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సాగిన తన విశిష్ట సైనిక వృత్తిలో, ఆయన కార్యాచరణ, వ్యూహాత్మక, సామర్థ్య అభివృద్ధి, సంస్థాగత రంగాలలో విస్తృతమైన అనుభవాన్ని సంపాదించారు. భారత సైన్యం పోరాట సామర్థ్యానికి, దీర్ఘకాలిక పరివర్త నకు ఆయన గణనీయంగా దోహదపడ్డారు. ఆయన కమాండ్ బాధ్యతలలో ఎడారి సెక్టార్‌లోని ఆర్మర్డ్ రెజిమెంట్, వెస్ట్రన్ థియేటర్‌లోని ఆర్మర్డ్ బ్రిగేడ్, జమ్మూ కాశ్మీర్‌లోని కౌంటర్ఇన్సర్జెన్సీ ఫోర్స్ ఉన్నాయి. లెఫ్టినెంట్ జనరల్‌గా, ఆయన భారత సైన్యంలోని ప్రముఖ స్ట్రైక్ ఫార్మేషన్‌లలో ఒకటైన సుదర్శన్ చక్ర కార్ప్స్‌కు కమాండ్‌గా వ్యవహరించారు. తదనంతరం ఆయన ఢిల్లీ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్‌గా పనిచేస్తూ, కీలకమైన జాతీయ, అంతర్జాతీయ సైనిక కార్యకలాపాలు, ఉత్సవ బాధ్యతలను పర్యవేక్షించారు.

## సీషెల్స్ పాలకులకు ప్రధానిమోడీ అపురూప కానుకలు



**విక్టోరియా,జూన్ 30:** ప్రధాని నరేంద్ర మోడీ తన మూడు రోజుల సీషెల్స్ పర్యటనలో ఆ దేశ ఉన్నత స్థాయి నాయకులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. భారత గొప్ప సాంస్కృతిక వారసత్వం, కళా నైపుణ్యానికి అద్దం పట్టేలా ఈ కానుకలను ఎంపిక చేశారు. రెండు దేశాల మధ్య బలమైన స్నేహ బంధాన్ని, భాగస్వామ్య విలువలను ఈ బహుమతులు ప్రతిబింబిస్తున్నాయి. సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినియేకు ప్రధాని మోడీ మురాదాబాదీ ఇత్తడి తాబేలును బహూకరించారు. ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్‌కు చెందిన ప్రసిద్ధ ఇత్తడి హస్తకళకు ఇది ఒక అద్భుతమైన ఉదాహరణ. అక్కడి నిపుణులైన కళాకారులు చేతితో దీనిని ఎంతో నైపుణ్యంగా రూపొందించారు. జ్ఞానం, స్థిరత్వం, దీర్ఘాయుష్షుకు తాబేలు ప్రతీక. ప్రపంచంలోనే అతిపెద్ద, ఎక్కువ కాలం జీవించే తాబేళ్లలో ఒకటైన అల్డాబ్రా జెయింట్ టార్టాయిస్‌కు సీషెల్స్ ప్రసిద్ధి. ఈ నేపథ్యంలో ఈ కానుకకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. సీషెల్స్ ప్రథమ మహిళ వెరోనిక్ హెర్మినియేకు బిద్రీవేర్ బాక్స్, మహేశ్వరి సిల్క్ శాలువాను ప్రధాని అందజేశారు. కర్ణాటకలోని బీదర్‌కు చెందిన బిద్రీవేర్ హస్తకళ చాలా ప్రత్యేకమైనది. నల్లటి లోహపు ఉపరితలంపై వెండి తీగతో చేసే సున్నితమైన నగిషీ పనితనం ఇందులో కనిపిస్తుంది. మధ్యప్రదేశ్‌లోని మహేశ్వర్‌కు చెందిన మహేశ్వరి సిల్క్ శాలువా తేలికైన బరువు, నాణ్యమైన పట్టు, కాటన్ నూలుతో చేసిన నేతకు ప్రసిద్ధి. సీషెల్స్ ఉపాధ్యక్షుడు సెబాస్టియన్ పిళ్లేకు సిక్కింకు చెందిన ఆర్కిడ్ పెయింటింగ్‌ను, ఆయన అర్ధాంగి లీనా పిళ్లేకు కంచివరం పట్టు నెమలిపై సీషెల్స్ జాతీయ పుష్పం ఆర్కిడ్‌ను అందంగా చిత్రించారు. ఇది ప్రకృతి పట్ల, పర్యావరణ పరిరక్షణ పట్ల రెండు దేశాలకు ఉన్న నిబద్ధతకు నిదర్శనం. తమిళనాడులోని కాంచీపురానికి చెందిన కంచి పట్టు తన నాణ్యత, మన్నిక, బంగారు జరీ పనితనానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. సీషెల్స్ నేషనల్ అసెంబ్లీ స్పీకర్ అజారెల్ ఎర్నెస్టాకు తమిళనాడులోని నీలగిరి కొండల్లో నివసించే తోడా గిరిజన తెగకు చెందిన తోడా ఎంబ్రాయిడరీ శాలువాను మోదీ బహూకరించారు. తెలుపు రంగు కాటన్ వస్త్రంపై ఎరుపు, నలుపు రంగు దారాలతో రేఖాగణిత ఆకృతులలో చేసే ఈ ఎంబ్రాయిడరీ ఆ తెగ కళాత్మక వారసత్వానికి చిహ్నం. ఈ బహుమతుల ద్వారా రెండు దేశాల మధ్య సాంస్కృతిక బంధాన్ని, స్నేహాన్ని మరింత పటిష్టం చేసే ప్రయత్నం చేశారు.

## 'మోడీ నిద్ర లేచే ఉంటారులే..'

### ఉదయం ఆరింటికే ఫోన్ చేయాలనుకున్న ట్రంప్




**వాషింగ్టన్, జూన్ 30:** భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాలకు ఇరు దేశాధినేతల స్నేహం మూలస్తంభం అని యుఎస్ రాయబారి సెర్గియోగోర్ అన్నారు. వాషింగ్టన్ వేదికగా ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సు (యుఎస్ఐఎస్‌పిఎఫ్)లో పాల్గొన్న ఆయన.. మోడీ-ట్రంప్ బంధాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన ఓ సంఘటనను గుర్తు చేసుకున్న ఆయన.. ప్రధాని మోడీకి ఓసారి ట్రంప్ ఉదయం ఆరు గంటలకే ఫోన్ చేయాలనుకున్నట్లు తెలిపారు. 'రెండు నెలల కిందట మియామిలో యుఎఫ్‌సి ఈవెంట్ జరిగింది. ఆ సమయంలో నేను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఉన్నాను. వేదిక పక్కన మేం మాట్లాడుకుంటూ ఉండగా.. 'మోడీకి కాల్ చేద్దాం' అని ట్రంప్ అన్నారు. 'ఇప్పుడు భారత్‌లో సమయం ఉదయం 6 గంటలు' అని నేను చెప్పా. దానికి అధ్యక్షుడు బదులిస్తూ.. 'ఏం ఫర్వాలేదు. ఆయన (మోడీ) నిద్ర లేచే ఉంటారు. ఎక్కువ సేపు పడుకోరు. ఆయనకు నేనంటే ఇష్టం' అని అన్నారు. ఆ తర్వాత ట్రంప్ వేరే బాధ్యతల్లో ఉండటంతో మోడీతో కాల్‌ను మరుసటి రోజుకు షెడ్యూల్ చేశారు. అయితే, ఈ సంఘటన వారిద్దరి మధ్య మైత్రిని చాటి చెబుతుంది. ఎవరితోనైనా స్నేహం చేస్తే.. ప్రతిదాన్ని షెడ్యూల్ చేసుకోవాల్సిన అవసరం లేదని ట్రంప్‌ను చూశాక నాకనిపించింది. మోడీ ఆయనకు గొప్ప స్నేహితుడు' అని సెర్గియో గోర్ వెల్లడించారు.

**తుది దశకు ట్రేడ్ డీల్..**

ఇక, రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం గురించి అమెరికా రాయబారి ప్రస్తావిస్తూ.. 'ట్రేడ్ డీల్‌పై తుది దశకు చేరుకున్నాం. చాలా అంశాల్లో ఏకాభిప్రాయం కుదిరింది. కేవలం ఒకటి లేదా రెండు శాతం ఉత్పత్తులపై అంగీకారానికి రావాల్సి ఉంది. అతి త్వరలోనే ఈ ఒప్పందంపై ప్రకటన వస్తుంది' అని వెల్లడించారు. ఈ సందర్భంగా ట్రంప్ భారత పర్యటన గురించి సెర్గియో గోర్ మాట్లాడారు. భారత్‌లో పర్యటించేందుకు అమెరికా అధ్యక్షుడు ఎదురుచూస్తున్నారని, మధ్యంతర ఎన్నికలకు ముందే ఈ పర్యటన ఉండొచ్చని తెలిపారు.



## సింధు జలాలు వదలకుంటే భారత్ అంతుచూస్తాం

### పాకిస్థాన్ మంత్రి ప్రేలాపనలు

**కరాచి,జూన్ 30:** పాకిస్తాన్‌కు సింధు నది నీళ్ల ఇవ్వకూడదని భారత్ తీసుకున్న నిర్ణయం పాకిస్థాన్‌ను భారీ దెబ్బకొట్టింది. భారత సరిహద్దు లోని పాక్ ప్రాంతాలు తీవ్ర నీటి కొరతను ఎదు ర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో భారత్‌ను పాకిస్థాన్ బ్రతిమిలాడాల్సింది పోయి బెదిరింపులకు దిగుతోంది. సింధు నదీజలాలు ఇవ్వకుంటే భారత్ అంతుచూస్తామంటూ హెచ్చరిస్తోంది. తాజాగా, పాకిస్థాన్ వాతావరణ శాఖ మంత్రి ముసాదిక్ మాలిక్ కూడా భారత్‌ను బెదిరించాడు. సింధు నదీ జలాలు పాకిస్థాన్ నీళ్ల అంటూ చెప్పాడు. తమ నీళ్లను ఎవరైనా వాడుకుంటే వారి చేతులు నరికేసా మంటూ పరోక్షంగా భారత్‌ను హెచ్చరించాడు. పాకిస్థాన్ సమాచార శాఖ మంత్రి అతౌల్లా తరార్ మాట్లాడుతూ సింధు నదీ జలాలను ఒక ట్యాప్ ద్వారా మన ప్రధానమంత్రి కంట్రోల్ చేస్తున్నారు అంటూ విమర్శించాడు.పాకిస్థాన్‌లోకి ఒక్క చుక్క నీళ్ల కూడా రాకుండా అడ్డుకుంటున్నారన్నాడు. ఇలా ఏకపక్షంగా ఒక దేశం నదీ జలాల ఒప్పం దాన్ని రద్దు చేయడం తగదంటూ చెప్పుకొచ్చాడు. సింధు నదికి సంబంధించిన జలాల విషయంలో ఇండియా, పాక్ మధ్య దశాబ్దాలుగా ఒప్పందం ఉంది. అయితే, గత ఏడాది పహల్గాంలో ఉగ్రదాడుల తర్వాత ఈ ఒప్పందాన్ని ఇండియా రద్దు చేసింది. దీంతో పాకిస్థాన్‌కు సింధు నదీ జలాల పంపిణీని భారత్ నిలిపివేసింది.

## పెట్రోల్‌లో ఇథనాల్ కలపడం ఒక ప్రయోగం

### వచ్చే యేడాది నాటికి ఫలితాలు



**న్యూఢిల్లీ, జూన్ 30:** దేశంలో పెట్రోల్‌లో 20శాతం ఇథనాల్ కలిపే కార్యక్రమం ఇంకా కొనసాగుతున్న ప్రయోగ దశలోనే ఉందని, ఈ విధానం ప్రభావం వచ్చే యేడాది నాటికి స్పష్టమవుతుందని ప్రభుత్వం మంగళవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఇ20 పెట్రోల్‌కు, వాహనాల యాంత్రిక నష్టానికి సంబంధం ఉందని చెప్పడానికి గట్టి ఆధారాలు లేవని, ఈ విధానం భారతదేశ ఇంధన భద్రతకు, రైతులకు, పర్యావరణానికి మొత్తంగా ప్రయోజనకరంగా ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది. 2025-26 సరఫరా సంవత్సరానికి ఇథనాల్ కేటాయింపులకు సంబంధించి కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్) దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. జూన్ 23న ఇచ్చిన తన ఉత్తర్వులో, టెండర్ ప్రక్రియను ఖరారు చేయడానికి ముందే, తమ ఇథనాల్ కేటాయింపులను పెంచాలని కోరుతూ ఒక డిస్టిలరీ చేసిన అభ్యర్థనను పరిశీలించాలని హైకోర్టు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలను (ఓఎంసిలు) బిపిసిఎల్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లను ఆదేశించింది. పెట్రోల్‌లో 20శాతం ఇథనాల్ మిశ్రమాన్ని సాధించాలన్న ప్రభుత్వ లక్ష్యంపై ఈ ఉత్తర్వు విస్తృత ప్రభావం చూపవచ్చని బిపిసిఎల్ కోర్టుకు తెలిపింది. కేంద్రం తరపున హాజరైన అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి, సరఫరా ఒప్పందాలను ఖరారు చేయడంతో ఇథనాల్ కేటాయింపుల ప్రక్రియ అక్టోబర్ 2025లోనే పూర్తయిందని, వ్యక్తిగత కేటాయింపులను తిరిగి ప్రారంభించడం దేశవ్యాప్త కార్యక్రమానికి అంతరాయం కలిగించవచ్చని హెచ్చరించారు.

## చైనా బిలియనీర్‌కు అమెరికా కోర్టు 30 యేళ్ల జైలుశిక్ష

**న్యూయార్కు,జూన్ 30:** చైనా బిలియనీర్ గువో వెంగుయికి 30 ఏళ్ల జైలుశిక్ష పడింది. అమెరికాలోని మన్‌హటన్ జిల్లా కోర్టు ఆయనకు ఆ శిక్షను విధించింది. చైనాలో ఒకప్పుడు సంపన్న వ్యక్తిగా ఉన్న గువో వెంగుయి కొన్నేళ్ల క్రితం అమెరికాకు పరారీ అయ్యారు. అయితే అమెరికా వేదికగా చైనా కమ్యూనిస్టు పార్టీని ఆయన విమర్శించేవారు. బిలియన్ డాలర్ల స్కామ్‌లో అమెరికా కోర్టు ఆయనకు ఇవాళ శిక్షను ఖరారు చేసింది. ప్రాపర్టీ టైకూన్‌గా పేరున్న గువో వెంగుయి 2017లో చైనాను వీడి అమెరికా వెళ్లారు. అక్కడ కమ్యూనిస్టు పార్టీ విమర్శకుడిగా పేరుగాంచారు. మనీల్యాండరింగ్, ఫ్రాడ్, ముఠా నేరాభియోగాల కింద గువోను అరెస్టు చేశారు. చైనాకు ప్రజాస్వామ్యాన్ని మార్చాలనుకున్న ప్రజలను గువో పీక్కుతిన్నారని న్యూయార్క్ కోర్టు జడ్జీ అనాలిసా తన తీర్పులో పేర్కొన్నారు. చైనీయుల నుంచి ఆన్‌లైన్ ద్వారా డబ్బును దోచుకున్నగువో ఆ సొమ్ముతో సంపన్న జీవితాన్ని గడిపారు. చైనాలో రాజకీయ నేతలు అవినీతికి పాల్పడుతున్నారని భారీ ఆన్‌లైన్ ఉద్యమాన్ని నడిపారు. అమెరికా చేరుకున్న తర్వాత వారి నుంచి భారీ మొత్తంలో సొమ్మును రాబట్టారు. 2018 నుంచి 2023 మధ్య కాలంలో ఇన్వెస్ట్‌మెంట్, క్రిప్టో స్కీమ్‌లతో ప్రజల్ని గువో మోసం చేశారు. అమెరికాలో గువో 50 వేల చదరపు గజాల ఇంటిని నిర్మించుకున్నారు. స్వంత అవసరాల కోసం డబ్బును వాడడంతో గువోపై విమర్శలు వెల్లువెత్తాయి. కానీ తనకు వచ్చిన నిధులను రాజకీయాల కోసం వాడినట్లు ఆయన చెబుతున్నారు. చైనాను విమర్శించే అమెరికా నేతలతో గువో చేతులు కలిపారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు గతంలో సలహాదారుడిగా చేసిన స్టీవ్ బానన్‌తో కలిసి ఆన్‌లైన్ వీడియోలు చేశారు. చైనా కమ్యూనిస్టు పార్టీకి వ్యతిరేకంగా ఆ ఇద్దరూ కలిసి పనిచేశారు.

# సంక్షిప్త వార్తలు

## వెనెజులా భూకంపంలో 58వేల భవనాలు ధ్వంసం

**కారకస్, జూన్ 30:** ఇటీవల సంభవించిన జంట భూకంపాలు వెనుజులాకు భారీ ప్రాణ, ఆస్తి నష్టాన్ని మిగిల్చాయి. ఆ దేశంలో 58 వేలకుపైగా భవనాలు ధ్వంస మైనట్లు నాసా అంచనా వేసింది. జూన్ 25న సేకరించిన ఉపగ్రహ డేటా ఆధారంగా ఈ లెక్కలు వెల్లడించింది. క్షేత్రస్థాయిలో విధ్వంస ప్రభావాన్ని అంచనా వేసి, సహాయక బృందానికి మార్గనిర్దేశం చేసేందుకు ఈ శాటిలైట్ డేటా ఉపయోగపడుతుందని నాసా పేర్కొంది. అయితే.. 855 భవనాలు దెబ్బతిన్నాయని, వాటిలో 189 పూర్తిగా ధ్వంసమయ్యాయని వెనుజులా నేషనల్ అసెంబ్లీ ప్రెసిడెంట్ జార్జ్ రోడ్రిగ్జ్ వెల్లడించడం గమనార్హం. ఈ భవన శిథిలాల కింద వేల సంఖ్యలో ప్రజలు చిక్కుకుని ఉంటారనే ఆందోళన నెలకొంది. వారిని బయటకు తీసినా ప్రాణాలతో ఉంటారనే ఆశలు సన్నగిల్లుతున్నాయి. సమాచార లోటును ఈ గ్రూప్‌లు భర్తీ చేస్తున్నాయని నిపుణులు చెప్తున్నారు.



## 37కేజీల బంగారం సీజ్: గువాహటిలో ఒకరి అరెస్టు

**గువాహటి, జూన్ 30:** గువాహటిలో అసోం పోలీసులు చేపట్టిన ఆపరేషన్‌లో దాదాపు రూ.55 కోట్ల విలువైన 37 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అరెస్టు చేసినట్లు మంగళవారం పోలీసులు తెలిపారు. అరెస్టు అయిన వ్యక్తిని మహారాష్ట్రలోని సాంగ్లీ జిల్లాకు చెందిన అక్షయ్ భన్సోరేగా గుర్తించారు. లతాసిల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని, తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని వివరించారు. ఖచ్చితమైన సమాచారం ఆధారంగా చేపట్టిన పోలీసు ఆపరేషన్‌లో ఈ బంగారం స్వాధీనం చేసుకున్నట్లు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (సెంట్రల్) సంభవి మిశ్రా తెలిపారు. స్వాధీనం చేసుకున్న బంగారాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్న పోలీసులు, దర్యాప్తులో భాగంగా దానిని పరిశీలిస్తున్నారు.

## తమిళనాడులో ఇక అన్నీ ఎసి బస్సులే

**చెన్నై,జూన్ 30:** తమిళనాడులో ఇకపై ప్రభుత్వం కొనుగోలు చేసే కొత్త బస్సులన్నీ ఎయిర్ కండిషనింగ్ సౌకర్యంతోనే ఉండనున్నాయి. ఈ మేరకు ముఖ్యమంత్రి విజయ్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి విజయ్ తమిళన్ పార్థిబన్ తెలిపారు. ప్రజలు సౌకర్యంగా ప్రయాణించేలా ప్రజారవాణా వ్యవస్థను ఆధునికీకరించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని పార్థిబన్ తెలిపారు. రాష్ట్రంలోని మారుమూల గ్రామాలకు కూడా బస్సు సౌకర్యం చేరాలన్నది సిఎం లక్ష్యమనిచెప్పారు. ప్రతి కొత్త బస్సులో ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు ఉండాలని, ఎవరికీ ఇబ్బంది లేకుండా ప్రయాణించే అవకాశం కల్పించాలని సూచించినట్లు వెల్లడించారు.




## బెంగాల్‌లో నాఫ్తా పైప్‌లైన్‌లో భారీ పేలుడు

**హల్దియా,జూన్ 30:** పశ్చిమ బెంగాల్‌లో ఉన్న నాఫ్తా పైప్‌లైన్‌లో పేలుడు ఘటన జరిగింది. పుర్బా మిద్నాపూర్ జిల్లాలోని హల్దియా పెట్రోకెమికల్స్ సంస్థకు చెందిన పైప్‌లైన్ అగ్నిప్రమాదానికి గురైనట్లు అదికారులు చెప్పారు. మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. ఆ ప్రమాదంలో 20 మంది గాయపడ్డారు. హల్దియా మున్సిపాల్టీలోని 13వ వార్డులో ఉన్న కొన్ని ఇండ్లు ఆ మంటలకు ధ్వంసం అయ్యాయి. 12 ఫైరింజిన్లు మంటల్ని ఆర్పే ప్రయత్నం చేశాయి. ప్రమాద సమయంలో సమీపంలో ఉన్న కార్మికులకు కాలిన గాయాలు అయ్యాయి. విషమంగా ఉన్న వారిని కోల్‌కతా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం మంటల్ని అదుపులోకి తెచ్చినట్లు పోలీసులు చెప్పారు.

## పాక్ మాజీ ప్రధానికి ఇస్లామాబాద్ హైకోర్టులో ఊరట

**ఇస్లామాబాద్,జూన్ 30:** పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్, ఆయన భార్య బుష్రా బీబీలకు అల్‌ఖాదిర్ ట్రస్ట్ అవినీతి కేసులో ఇస్లామాబాద్ హైకోర్టు నుంచి ఊరట లభించింది. ఈ కేసులో తమకు పడిన శిక్షను సవాలు చేస్తూ వారు దాఖలు చేసిన అప్పీల్‌పై తుది వాదనలు వినిపించడానికి కోర్టు రెండు వారాల గడువు మంజూరు చేసింది. దీంతో ఈ వివాదాస్పద కేసులో ఇమ్రాన్ ఖాన్ భవిష్యత్తు మరికొన్ని రోజుల్లో తేలనుంది. ఇస్లామాబాద్ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఆమిర్ ఫారూఖ్, జస్టిస్ మియాంగుల్ హసన్ ఔరంగజేబ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ అప్పీళ్లపై విచారణ చేపట్టింది.

10 common_10 common.qxd 01-07-2026 AM 01:36 Page 1



## ఎన్‌ఈసీ కళాశాలలో హ్యూమనాయిడ్ రోబో

నరసరావుపేట టౌన్, జూన్ 30 ప్రభాతవార్త :: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, తల్లిదండ్రులు, విద్యార్థులకు మెరుగైన సేవలను




అందించాలని ఎన్‌ఈసీ లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ( ఏఐ) ఆధారిత హ్యూమనాయిడ్ రోబోను తీసుకువచ్చినట్లు యాజమాన్యం తెలిపింది. కళాశాల ఛైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు, వైస్ ఛైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కార్యదర్శి మిట్టపల్లి రమేష్ మంగళవారం వివరాలు తెలియజేశారు. ఈ హ్యూమనాయిడ్ రోబో కళాశాల సమాచార సహాయకునిగా పనిచేస్తూ, తల్లిదండ్రులు, భావి విద్యార్థులు మరియు సందర్శకులు అడిగే ప్రశ్నలకు వెంటనే, ఖచ్చితమైన సమాధానాలను అందిస్తుందని అన్నారు.ఈ ఏఐ హ్యూమనాయిడ్ ను అడిగిన సమగ్ర సమాచారం పొందాలని సూచించారు.

ఎన్‌ఈసీ కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సులు, విభాగాల వివరాలను, అత్యాధునిక ప్రయోగశాలలు, మెరిట్ సదుపాయాలు, ప్రాక్టికల్ తరగతుల సమయాలను, విద్యార్థుల క్రమశిక్షణ కళాశాల నియమ నిబంధనలు, ప్లేస్మెంట్లు, ప్రముఖ సంస్థల నియామకాలను తెలుసుకోవచ్చు. రోబో సందర్శకులు అడిగే ప్రశ్నలకు వెంటనే సమాధానాలు ఇస్తుందని డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. కళాశాల ఛైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు మాట్లాడుతూ, విద్యా రంగంలో కృత్రిమ మేధస్సు వినియోగానికి ప్రాధాన్యతనిస్తూ డిజిటల్ పరివర్తన దిశగా ఎన్‌ఈసీ కళాశాల నిరంతరం వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. కళాశాల సెక్రటరీ మిట్టపల్లి రమేష్ బాబు మాట్లాడుతూ, విద్య, పరిశోధన, పరిపాలన మరియు విద్యార్థి సేవల్లో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ రాష్ట్రంలో ఆదర్శ విద్యాసంస్థగా నిలవాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

## తిరుమల కళాశాలలో ప్రారంభమైన ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం

నరసరావుపేట టౌన్, జూన్ 30ప్రభాతవార్త : నరసరావుపేట లోని తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నెక్స్ట్ జనరేషన్ క్వాంటం టెక్నాలజీస్ అనే అంశంపై ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం ప్రారంభమైంది. ఈ



కార్యక్రమంలో జె ఎన్ టి యు కాకి [illegible] స్పాన్సర్ చేస్తున్న [illegible] డిపార్ట్మెంట్ ఆఫ్ [illegible] ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమంలో వివిధ కళాశాలలకు చెందిన 80 మందికి పైగా అధ్యాపకులు పాల్గొననున్నారని తిరుమల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై. నారాయణ తెలిపారు. అధ్యాపకులు ఎప్పటి కార్యక్రమంలో పాల్గొని తమ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. దానికి కార్యక్రమంలో డాక్టర్ వి. మహేశ్వర రావు, కళాశాల సెక్రటరీ రావెల సత్యనారాయణ, యూనివర్సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ. గంగాధర్, డాక్టర్ టి. జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

నకరికల్లు, జూన్ 30 ప్రభాతవార్త : అబ్బూరు గ్రామంలో సాయికృష్ణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో సింగరాజు చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించంది.ఆసుపత్రి ఎండీ డా సింగరాజు సాయికృష్ణ వివరాలు తెలిపారు. రాబోయే వర్ష కాలం లో సీజనల్ వ్యాధులు, విషజ్వరాలు,నెమ్ము,దగ్గు, ఆయాసం,ఉబ్బసం వ్యాధుల పట్ల తీసుకువాల్సి న జాగ్రత్తలు హాజరైన రోగులకు అవగాహన కల్పించారు డాక్టర్ సింగరాజుసాయికృష్ణ ,డాక్టర్ సింగరాజు విద్య లను అబ్బూరు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## జిల్లాలో 2,67,196 మంది లబ్ధిదారులకు రూ.118.31 కోట్లు

నరసరావుపేట, జూన్ 30 ప్రభాతవార్త : పల్నాడు జిల్లా వ్యాప్తంగా నేడు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని జిల్లా కలెక్టర్ మంగళవారం ఒక ప్రకటనలో



తెలిపారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్వర్ణ గ్రామ, వార్డు సిబ్బంది ద్వారా ఇంటి వద్దకే నేరుగా పింఛన్ల మొత్తాన్ని చేరవేసేలా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల జిల్లాలో మొత్తం 2,67,196 మంది పింఛనర్లకు రూ. 118,31,95,000 నిధులను పంపిణీ చేయనున్నామని వెల్లడించారు. భాగస్వామి మరణించిన 435 మందికి పింఛన్లను బదలాయించామని, వీరికి మొత్తం రూ. 1 కోటి 74 లక్షలు పంపిణీ చేయనున్నామన్నారు.

**రొంపిచర్ల మండలంలో ....**

బుధవారం ఉదయం 9.30 గం.లకు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు రొంపిచర్ల మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం స్థానిక కేజీబీవీ డార్మిటరీలను ప్రారంభించనున్నారు.

## హత్య కేసులో నిందితునికి జీవిత ఖైదు

నరసరావుపేట క్రైమ్, జూన్ 30 ప్రభాతవార్త , వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ వ్యక్తిని హత్య చేసినట్లు నేరం రుజువు అవడంతో నిందితుడు చిలకలూరిపేటకు చెందిన అక్కల చెంచయ్యకు జీవిత ఖైదు రూ 1000 రూపాయలు జరిమానా విధిస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా స్పెషల్ కోర్టు న్యాయాధికారి ఎస్ రమేష్ మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. నిందితుని భార్యకు చిలకలూరిపేట కు చెందిన పాలపర్తి నాగరాజ్ కు వివాహేతర సంబంధం ఉంది. ఈ నేపథ్యంలో 2025 జనవరి 2న రాత్రి 9 గంటల సమయంలో పట్టణంలోని సుభాని నగర్ లో నాగరాజు ఉంటున్న ఇంటికి వెళ్లి నాగరాజును నిందితుడు చెంచయ్య అతని తమ్ముని కుమారుడు ప్రభు దాసులు కలిసి గొంతు కోసి హత మార్చారు. ఈ మేరకు నాగరాజు భార్య నాగమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

# మతసామరస్యానికి నిదర్శనం బారాషహీద్ దర్గా

**● భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక నెల్లూరు రొట్టెల పండుగ: మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి**

**నెల్లూరు(వైద్యం), జూన్ 30 ప్రభాతవార్త:** ప్రపంచంలోనే మతసామరస్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన పవిత్ర క్షేత్రం బారాషహీద్ దర్గా అని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి మంగళవారం నెల్లూరులోని చారిత్రాత్మక బారాషహీద్ దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, దర్గా కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి బారాషహీదు లను దర్శించుకుని దేశ ప్రజల సుఖశాంతులు, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ, ప్రపంచంలోనే మతసామరస్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన పవిత్ర క్షేత్రం బారాషహీద్ దర్గా అని పేర్కొన్నారు. భిన్న మతాలు, భిన్న సంప్రదా యాలు, భిన్న సంస్క ృతులు కలిగిన ప్రజలు ఒకే వేదికపై కలుసుకుని పరస్పర గౌరవం, సోదరభావాన్ని చాటుకునే అపూర్వ ఆధ్యాత్మిక ఉత్సవం రొట్టెల పండుగ అని అన్నారు.



భారతదేశం వైవిధ్యంలో ఏకత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన దేశమని, ఆ గొప్ప సంస్కృతికి ప్రతిబింబమే నెల్లూరులో జరిగే రొట్టెల పండుగ అని మంత్రి పేర్కొన్నారు. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, జైనులు, సిక్కులు తదితర అన్ని మతాలకు చెందిన భక్తులు ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా ఒకే చోట చేరి రొట్టెలను మార్చుకోవడం భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. శతాబ్దాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయం కేవలం ఆధ్యాత్మిక విశ్వాసానికి మాత్రమే పరిమితం కాకుండా, సర్వమత సౌభ్రాతృత్వానికి, సామాజిక ఐక్యతకు, మానవ విలువలకు ప్రతీకగా నిలుస్తోందన్నారు.

మతం ఏదైనా మనుషులందరూ ఒక్కటేనని, పరస్పర ప్రేమ, గౌరవం, సహజీవనమే భారతీయతకు మూల సూత్రమని ఈ పండుగ ప్రపంచానికి చాటి చెబుతోందని తెలిపారు. ప్రతి ఏటా దర్గాపై ప్రగాఢ విశ్వాసంతో, స్వర్ణాల చెరువులో జరిగే రొట్టెల పండుగలో పాల్గొనేందుకు లక్షలాది మంది భక్తులు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి తరలివస్తున్నారని చెప్పారు. గతంలో కొన్ని వేల మంది భక్తులతో ప్రారంభమైన ఈ ఉత్సవం నేడు లక్షలాది మంది పాల్గొనే మహోత్సవంగా రూపాంతరం చెందడం ఈ పండుగ విశిష్టతకు నిదర్శనమన్నారు. దివంగత ఆనం వివేకానంద రెడ్డి హయాం నుంచే బారాషహీద్ దర్గా అభివృద్ధికి తమ కుటుంబం కృషి చేస్తోందని, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎన్డీఏ కూటమి నాయకులు, జిల్లా ప్రజాప్రతినిధుల సహకారంతో రొట్టెల పండుగ మరింత వైభవంగా నిర్వహించబడుతోందని పేర్కొన్నారు.

# దోచుకునే వారిదే నేడు కాలం

**● సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బివి రాఘవులు**




**తిరుపతి, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రస్తుతం శ్రమ చేసే వారికి విలువ లేదని దోచుకునే వారిదే కాలమని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బివి రాఘవులు ఎద్దేవా చేశారు. నేటి పాలకులు జాతీయ సంపదను దోచేస్తూ, లేబర్ కోడ్‌ల పేరుతో కార్మికుల జీవితాలను కాలరాస్తున్నారని విమర్శించారు. ఇలాంటి సమయం లో ఐక్య ఉద్యమాల అవసరం అన్నారు. అమెరికా ఇరాన్ యుద్ధం ఫిబ్రవరి 8న ప్రారంభమైందని, ఇంకా కొనసాగుతుందన్నారు. ఆ యుద్ధ ప్రభావం భారత దేశంలో అధికంగా ఉందని, క్రూడ్ ఆయిల్, గ్యాస్, నూనె ధరలు విపరీతంగా పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధానికి ముందు చమురు బ్యారెల్ ధర 70 డాలర్లు ఉంటే, యుద్ధం సమయంలో 120 డాలర్లు ఉండేదని, ప్రస్తుతం 70 డాలర్లకు తగ్గిందని, అయినా దేశంలో ధరలు మాత్రం తగ్గలేదన్నారు. దేశంలో ప్రజలపై భారాలు పెరుగుతున్న యుద్ధాన్ని ఆపాలని ప్రధాని మోడీ కనీసం ప్రకటన చేయక పోవడం శోచనీయమన్నారు. ప్రస్తుత పాలకులు అమెరికాకు సహాయం చేయడానికి దేశానికి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. దేశ ప్రజలందరూ ఇబ్బందుల్లో ఉన్న అదానీ, అంబానీ ఆదాయాలు మాత్రం రోజురోజుకు పెరిగిపోతుందన్నారు. అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాలు అన్ని కూడా కార్పొరేట్ శక్తులకు ఆదాయంగా మార్చేస్తున్నారని గజమెత్తారు.

**వర్మది వసుధైక కుటుంబం:**

వర్మ కుటుంబం నిజమైన వసుధైక కుటుంబం అని, కుల మతాలకు అతీతంగా లౌకికవాదాన్ని ప్రోత్సహించిన వ్యక్తి ఆయన అని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బివి రాఘవులు పేర్కొన్నారు. వర్మ 84వ జయంతి సందర్భంగా తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో నేటి తరం ఎదుర్కొంటున్న సవాల్ అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందరపు మురళి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ వర్మ చిన్నతనం నుంచే పోరాట పటిమ కలిగిన వ్యక్తి అన్నారు. పోస్టల్ ఉద్యోగ సంఘంలో ఉన్నప్పుడే ఉద్యమాల్లో పని చేశారని తెలిపారు. ఆయన కుటుంబంలో కులం, మతం భేదాలు లేవని, కట్న కానుకల సమస్యలే లేవని, అవనిగడ్డ కుటుంబాన్ని చూస్తే, నిజమైన భారతదేశాన్ని చూసినట్టు ఉంటుందని వర్మది వసుదైవిక కుటుంబం అని పేర్కొన్నారు. తనకు తెలిసిన మంచిని నలుగురికి చెప్పే తపన ఉన్న వ్యక్తి వీర వర్మాన్ని తెలిపారు. ఒకే దేశం ఒకే మతం ఒకే ఆహారం ఆఖరికి ఒకే బట్ట అనే విధంగా పాలకులు వ్యవహరించడం దారుణం అన్నారు. ప్రభుత్వ సంస్థలు సైతం ప్రైవేటు వారికి అప్పనంగా అప్పగించేస్తూ, దేశ ప్రజలకు కనీసం ఉపాధి భరోసా కూడా లేకుండా చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర రాజకీయాలను సైతం విచిత్రంగా ఉన్నాయని అధికారంలో ఉన్న టిడిపి, జనసేనలు మోడీ అడుగులకు మడుగులు ఒత్తుతున్నారని, ప్రతిపక్షంలో ఉన్న వైసిపి సైతం మోడీ వెంటే ఉన్నారని విమర్శించారు. దేశంలో 'సర్' పేరుతో ఓట్లు మాయం చేసే తంతు జరుగుతుందన్నారు. ఇలాంటి సమయంలో ప్రజలను చైతన్య పరచాల్సి న బాధ్యత ప్రజాస్వామ్యవాదులపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు టి సుబ్రహ్మణ్యం, ఆర్‌పిఐ దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షుడు అంజయ్య, ఐఎన్‌టియుసి నాయకులు రత్నకుమార్, కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు,

# మామిడి రైతులను ఆదుకోవాలి

**● చిత్తూరు- పుత్తూరు రహదారిపై వైసిపి ధర్నా**

**చిత్తూరు, జూన్ 30 ప్రభాతవార్త:** మామిడి రైతుకు ఈ సీజన్‌లో తీరని అన్యాయం జరిగిందని, మామిడి రైతుకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు మండలం జైన్ ఫ్యాక్టరీ ఆవరణలో చిత్తూరు- పుత్తూరు జాతీయ రహదారిపై మంగళవారం తోతాపురి మామిడికి మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేస్తూ వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ ధర్నాకు మాజీ డిప్యూటీ సిఎం నారాయణస్వామి, మాజీ ఎంపి రెడ్డప్ప, చిత్తూరు, పూతలపట్టు, జిడినెల్లూరు, చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు ఎంసి విజయానందరెడ్డి, డాక్టర్ సునీల్‌కుమార్, కృపాలక్ష్మి, చెవిరెడ్డి మోహిత్‌లు, పార్టీ పరిశీలకులు వల్లివేడు పృథ్వీరెడ్డి తదితరులు హాజరయ్యారు. రైతులతో కలసి ధర్నా నిర్వహిస్తున్న వైకాపా నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో కొంత ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది.



అంతరకు ముందు ధర్నానుద్దేశించి భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తుందని ధ్వజమెత్తారు. ఈ సీజన్‌లో తోతాపురి మామిడి రైతుకు ప్రభుత్వం వారం రోజుల క్రితం కేజీకి రూ.4 ప్రోత్సాహక ధర ప్రకటించి, ఫ్యాక్టరీలు రైతుల నుండి కేజీ తోతాపురి మామిడిని రూ.6 కొనుగోలు చేయాలని స్పష్టం చేసినప్పటికీ జిల్లాలోని ఏ ఒక్క ఫ్యాక్టరీ రైతు నుండి తోతాపురి రకం మామిడి కేజీకి రూ.2 నుండి రూ.4 మించి కొనుగోలు చేయడం లేదని ధ్వజమెత్తారు. మాజీ డిప్యూటీ సిఎం నారాయణస్వామి మాట్లాడుతూ జిల్లాలో తోతాపురి మామిడి రైతులు ట్రాక్టర్లను పల్ప్ ఫ్యాక్టరీ వద్దకు తీసుకువచ్చి రోజుల తరబడి పడిగాపులు పడుతున్నప్పటికీ ఫ్యాక్టరీలు మాత్రం మామిడి రైతుల నుండి కాయలు తీసకోవడం లేదని ధ్వజమెత్తారు. మాజీ ఎంపి రెడ్డప్ప మాట్లాడుతూ మామిడి మద్దతు ధర కోసం మామిడి రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుండి స్పందన రాకపోవడంతో మామిడి రైతుల కోసం వైకాపా రోడ్డెక్కిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తోతాపురి మామిడి కేజీకి రూ.15 మద్దతు ధర చెల్లించి మామిడి రైతును ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు, మామిడి రైతులు హాజరయ్యారు.

# పదవీ విరమణ రోజునే రిటైర్మెంట్ బెనిఫిట్స్

**- టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర**




**తిరుమల, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** హిందూ ధార్మికసంస్థ టిటిడిలో సుదీర్ఘ కాలం సేవలందించి పదవీ విరమణ పొందిన వారికి రిటైర్డ్ బెనిఫిట్స్ వచ్చేలా చర్యలు చేపట్టాలని అధికారులను టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర ఆదేశించారు. టిటిడిలో వివిధ శాఖల్లో జూన్‌నెలలో రిటైర్డ్ అయిన 122 మంది ఉద్యోగులకు సామూహిక సన్మానం కార్యక్రమాన్ని మహతి ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించారు. టిటిడి ఉద్యోగుల సంక్షేమ విభాగం డిప్యూటీ ఇఒ ఆనంద రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇఒ రవిచంద్ర మాట్లాడుతూ టిటిడిలో వివిధ శాఖల్లో, పలు హోదాల్లో విధులు నిర్వహించి పదవీ విరమణ అయ్యాక వారిని గౌరవించి, వారికి అందే ఫలాలను అదే రోజు వారి ఖాతాల్లో జమ చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి రోజూ సరాసరి 75 వేల పైచిలుకు భక్తులకు సేవలందిస్తున్న ఉద్యోగులను ఇఒ రవిచంద్ర అభినందించారు. టిటిడి జెఇఒ డాక్టర్.ఎ.శరత్ మాట్లాడుతూ జూన్ 30న 122 మంది టిటిడి ఉద్యోగులు పదవి విరమణ పొందారని, వారిని సమిష్టిగా పండుగ వాతావరణంలో సన్మానించాలని టిటిడి ఇఒ ఆలోచనలు మేరకు సన్మాన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. టిటిడిలో పదవీ విరమణ పొందిన వారిని సన్మానించడం మహ సేవగా కొనియాడారు. టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి తదితరులు ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం పదవీ విరమణ పొందిన 122 మందికి ఒక్కొక్కరికి శ్రీవారి లడ్డూ, వడ, అమ్మవారి కుంకుమ, పసుపు, రవికె, అక్షింతలు, తీర్థం, శాలువా ఇచ్చి

# విద్యుత్ భద్రతపై అవగాహన అవసరం

**● ప్రమాదాల నివారణపై వినియోగదారుల్లో చైతన్యం ● ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి**

**తిరుపతి, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** నేటి సమాజంలో విద్యుత్ భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహనను పెంపొందించుకోవాలని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి సూచించారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ భద్రతపై ఎస్పీడిసిఎల్ విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను తిరుపతిలో ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి మంగళవారం అవిష్కరిం చారు. ఈ సందర్భంగా సిఎండి మాట్లాడుతూ విద్యుత్ సామర్థం, భద్రతా చర్యలు, నిబంధనల అమలు అంశాలపై ఈ యేడాది జూన్ 26న ప్రారంభమైన అవగాహనా కార్యక్రమాలు జులై 2వతేదీ వరకు కొనసాగు తాయని తెలిపారు. విద్యుత్ ప్రమాదాలను నివారించడమే ధ్యేయంగా సంస్థ పరిధిలో సర్కిల్, డివిజన్, సబ్ డివిజన్, సెక్షన్ల స్థాయిల్లో విద్యుత్ భద్రతపై వినియోగదారుల్లో అవగాహనను పెంపొందించేదుకు కృషి చేస్తున్నామని వివరించారు. విద్యుత్ భద్రతపై వినియోగదారుల్లో చైతన్యం తీసుకురావడం ద్వారానే ప్రమాదాలను నివారించేందుకు అవకాశం వుంటుందన్నారు. గృహోపకరణాల అంశంలో వినియోగదారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నాణ్యమైన విద్యుత్ పరికరాలనే వినియోగించాలని సూచించారు.

అంతేకాకుండా ఇంటి వైరింగును నిపుణుడైన ఎలక్ట్రిషియన్‌తో తరచూ తనిఖీ చేయిస్తూ, పాడైన పరికరాలను వెంటనే మార్చుకోవాలని, ఎర్తింగ్‌ను తప్పనిసరిగా అమర్చుకోవాలన్నారు. బలమైన గాలి వర్షం సందర్భాల్లో ప్రజలు విద్యుత్ లైన్ల కిందగానీ, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్లకు దగ్గరగాగానీ నిల్చోవద్దని సూచించారు. తమ ప్రాంతంలో ఎక్కడైనా విద్యుత్ ప్రమాదాలు జరిగినట్లయితే వినియోగ దారులు వెంటనే తమ సమీపంలోని విద్యుత్ సిబ్బందికిగానీ, అధికారులకుగానీ సమాచారం అందించాలని సూచించారు. సంస్థ పరిధిలో క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించే సిబ్బందికి కూడా విద్యుత్ భద్రతపై ప్రత్యేకంగా శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామని తెలియ జేశారు.

# 'సంజీవని' ఒక గేమ్‌ఛేంజర్

**● వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్**

**విజయవాడ, జూన్ 30 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిలో అమలవుతున్న 'సంజీవని' ఒక గేమ్ ఛేంజర్ పథకంగా జాతీయ స్థాయిలో గుర్తింపులోకి వచ్చిందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఢిల్లీలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంరక్షణ మండలి సమావేశానికి హాజరైన సందర్భంగా మంత్రి సత్యకుమార్ సామాజిక మాధ్యమాల ద్వారా వివరించారు. రాష్ట్రాల ఆరోగ్య శాఖ మంత్రులకు సంజీవని పథకం గురించి వివరించినట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. వ్యాధులు సోకిన అనంతరం చికిత్సను అందించే సాంప్రదాయ విధానం నుండి(రియాక్టివ్) వ్యాధుల నివారణకు (ప్రివెంటివ్) దిశగా సమగ్ర మార్పునకు 'సంజీవని' పథకం ఒక గేమ్ ఛేంజర్ కానున్నదని మంత్రి సత్యకుమార్ యాదవ్ సమావేశంలో వివరించారు. డిజిటల్ వైద్య సేవలను అట్టడుగు స్థాయికి అందుబాటులోకి తెచ్చి వైద్య సేవల్ని పొందడంలో ప్రస్తుతం గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య నెలకొన్న అంతరాన్ని తొలగించడానికి 'సంజీవని' ఇతోధికంగా ఉపకరిస్తుందని మంత్రి తెలిపారు. దార్శినికుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనల మేరకు సంజీవని పథకాన్ని రూపొందించినట్లు మంత్రి వెల్లడించారు.

గతేడాది జులై మాసంలో కుప్పం నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమై, ప్రస్తుతం చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అమలవుతున్న 'సంజీవని' పథకాన్ని ఆగస్టు మాసంలో రాష్ట్రమంతటా విస్తరిస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ప్రజలకు వైద్య సేవలను అందించే దిశగా పలు అంశాల్లో రాష్ట్రం ముందంజలో ఉందని రాష్ట్ర మంత్రుల సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు. టెలీ వైద్య సేవలు, ఎన్‌సిడి స్క్రీనింగ్, ఎయిడ్స్ నియంత్రణ, ఎనీమియా నివారణ, ఆసుపత్రుల్లో ప్రసవాలు, క్షయ వ్యాధి నోటిఫికేషన్, ప్రసవకాలంలో మాతృ మరణాల నివారణ వంటి పలు అంశాల్లో రాష్ట్రం ముందంజలో ఉన్నట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ సోదాహరణంగా వివరించారు.

## జిల్లాస్థాయి యోగా పోటీలు

నరసరావుపేట,జూన్30, ప్రభాతవార్త: యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇలా స్థాయి యోగా పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సెక్రటరీ రామలింగమూర్తి మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 5వ తేదీన బరంపేటలో గల సరస్వతి శిశు మందిర్ స్కూల్లో పోటీలు జరుగుతాయి అన్నారు. ఈ పోటీలలో జిల్లా పరిధిలో గల విద్యార్థులు, యోగా క్రీడాకారులు పాల్గొనవచ్చు పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి యోగ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధిస్తారన్నారు. యోగాసనాలను క్రీడగా అభివృద్ధి చేయడం, యువతలో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడం ఈ పోటీల ఉద్దేశమని వివరించారు.

ఏఎం.రెడ్డి కళాశాలలో ఘనంగా అంతర్జాతీయ బ్రెయిన్ సింపోసయం

## ఏఎం రెడ్డి స్మారక ఫార్మసీ కళాశాలలో బ్రెయిన్ సింపోసియం

నరసరావుపేట టౌన్, జూన్ 30 ప్రభాతవార్త : ఏఎం రెడ్డి స్మారక ఫార్మసీ కళాశాలలో అంతర్జాతీయ బ్రెయిన్ రీసర్చ్ సంస్థ, అనుసంధాన్ నేషనల్ రీసర్చ్ ఫౌండేషన్ బ్రెయిన్ సింపోసియం కార్యక్రమం మంగళవారం రెండవ రోజుకి చేరింది. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ శాస్త్రవేత్త డాక్టర్ కవితా బాబు పాల్గొని మానవుని మెదడులో సంభవించే అనేక ఇన్ఫెక్షన్స్ పట్ల ప్లీనరీ టాక్ ద్వారా విద్యార్థులకు తెలిపారు . డా. అనిత మహదేవన్ హాజరై భారత దేశంలో నూతన మెదడు సంబంధిత అధ్యయనం పట్ల విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు జవాబులు చెప్పారు. హైదరాబాద్ కిమ్స్ హాస్పిటల్ స్పైన్ సర్జన్ డాక్టర్ కె. శ్రీకృష్ణ చైతన్య అధునాతన పరికరాల ద్వారా మరియు రోబోటిక్స్ సహాయంతో ఎలాంటి క్లిష్టతరమైన సర్జరీలను నిర్వహించవచ్చని తెలిపారు. అనంతరం నరసరావుపేట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుండి వాక్ ఫర్ బ్రెయిన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి డాక్టర్ అట్లూరి శాంతి శ్రీనివాస్ రెడ్డి, కె ఎల్ యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ ప్రొఫెసర్ జగన్నాధ రావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. భార్గవ్ భూషణ్ రావు, కళాశాల అకాడమిక్ డీన్ డాక్టర్ ఏ, పావని, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ పొందిన పోలీసులకు ఆత్మీయ వీడ్కోలు


నరసరావుపేట క్రైమ్ జూన్ 30 ప్రభాతవార్త : జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం పల్నాడు జిల్లా పరిధిలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి, పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు విశిష్ట సేవలందించి పదవీ విరమణ చేస్తున్న ఆరుగురు పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు, పోలీస్ అధికారులతో కలిసి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఇ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ వి. శ్రీనివాస



మూర్తి, ఏఎస్సై సిహెచ్. హరినాథ్ బాబు, ఏఎస్సై ఎస్కె. మస్తాన్ వలి, రఘురామ రెడ్డి, హోమ్ గార్డ్స్ బి. రమణయ్య, ఎస్. సుభానిల దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సంధర్భంగా ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ పధవీ విరమణ చేస్తున్న పోలీస్ అధికారులకు మరియు వారి కుటుంబ సభ్యులకు ధన్యవాధములు తెలియజేశారు. ఇప్పటి వరకు 24 గంటలూ ఉద్యోగ వీధి నిర్వహణలో బాగంగా చాలా బిజీగా గడిపారని, వారు ఆరోగ్యంగా జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ పరిపాలన జెవి. సంతోష్, ఏ.ఆర్.అడిషనల్. ఎస్.పి వి. సత్తి రాజు, ఆర్.ఐ. గోపినాథ్, కృష్ణ రావు, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు మాణిక్యాల్ రావు, అసోసియేషన్ సంఘ సభ్యులు, అధికారులు, పోలీస్ సిబ్బంది, పోలీస్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

నరసరావుపేట, జూన్ 30 ప్రభాతవార్త : శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు మంగళవారం పట్టణంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ వేడుకలు, ఆత్మీయ




సమావేశాలకు హాజరై నియోజకవర్గ ప్రజలతో మమేకమయ్యారు. స్థానికంగా జరిగిన మీగడ వారి వివాహ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు నూతన వధూవరులను ఆశీర్వదిం చారు.ప్రకాష్ నగర్ షాదీ ఖానాలో చిరుగూరి మాణిక్యం ఉద్యోగ విరమణ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం వినుకొండ రోడ్డులోని కన్వెన్షన్ హాల్ నందు బచ్చునబోయిన శివయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అదేవిధంగా రాధా సుందర కళ్యాణ మండపంలో జరిగిన మరో ఉద్యోగ విరమణ కార్యక్రమంలోనూ ఎమ్మెల్యే పాల్గొని విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు.పెద్ద చెరువులో ఉన్న కాసు కన్వెన్షన్ హాల్ నందు జరిగిన శిఖాకొల్లి పుష్పాలంకరణ వేడుకకు హాజరైన డాక్టర్ అరవింద బాబు చిన్నారి మధు హరణిని ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు.రావిపాడు రోడ్ లో న్యాయవాది నసీమా నూతన గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడా అరవింద బాబు పాల్గొన్నారు.

ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబును పలువురు నాయకులు, కార్యకర్తలు కలిసి స్వాగతం పలికారు.

## సర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన డా. గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి..

నరసరావుపేట,జూన్ 30 ప్రభాతవార్త : .పల్నాడు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డా.గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం సర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పట్టణంలోని పలు వార్డులో జరుగుతున్న ఈ కార్యక్రమని కి పలు సూచనలు చేశారు. ,పట్టణ వైఎస్ఆర్



కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ కరీముల్లా, ఆయా వార్డు ఇన్చార్జులు భూమిరెడ్డి కొండారెడ్డి, మాగులూరి రమణారెడ్డి, ఎన్ కే ఆంజనేయులు, నిడమానురి సురేంద్ర , అచ్చి శివకోటి ,వైఎస్సార్సీపీ ఆయా వార్డుల ప్రెసిడెంట్లు,వార్డుల బూత్ లెవెల్ ఏజెంట్లు మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు..



## కెనాల్ వద్ద యువతి ఆత్మహత్యాయత్నం

సత్తెనపల్లి, జూన్30, ప్రభాతవార్త: సత్తెనపల్లి .. గుంటూరు రోడ్డు సమీపంలో పెద్ద కెనాల్ వద్ద పల్లపు బాల అంకమ్మ తన ఎడమ చేతిని బ్లేడుతో కట్ చేసుకొని ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం చేసుకుంది బాల అంకమ్మ స్నేహ కాలనీ అక్కడ పడిపోగా అక్కడున్న స్థానికులు సత్తెనపల్లి గవర్నమెంట్ హాస్పిటల్ కి తరలించారు ఒక వేళ విషయంలో సబ్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ విచారణకు పిలిచారు. రాజశేఖర్ బాల అంకమ్మను గట్టిగా మందలించడంతో తను మనస్తాపానికి గురై ఆత్మహత్య ప్రయత్నం చేసుకుందని అంకమ్మ తల్లి వివరించింది

## వెలుగూరి వెంకటేశ్వర్లు సేవలు వెలకట్టలేనివి: యెల్లినేడి రామస్వామి

**ఆర్యవైశ్యుల్లో గొప్పనాయకులు, సేవాదృక్పథం, పోరాట పటిమ ఉన్న నాయకులు వెలుగూరి వెంకటేశ్వర్లు.. చౌట శ్రీనివాసరావు.. ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు మరియు వెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి**

సత్తెనపల్లి, జూన్30, ప్రభాతవార్త: పల్నాడు జిల్లా, సత్తెనపల్లి పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఉన్న వెలుగూరి వెంకటేశ్వర్లు గారి విగ్రహం వద్ద సత్తెనపల్లి పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో కీర్తిశేషులు వెలుగూరి వెంకటేశ్వర్లు 54వ వర్ధంతి సందర్భంగా ఆర్యవైశ్య సంఘం



నాయకులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు, పెద్దలు, వివిధ హోదాల్లో ఉన్న వారు అందరు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా విగ్రహానికి ఘజ మాల వేశారు, అనంతరం 30 పూల మాలలు వేశారు. వక్తలు మాట్లాడుతూ వెలుగూరి సేవలను కొనియాడారు, ఆయన మరణించి 54 సంవత్సరాలు అయినా ప్రజల హృదయాల్లో చిర స్థాయి గా నిలిచారు. ఈ కార్యక్రమంలో వెలుగూరి శరత్ బాబు, చిల్లంచర్ల కళ్యాణ్, జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ మంత్రివర్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి, కట్టా శంకరరావు, కండక్టర్ శంకర్, గంటా విజయ భాస్కరరెడ్డి, పోతూరి హరిమోహనరావు, బచ్చు వెంకటేశ్వర్లు, పెద్దాల శాలి మల్లేశ్వరరావు, జమిలి రాధాకృష్ణ మూర్తి, జూపల్లి పాల్, కొత్త లక్ష్మయ్య, జవ్వాజి రామమోహనరావు, పోతుగంటి రామకోటేశ్వరరావు, పెరుమాళ్ళ లక్ష్మి శివన్నారాయణ, అచ్యుత శివప్రసాద్, న్యాయవాదులు దాసరి జ్ఞాన్ రాజ్ పాల్, వలువది చిన సత్యనారాయణ, దివ్వెల శ్రీనివాసరావు, బగ్గి నరసింహారావు, మాదంశెట్టి వేదాద్రి మరియు వివిధ హోదాల్లో ఉన్న నాయకులు మరియు వెలుగూరి అభిమానులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఐదు మందిలో ఇద్దరకు కుట్టు మిషన్లు మరో ముగ్గురు వెట్ గ్రేండర్లు పంపిణీ చేసి, అన్నదానం కూడ చేశారు.

## ఉచిత వైద్య శిబిరంకు అపూర్వ స్పందన : డా సింగరాజు సాయికృష్ణ . డా సింగరాజు విద్య

సత్తెనపల్లి, జూన్30, ప్రభాతవార్త: సత్తెనపల్లి మండలం అబ్బూరు గ్రామంలో సాయికృష్ణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్స్ వారి ఆధ్వర్యంలో సింగరాజు చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని ఆసుపత్రి ఎండీ డా సింగరాజు సాయికృష్ణ తెలిపారు. ఈ శిబిరంలో సాయికృష్ణ ఆసుపత్రి వైద్యులు మాట్లాడుతూ రాబోయే వర్ష కాలం లో



సీజనల్ వ్యాధులు, విషజ్వరాలు, నెమ్ము,దగ్గు, ఆయాసం,ఉబ్బసం వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటిస్తే రోగులకు అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో టీపీ,షుగర్,జ్వరాలు నెమ్ము, ఆయాసం, ఉబ్బసం, జలుబు, దగ్గు, థైరాయిడ్ సమస్యలు, మరియు అన్ని జనరల్ వ్యాధుల కు ఉచితంగా వ్యాధులకు ఉచితంగా షుగర్, థైరాయిడ్ ప్రొఫైల్, పరీక్షలు చేసి సుమారు 200 మందికి వైద్య సేవలు అందజేశారు.అలాగే అవసరమైన రోగులకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు.ఈ వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్ సింగరాజు సాయికృష్ణ,డాక్టర్ సింగరాజు విద్య గార్లకు అబ్బూరు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ వైద్య శిబిర కార్యక్రమంలో కట్టా రమేష్ ,గరికపాటి చిన్న నరసింహారావు,నిమ్మగడ్డ నాగ శ్రీను,మానుకొండ వేణు మానుకొండ మస్తానరావు,మర్రి శ్రీను ,బి. కృష్ణ డి .యానాది,గొర్రె పాటి. సుశీల,టి నాగేశ్వరరావు ,యం.బుజ్జి మరియు అబ్బూరు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యాన్ని డబ్బుతో ముడిపెట్టడం అత్యంత బాధాకరం : ప్రత్తిపాటి


చిలకలూరిపేట, జూన్ 30, ప్రభాతవార్త: ఆర్థిక సమస్యలున్నా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలనే గొప్ప సదుద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్టీఆర్ వైద్యసేవ.. సీఎం.ఆర్.ఎఫ్ (ముఖ్యమంత్రి సహాయనిధి) ద్వారా వేలకోట్లు కేటాయిస్తున్నారని, కానీ కొన్ని నెట్ వర్క్ ఆసుపత్రులు డబ్బు వ్యామోహంతో, పేద ప్రజల నుంచి అదనంగా వసూలు చేస్తూ, ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావడం అత్యంత బాధాకరమని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని ప్రత్తిపాటి గార్డెన్స్ లో ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో, శంకర కంటి ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన 44 వ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని, రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణతో కలిసి ప్రత్తిపాటి ప్రారంభించారు. కంటి శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి కళ్లజోళ్లు పంపిణీ చేసిన అనంతరం ఎమ్మెల్యే, ఎంపీ విలేకరులతో మాట్లాడారు. కొన్ని నెట్ వర్క్ ఆసుపత్రుల అదనపు



వసూళ్లతో ప్రభుత్వానికి చెడ్డపేరు.. ఎన్టీఆర్ వైద్య సేవ పథకాన్ని ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణ కోసం ప్రవేశపెడితే వాస్తవాన్ని కొన్ని నెట్ వర్క్ ఆసుపత్రులు గ్రహించాలని, వైద్యసేవల కోసం వచ్చే పేద, మధ్యతరగతి వర్గాల నుంచి అదనంగా డబ్బులు తీసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయని ప్రత్తిపాటి చెప్పారు. ఆసుపత్రుల చర్యలతో ప్రజల్లో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందన్నారు. ప్రభుత్వం ఈ సదాశయంతో వేలకోట్లు ఖర్చు చేస్తున్నా, అవి ప్రజలకు ఉపయోగపడకపోతే ఎలాగని ప్రత్తిపాటి ప్రశ్నించారు. అదేవిధంగా కొన్ని ఆసుపత్రులు సీఎం.ఆర్.ఎఫ్, ఎల్.ఓ.సీలు పొందిన వారి నుంచి మెరుగైన వైద్యసేవలు, వైద్య పరికరాల పేరిట అదనపు వసూళ్లతో జేబులకు చిల్లులు పెడుతున్నారని ప్రత్తిపాటి తెలిపారు. సమస్యపై దృష్టి పెట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నానన్న ప్రత్తిపాటి.. ఆసుపత్రి యాజమాన్యాలు మానవతా దృక్పథంతో ప్రభుత్వ ఆశయాన్ని గౌరవించాలని, ప్రజలకు ఉత్తమమైన వైద్యసేవలు అందించాలని ప్రత్తిపాటి సూచించారు. ఆసుపత్రుల యాజమాన్యాలు తాము ఎదుర్కొనే సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తే పరిష్కరించవచ్చని గానీ, ప్రజల ఆరోగ్య సమస్యల్ని సొమ్ము చేసుకోవడం మంచి పద్ధతికాదని ఆయన హితవు పలికారు. దేశంలో ఏ నాయకుడు చేయనంతగా, పేదప్రజల ఆరోగ్యం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారు.ఇప్పటివరకు 50వేల శస్త్ర చికిత్సలు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు, వైద్యేతర సిబ్బంది తమ వినతిని, సేవాభావంతో ప్రజల్లో మంచిపేరు పొందారని, దేశవ్యాప్తంగా తమ ఆసుపత్రి కీర్తి ప్రతిష్టలు పెంపొందించారని ప్రత్తిపాటి చెప్పారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 50వేల మందికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు చేశారన్నారు. ప్రత్తిపాటి ఫౌండేషన్ నిర్వహించిన 44 కంటి వైద్య శిబిరాల్లో ఎక్కువభాగం శంకర ఆసుపత్రి సహకారంతో నిర్వహించినవేనని ప్రత్తిపాటి చెప్పారు.జగన్ సృష్టించిన భూ సమస్యలు పరిష్కరించుకుంటూ ప్రభుత్వానికి సహకరించాలి ప్రభుత్వం నిర్వహించే గ్రీవెన్స్ లో ప్రజల నుంచి ఎక్కువగా భూముల వివాదాలే వస్తున్నాయని, 22ఏ 1సీ, రీసర్వే సమస్యలే ఎక్కువగా ఉన్నాయని ప్రత్తిపాటి చెప్పారు. గత నెల 29న కంటి శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి నేడుకళ్లజోళ్లు పంపిణీ చేశామని, ఉచితంగా మందులు కూడా అందజేశామని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ లు పేద ప్రజల ఆరోగ్య రక్షణ కోసమే సంజీవని ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారని, అది పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తే రాష్ట్రంలో ఏ ఒక్కరూ అనారోగ్య సమస్యలతో బాధపడరని రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తేళ్ల సుబ్బారావు, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మండల అధ్యక్షులు జవ్వాజి మదన్ మోహన్, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, ప్రధాన కార్యదర్శి మున్నమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, నిర్వాహకులు కంచర్ల శ్రీనివాసరావు, శంకర్ హాస్పిటల్ డాక్టర్ శ్రీనివాసరావు, టీడీపీ నేతలు గంగా శ్రీనివాసరావు, షేక్ మస్తాన్ వలీ, గట్టినేని సాయి, పిల్లి కోటేశ్వరరావు, బేరింగ్ మౌలాలి, తుపాకుల అప్పారావు, కూటమి నాయకులు, పాల్గొన్నారు.

## తాగునీటి ప్లాంట్ ప్రారంభించిన ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూన్ 30, ప్రభాతవార్త: నాదెండ్ల గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ నందు రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట వారి సహకారంతో ఏర్పాటు చేసిన శుద్ధ



జల కేంద్రాన్ని (వాటర్ ప్లాంట్) ఎమ్మెల్యే ప్రత్తిపాటి ప్రారంభించారు. సోమవారం స్థానిక నాయకులతో కలిసి పాఠశాలలోని మౌలిక వసతుల పరిశీలించిన ప్రత్తిపాటి, రోటరీ క్లబ్ నిర్వాహకులతో కలిసి తాగునీటి కేంద్రాన్ని ప్రారంభించారు. వాటర్ ప్లాంట్ ను సద్వినియోగం చేసుకోవాలని, నిర్వహణలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని ఈ సందర్భంగా ప్రత్తిపాటి ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, హరిబాబు గారు, రోటరీ క్లబ్ చిలకలూరిపేట సభ్యులు ఉప్పుటూరి ప్రసాద్, చెరుకూరి శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ పదవీపూరం సభ్యులు బోనం వెంకటేశ్వర్లు, సింగరావు, ప్రధానోపాధ్యాయులు కే నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాల పిల్లల విద్యాభివృద్ధికి అంకితభావంతో కృషి చేయాలి

బాపట్ల, జూన్30, ప్రభాతవార్త, ప్రతినిధి: ప్రత్యేక అవసరాలు గల పిల్లల విద్యాభివృద్ధి, భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బాపట్ల మున్సిపల్ హైస్కూలులో మంగళవారం ఐఈ ఉపాధ్యాయులు, ఫిజియోథెరపిస్టుల జిల్లా స్థాయిసహిత విద్య సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి



ఐఈ సమన్వయకర్తఎం. జ్యోత్స్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూక్షేత్రస్థాయిలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వారికి సంబంధించిన ధ్రువపత్రాలు, రోజువారీ హాజరు వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి వివరాలను తప్పనిసరిగా ఎక్స్ఎల్ కనక్ట్ యాప్‌లో నవీకరించాలని ఆదేశించారు. విద్యారంగంలోబాపట్ల జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏపీసీ ఎ. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారు ఉన్నత లక్ష్యాలను చేరుకునేలా ఉపాధ్యాయులు నిరంతరం ప్రోత్సహించాలని సూచించారు. ఏఎస్‌వో టి. శ్రీనివాసరావు, ఏపీఓ టి. ప్రకాశరావుతో పాటు జిల్లాకు చెందిన 42 మంది ఐఈ ఉపాధ్యాయులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా కొల్లూరు మండల ఐఈఆర్‌పీ టి. ధనరాజు, బాపట్ల మండల ఐఈఆర్‌టీ పి. రమాదేవిల పదవీ విరమణ సందర్భంగా ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

## కుల వివక్ష నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

బాపట్ల, జూన్30, ప్రభాతవార్త, ప్రతినిధి: ఎస్సీ, ఎస్టీ వర్గాలపై కుల వివక్షను పూర్తిగా నిర్మూలించి ,అంటరానితనానికి స్వస్తి పలకడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజా దెబోరా తెలిపారు. బాపట్ల మండలం గోపాపురంలో మంగళవారం ప్రభుత్వ ఆదేశాలమేరకు



నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవ గ్రామసభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీడీవో బాబురావు మాట్లాడుతూరాజ్యాంగం కల్పించిన హక్కులు ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సంపూర్ణంగా అందేలా అధికార యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందన్నారు. రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, తహశీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌కూచిపూడి సాల్మన్ రాజు, గృహ నిర్మాణ శాఖ ఏఈ ప్రసాదరావు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సుజాత, పంచాయతీ అభివృద్ధి అధికారి జ్యోతి, స్థానిక నాయకులు ఆశీర్వాదం, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, స్వర్ణ గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటింటా ఓటర్ల సర్వే పక్కాగా జరగాలి: కేంద్ర ఎన్నికల సంఘం

బాపట్ల, జూన్30, ప్రభాతవార్త, ప్రతినిధి: ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా నవీకరణలో భాగంగా చేపట్టిన ఇంటింటా ఓటర్ల సర్వే ప్రక్రియను అత్యంత సమర్థంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని భారత ఎన్నికల సంఘం ఉన్నతాధికారి పవన్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారండిల్లీ





నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాలకలెక్టర్లతో ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూబూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటినీ సందర్శించిఓటర్ల సర్వేను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. విధుల్లో నిరక్ష్యం వహించే, సక్రమంగా పనిచేయని బీఎల్‌ఓల స్థానంలో తక్షణమే వేరొకరిని నియమించాలని సూచించారు. సర్వే ప్రక్రియ అంతా నాణ్యతా ప్రమాణాలతో కూడి ఉండాలలన్నారు. ఓటర్ల మ్యాపింగ్‌లో ఎలాంటి సాంకేతిక సమస్యలు, పొరపాట్లు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు బాపట్ల జిల్లా నుంచి జిల్లా ప్రత్యేక అధికారి, పౌర సరఫరాల శాఖ రాష్ట్ర కమిషనర్ కన్నబాబు, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్. వి హాజరయ్యారు. సమావేశం అనంతరం జిల్లాలో సాగుతున్న సర్వే పురోగతిపై ప్రత్యేక అధికారి కన్నబాబుకు కలెక్టర్ వినోద్ కుమార్ ఒక నివేదికను అందజేశారు. జిల్లా వ్యాప్తంగా 1,212 మంది బీఎల్‌ఓలు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్నారని.. ఇప్పటివరకు 71.82 శాతం ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని కలెక్టర్ ఈ సందర్భంగా వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ (జేసీ) భావనవశిష్ఠ, జిల్లా రెవెన్యూ అధికారిజి. గంగాధర్ గౌడ్, ఆర్డీవో హరికుమార్, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు షేక్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ శాఖలో అత్యుత్తమ శిక్షణ

కర్లపాలెం, జూన్30, ప్రభాతవార్త, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన మాధవ కిరణ్ కర్లపాలెం ఆర్ ఐ గా ఉత్తమ సేవలు అందించారని తహశీల్దార్ రవీంద్ర కుమార్ తెలిపారు మంగళవారం శిక్షణ ముగించుకున్న కర్లపాలెం ఆర్. ఐ కు జ్ఞాపికను అందజేసి ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ



సందర్భంగా తహసీల్దార్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా రెవిన్యూ శాఖలో శిక్షణ పొంది ప్రస్తుతం సీఎంఓ కార్యాలయానికి వెళుతున్న రవీంద్ర కుమార్ కు జ్ఞాపికను బహుమతి చేశారు తాను నేర్చుకున్న అనేక విషయాలను రాష్ట్రవ్యాప్తంగా అమలయ్యే విధంగా మాధవ కిరణ్ చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు సూపర్డెంట్ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు

## పౌర హక్కులు అందరికీ సమానం



కర్లపాలెం, జూన్30, ప్రభాతవార్త: రాజ్యాంగం పౌర హక్కులను అందరికీ సమానంగా అందిస్తుందని తాసిల్దార్ కార్యాలయం సూపర్నిడెంట్ ఆనంద్ రావు స్పష్టం చేశారు, మంగళవారం కర్లపాలెం మండల పరిధిలోని రాజీవ్ నగర్ కాలనీలో పౌర హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు పోలీస్ రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు

## ఎస్ఎస్ఆర్ జిల్లా ప్రత్యేక అధికారిగా కన్నబాబు

బాపట్ల, జూన్30, ప్రభాతవార్త, ప్రతినిధి: ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా (ఎస్ఎస్ఆర్) నవీకరణ ప్రక్రియ పర్యవేక్షణ కోసం బాపట్ల జిల్లా ప్రత్యేక అధికారిగా నియమితులైన రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ కన్నబాబు మంగళవారం జిల్లాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా పరిపాలన, ఓటర్ల జాబితా



ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమానికి సంబంధించిన అంశాలపై అధికారులు ప్రత్యేక అధికారికి వివరాలు అందించారు. అలాగే జిల్లా సంయుక్త కలెక్టర్ భావన వశిష్ఠ, డీఆర్వో జి. గంగాధర్ గౌడ్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలక్ష్మి తదితర అధికారులు ప్రత్యేక అధికారిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

## ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియ పక్కాగా నిర్వహించాలి



బాపట్ల, జూన్30, ప్రభాతవార్త, ప్రతినిధి: ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియ పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్. వి, తెలిపారు. వేటపాలెం మండలం పొట్టిసుబ్బయ్యపాలెం గ్రామంలో కలెక్టర్ మంగళవారం పర్యటించారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా సర్వేలో భాగంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 2002 ఓటర్ల జాబితాను 2025 ఓటర్ల జాబితాకు మ్యాపింగ్ చేస్తున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ సమర్థంగా చేపట్టాలన్నారు. కొండూరి పోతురాజు నివాసానికి చేరుకుని క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. ప్రస్తుతం జాబితాలో ఉన్న వారి వివరాలు, 23 ఏళ్ల క్రితం జాబితాలో ఉన్న వారిని అనుసంధానిస్తూ ఓటు మ్యాపింగ్ చేయించారు. పొట్టి సుబ్బయ్య పాలెంలో ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ తక్కువగా జరగడంపై సంబంధిత బి ఎల్ ఓ ను నిలదీశారు. మ్యాపింగ్ ప్రక్రియ వేగంగా చేపట్టాలని, నిరంతరం పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. లేకుంటే సంబంధిత బి ఎల్ ఓ, తహసిల్దార్ లపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్డీఓ ఎస్. నరసింహారావు, తహశీల్దార్‌లు, తదితరులు పాల్గొన్నారు.

## బాలికపై అఘాయిత్యం: నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

**రూ.10 వేల జరిమానా, బాధితురాలికి రూ.4 లక్షల పరిహారం**

**తీర్పు వెలువరించిన తెనాలి పోక్సో కోర్టు న్యాయమూర్తి ఇందిరా ప్రియదర్శిని**

**పోలీసులను అభినందించిన బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్**

బాపట్ల, జూన్30, ప్రభాతవార్త, ప్రతినిధి: ఎనిమిదేళ్ల మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి తెనాలి స్పెషల్ పోక్సో కోర్టు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.10,000నగదు జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చింది. బాధితురాలికి ప్రభుత్వం తరఫున రూ.4 లక్షల పరిహారం అందజేయాలని న్యాయమూర్తిఇందిరా ప్రియదర్శిని ఆదేశించారు. కేసు





వివరాలలోకి వెలితే రేపల్లెపట్టణం నేతాజీ నగర్‌కు చెందిన గూడూరి రమేష్ ఉరఫ్ సాల్మన్ రాజు (34) అనే వ్యక్తి, 2022 జూన్ 22న ఓ ఇంట్లో పెయింటింగ్ పనికి వెళ్లాడు. ఆ సమయంలో ఇంట్లో జ్వరంతో పడుకున్నఎనిమిదేళ్ల బాలికపై అతను లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లి గమనించి కేకలు వేయడంతో నిందితుడు పరారయ్యాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకుఅప్పటి రేపల్లె సీఐ వి. సూర్యనారాయణ కేసు నమోదు చేయగా, డీఎస్పీ ఎ. శ్రీనివాసరావు క్లూస్ టీమ్ సహాయంతో శాస్త్రీయ ఆధారాలు సేకరించి నిందితుడిని అరెస్ట్ చేశారు.

**పోలీసుల పటిష్ట నిఘాఆపరేషన్** : బాపట్ల జిల్లా ఎస్పీఉమామహేశ్వర్ఆదేశాల మేరకు రేపల్లె పోలీసులు, కోర్టు మానిటరింగ్ సిబ్బంది (హెచ్‌సీ జి. శ్రీనివాసరావు) సాక్షులకు ధైర్యం చెప్పి సకాలంలో కోర్టులో హాజరుపరిచారు. కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేలినేని రాఘవయ్య బలమైన వాదనలు వినిపించి నిందితుడిపై నేరాన్ని రుజువు చేశారు. మహిళలు, చిన్నారుల భద్రతకు తాము అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, నేరస్థులకు కఠిన శిక్షలు పడేలా చేసేందుకే ఆపరేషన్ దండాయన అమలు చేస్తున్నామనిఎస్పీ తెలిపారు. ఈ కేసులో వేగంగా దర్యాప్తు పూర్తి చేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులను, కోర్టు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## జరీనాకు ప్రత్తిపాటి పరామర్శ



చిలకలూరిపేట, జూన్ 30, ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళా నాయకురాలు షేక్ జరినా సుల్తానాకు ఇటీవల చేతికి సంబంధించిన ఆపరేషన్ జరిగింది. మంగళవారం, గుంటూరు నగరం, లక్ష్మీపురం లోని ఆమె నివాసానికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## సర్.. ప్రక్రియను నిర్లక్ష్యం చేస్తున్న బిఎల్‌వోలపై పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా ఆగ్రహం



చిలకలూరిపేట, జూన్ 30, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో నిర్లక్ష్యం చేస్తున్న బిఎల్‌ఓలను సస్పెండ్ చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. టెలికాన్ఫరెన్స్ హెచ్చరిక....ఓటర్ సమగ్ర సర్వేపై ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఈ సస్పెన్షన్ ఆదేశాల విషయాన్ని అధికారులకు, బిఎల్‌ఓలకు స్పష్టంగా పునరుద్ఘాటించారు. విధుల్లో అలసత్వం...సర్ ప్రక్రియ ప్రారంభమై రెండు వారాలు గడుస్తున్నప్పటికీ, ఓటర్లకు అవసరమైన ఫారాలను అందజేయడంలో బిఎల్‌ఓలు అలసత్వం వహిస్తున్నారని ఈఆర్వో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## హత్య కేసు నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష : అర్బన్ సీఐ రమేష్ కు అభినందన

చిలకలూరిపేట, జూన్ 30, ప్రభాతవార్త: చిలకలూరిపేటపట్టణంలోని సుభాని నగర్‌లో పాలపర్తి నాగరాజు హత్య కేసులో ప్రధాన నిందితుడికి కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. చిలకలూరిపేట డైక్ మెన్ కాలనీకి చెందిన అక్కల చెంచయ్య తన భార్యతో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడనే కక్షతో, 2025 జనవరి 2న రాత్రి తన తమ్ముడి కుమారుడు అక్కల ప్రభుదాసుతో కలిసి నాగరాజును కత్తితో గొంతు కోసి దారుణంగా హత్య చేశాడు.



మృతుడి భార్య ఫిర్యాదు మేరకు అప్పటి చిలకలూరిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నరసరావుపేట 13వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో విచారణ జరగగా, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీవీఎస్ ప్రసాద్ సమర్థవంతంగా వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఎస్. రమేష్, ప్రధాన నిందితుడు అక్కల చెంచయ్యకు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ. 1,000 జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకుంటే అదనంగా ఒక నెల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని పేర్కొన్నారు. కాగా, ఈ కేసులో మరో నిందితుడైన అక్కల ప్రభుదాసుపై బాల నేరస్తుల కోర్టులో విచారణ కొనసాగుతోంది. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన సిఐ రమేష్ బాబు, ఏపీపీ జీవీఎస్ ప్రసాద్, ఎఎస్ఐ జె. శ్రీనివాసరావుతో పాటు కోర్టు కానిస్టేబుల్స్ బాలాజీ నాయక్, పి. రవీంద్ర, హోంగార్డ్ లక్ష్మోజీలను ఉన్నతాధికారులు అభినందించారు.

## పదవీ విరమణ సత్కారం



చిలకలూరిపేట, జూన్ 30, ప్రభాతవార్త: నాదెండ్ల గ్రామంలోని పార్వతి పరమేశ్వర కళ్యాణమండపం నందు మండల ఎంపిడిఓ కార్యాలయం నందు పనిచేస్తున్న అమరేశ్వరరావు పదవీ విరమణ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. ఆయన్ని దుస్సాలువతో సత్కరించి, 42 సంవత్సరాలుగా ప్రభుత్వ ఉద్యోగంలో ఉంటూ తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్న అమరేశ్వరావు సేవలను కొనియాడారు.

## ప్రజల్ని పీడిస్తున్న సమస్యలన్నీ... జగన్, వైసీపీ ప్రభుత్వ తప్పిదాలే : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూన్ 30, ప్రభాతవార్త: జగన్ అరాచకాలు, అవినీతి తాలూకా భూ సమస్యలు, రీసర్వే తప్పిదాలు కూటమి ప్రభుత్వానికి పెద్ద సవాల్ గా మారాయని, అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికల్లో (గ్రీవెన్స్) ఎక్కువగా గత ప్రభుత్వ తప్పిదాల ఫిర్యాదులే వస్తున్నాయని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. పట్టణంలోని వెంకటేశ్ గ్రాండ్





నందు, పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీమతి కృతికా శుక్లా, సంయుక్త కలెక్టర్ సంజనా సిన్హా ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం నిర్వహించిన పీ.జీ.ఆర్.ఎస్( గ్రీవెన్స్) లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి, కలెక్టర్ కృతికా శుక్లా, వివిధ శాఖల ప్రధానాధికారులు నేరుగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం చిలకలూరిపేట మండల పరిధిలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న క్లస్టర్ కరివేపాకు ప్రాసెసింగ్ యూనిట్ కు 2.20 కోట్ల రూపాయల నిధులు బ్యాంకు లోన్ ద్వారా అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనంతా ప్రజలకు సమస్యలు.. రాష్ట్రానికి అవినీతి. 2019లో వైసీపీ ప్రభుత్వం రావడమే ప్రజలకు ఎక్కడలేని తలనొప్పులు, రాష్ట్రానికి తిప్పలు తీసుకొచ్చిందని ప్రత్తిపాటి చెప్పారు. ఈనాడు ప్రజలకు ఇన్ని సమస్యలు, రాష్ట్రంలో కనీవినీ ఎరుగని అవినీతి, నియోజకవర్గంలో మాజీ అవినీతి మంత్రి దోపిడీ సమస్యలు ఉండేవి కాదని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. ప్రజల నుంచి వచ్చే భూ సమస్యల్లో ఎక్కువగా విస్తీర్ణం, 22ఏ 1సీ విజ్ఞప్తులే ఎక్కువగా ఉంటున్నాయన్నారు. భూమి తగ్గిన వారు సమస్య పరిష్కరమించమంటుంటే, ఎక్కువ



లేదా..తమ భూమి తమకున్న వారు అధికారులు పిలిచినా రావడం లేదన్నారు. ఈ సమస్యపై ముఖ్యమంత్రితో మాట్లాడతానని ప్రత్తిపాటి తెలిపారు. 22ఏ 1సీ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తాను.. 22ఏ 1 సీ భూ సమస్యల పరిష్కారానికి తాను మంత్రిగా ఉన్నప్పుడే పోరాడానని, 201419లో అప్పటి తమ ప్రభుత్వం దీనిపై కేబినెట్ తీర్మానం చేసి ఆమోదం కోసం రాష్ట్రపతికి పంపినట్టు ప్రత్తిపాటి చెప్పారు. జగన్ ఐదేళ్ల అధికారంలో ఉన్నా సమస్య పరిష్కరించకుండా, ప్రజల్ని మోసగించాడన్నారు. 22ఏ 1 సీ పరిష్కారమయ్యేవరకు ప్రభుత్వం దీన్ని వదిలిపెట్టదని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ప్రత్తిపాటి హామీ ఇచ్చారు. నివాసం ఉండండి..లేదా తిరిగివ్వండి. పేదల ఇళ్లు నిరుపయోగంగా ఉంటే ఎలా? టిడ్కోఇళ్ల లబ్ధిదారులు నివాసముండటమో, లేక ఇతరులకు అద్దెకు ఇవ్వడమో చేయాలని, నిరుపేదల కోసం కట్టిన ఇళ్లను దుర్వినియోగం చేయడం ఎంతమాత్రం మంచిదికాదని ప్రత్తిపాటి సూచించారు. ఇళ్లు అవసరం లేని వారు.. తమకు అక్కర్లేదని ప్రభుత్వానికి తెలియచేసి, వాటిని తిరిగిస్తే, గతంలో వారు చెల్లించిన సొమ్మును ప్రభుత్వం ద్వారా తిరిగి వెనక్కు ఇప్పించి, ఆ ఇళ్లను అర్హులైన ఇతరులకు కేటాయిస్తామని ఈ సందర్భంగా ప్రత్తిపాటి స్పష్టంచేశారు. ఆక్రమణలో ఉన్న కెల్లంపల్లి చెరువు, గంగమ్మ గుడి ప్రాంతాలకు చెందిన నకిలీ పట్టాలను రద్దుచేస్తామని, దీనిపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టారని ప్రత్తిపాటి చెప్పారు. నకిలీ పట్టాలు పుట్టించి, ప్రజల్ని మోసగించిన వారిపై చట్టపరమైన చర్యలుంటాయన్నారు. ఆక్రమించిన భూముల్లో ప్రజలకు ఉపయోగపడే నిర్మాణాలు చేపడతామని, చిలకలూరిపేటలో స్టేడియం ఏర్పాటుపై కలెక్టర్ తో మాట్లాడినట్టు ప్రత్తిపాటి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని, సమస్యలపై ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని ప్రత్తిపాటి భరోసా ఇచ్చారు. భూ సమస్యలే ఎక్కువగా ఉన్నాయి : కలెక్టర్ కృతికా శుక్లా ఒకనెలఒక నియోజకవర్గం కార్యక్రమంలో భాగంగా గత నెలలో పెదకూరపాడులో, ఈ నెలలో చిలకలూరిపేటలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీ.జీ.ఆర్.ఎస్) ఏర్పాటు చేసినట్టు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలతో, ఇకనుంచి ప్రతి శుక్రవారం ఏదో ఒక గ్రామంలో అన్నిశాఖల అధికారులు పీ.జీ.ఆర్.ఎస్ నిర్వహించి, సమస్యల్ని వేగంగా పరిష్కరించేలా చర్యలు చేపట్టినట్టు ఆమె చెప్పారు. నేటి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎక్కువగా భూ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు వచ్చాయని, అలానే ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల దరఖాస్తులు అందించారని, మొత్తం 180 కుపైగా అర్జీలు వచ్చాయని కలెక్టర్ పేర్కొన్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్టు ఆమె చెప్పారు. స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సహకారంతో ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యల్ని త్వరలోనే పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలలో ఉన్న అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

01-07pg10exHMNWJQE_01-07pg10exHMNWJQE.qxd 30/Jun/26 11:38 PM Page 1







# మరో సిరీస్‌కు సిద్ధమైన టీమిండియా

## * నేడు ఇంగ్లండ్‌తో తొలి టి20 మ్యాచ్ *వైభవ్‌కు ఛాన్స్? * రాత్రి 10 గం.కు ప్రారంభం

**చెస్టర్లీస్ట్రీట్(లండన్), జూన్ 30:** టీ20 ఛాంపియన్లు టీమిండియా మరో సిరీస్‌కు సిద్ధమైంది. ఐర్లాండ్‌తో టీ20 సిరీస్ ఓటమి నుంచి ఇంకా తేరుకోని శ్రేయాస్ సేన...ఇంగ్లాండ్‌తో 5మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనుంది.ఇందులో భాగంగా నేడు చెస్టర్లీస్ట్రీట్‌లో జరిగే తొలి టీ20 మ్యాచ్‌లో తలపడనుంది. పసికూన ఐర్లాండ్ చేతిలో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓటమిపాలై విమర్శలు ఎదుర్కొంటున్న మెన్ ఇన్ బ్లూ.. ఇంగ్లాండ్‌ను దాని సొంతగడ్డపై నిలువరిస్తుందా? అన్నది క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

**శ్రేయాస్ శకం**

శ్రేయాస్ అయ్యర్ సారథ్యంలో టీమిండియా తొలి మేజర్ సిరీస్ ఆడబోతోంది. ఇది కెప్టెన్‌గా శ్రేయాస్‌కు అసలు సిసలు పరీక్ష. తొలి సిరీస్‌లోనే ఓటమి ఎదుర్కొన్న శ్రేయాస్.. ఇంగ్లాండ్‌పై గెలుపుతో విమర్శలకు చెక్ పెట్టాలని చూస్తున్నాడు. తుది జట్టులో ఒకటి రెండు మార్పులతో బరిలోకి దిగడంపై ఫోకస్ పెట్టింది.

**వైభవ్ అరంగేట్రం?**

ఐర్లాండ్‌పై యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అరంగేట్రం చేస్తాడని అంతా భావించినా అది జరగలేదు. వైభవ్‌కు అవకాశం ఇవ్వకుండా విమర్శలపాలైన టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ ఇంగ్లాండ్‌పై కచ్చితంగా బేబీ బాస్‌ను ఆడించే అవకాశాలున్నాయి.తొలి టీ20లోనే వైభవ్ అరంగేట్రం ఉండటం ఖాయంగా కనిపిస్తోంది. ఐర్లాండ్‌పై విఫలమైన సంజు శాంసన్, ఇషాన్ కిషన్‌లో ఒకరిని బెంచ్‌కే పరిమితం చేసి అబిషేక్‌తో కలిసి వైభవ్‌ను ఓపెనింగ్‌కు పంపే ఛాన్స్ ఉంది. పేస్‌కు అనుకూలించే ఇంగ్లాండ్ పిచ్‌లపై ఎలా ఆడతాడన్నది ఉత్కంఠ రేపుతోంది. మరోవైపు ఇంగ్లాండ్... సొంతగడ్డపై పటిష్టంగా ఉంది. హ్యారీ బ్రూక్, బట్లర్, జోర్డాన్ కాక్స్, బెతెల్, విల్ జాక్స్, ఫిల్ సాల్ట్, బాంటన్ వంటి ఆటగాళ్లతో ఇంగ్లాండ్ బ్యాటింగ్ ఆర్డర్ బలంగా కనిపిస్తోంది. వీరిని అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, శివమ్ దూబె, ప్రిన్స్ యాదవ్‌లతో కూడిన పేస్ దళం ఎంతవరకు కట్టడి చేస్తుందన్న దానిపైనే టీమిండియా విజయావకాశాలు ఉన్నాయి.

**బౌలింగ్‌కు అనుకూలంగా..**

తొలి టీ20 మ్యాచ్ జరిగే చెస్టర్లీస్ట్రీట్ రివర్‌సైడ్ పిచ్ బౌలర్లకు అనుకూలిస్తుంది. ఇక్కడ గత ఎనిమిది మ్యాచ్‌ల్లో బౌలర్లదే ఆధిపత్యం. సగటు స్కోరు 138 కాగా.. అత్యధిక స్కోరు 195. ఈ మ్యాచ్ భారతకాలమానం ప్రకారం రాత్రి 10 గంటలకు మొదలుకానుంది.

**భారత్:** శ్రేయస్(కెప్టెన్), తిలక్(వైస్ కెప్టెన్), బిష్ణోయ్, అభిషేక్, సూర్యాంశ్, ప్రసిద్ధ్ కృష్ణ, శాంసన్, వైభవ్, అక్షర్, హర్షిత్, ఇషాన్ కిషన్, వాషింగ్టన్, అర్ష్‌దీప్, దూబె, ప్రిన్స్ యాదవ్.

# తొలి రౌండ్ గట్టెక్కిన సిన్నర్, జోకోవిచ్




**లండన్, జూన్ 30:** వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో టాప్ సీడ్లకు ఆరంభంలోనే చుక్కలు కనిపిస్తున్నాయి. పురుషుల ప్రపంచ నంబర్‌వన్ జానిక్ సిన్నర్ తొలి రౌండ్‌లోనే అయిదు సెట్ల హోరాహోరీ పోరు ఎదుర్కొని ఊపిరిపీల్చుకున్నాడు. అలాగే మరో అగ్రశ్రేణి ప్లేయర్ నోవాక్ జోకోవిచ్ కూడా మూడు గంటల పోరులో గెలిచి రెండో రౌండ్ చేరాడు.

పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో సిన్నర్ 4-6, 6-3, 6-7, 6-2, 6-3తో సెర్బియాకు చెందిన అన్‌సీడెడ్ మియోమిర్ కెమనోవిక్‌పై చెమటోడ్చి నెగ్గాడు. మూడున్నర గంటల పాటు జరిగిన ఐదుసెట్ల మ్యాచ్‌లో సిన్నర్ ఓ దశలో వెనుకబడి ఓటమి వైపు సాగాడు. తొలి సెట్‌లోనే సిన్నర్‌కు కెమనోవిక్ షాకిచ్చాడు. 6-4తో నెగ్గి శుభారంభం చేశాడు. రెండో సెట్‌ను సిన్నర్ నెగ్గి సమవుజ్జీగా నిలిచాడు. ఇక మూడో సెట్‌ను టై బ్రేక్‌లో కెమనోవిక్ గెలుచుకోవడంతో మ్యాచ్ హోరాహోరీగా సాగింది.అయితే నాలుగో సెట్‌లో వెనుకబడ్డ కెమనోవిక్ ఐదో సెట్‌లో తొలి గేమ్ గెలిచినప్పటికీ ఆతర్వాత పుంజుకోలేకపోయాడు. అయితే ఐదు సెట్ల దాకా పోరాడిన కెమనోవిక్ మాత్రం సిన్నర్‌కు ముచ్చెమటలు పట్టించాడు. ఇక రెండో రౌండ్‌లో సిన్నర్ పోర్చుగల్‌కు చెందిన నూనో బోర్జెస్‌తో తలపడనున్నాడు.

**సిన్నర్ దారిలోనే జోకోవిచ్**

ఇక మిగిలిన మ్యాచ్‌ల్లో నొవాక్ జోకోవిచ్, డానిల్ మెద్వెదెవ్, సిట్సిపాస్ తొలి రౌండ్‌లో నెగ్గి ముందంజ వేశారు. ఏడుసార్లు వింబుల్డన్ ఛాంపియన్ జోకోవిచ్.. ఈసారి టైటిల్ అందుకుని అత్యధిక వయస్సులో వింబుల్డన్ నెగ్గి ప్లేయర్‌గా రికార్డుపై గురిపెట్టాడు. అయితే తొలి రౌడ్‌లో అతనికి చైనా ప్లేయర్ వు గట్టిపోటీ ఇచ్చాడు. మూడు గంటలకు పైగా సాగిన ఈ పోరులో జోకోవిచ్ 6-4, 5-7, 6-4, 6-4తో చైనా ప్లేయర్‌ను ఓడించాడు.

**రెండో రౌండ్‌లో సబలెంకా**

ఇక మహిళల సింగిల్స్‌లో సీడెడ్ ప్లేయర్ అలవోక విజయాలతో ముందంజ వేశారు. నాలుగుసార్లు గ్రాండ్ స్లామ్ విజేత సబలెంకా 65 నిమిషాల్లో సెర్బియా క్వాలిఫయర్ కొస్టావిక్‌ను 6-2, 6-3తో ఓడించింది. రెండో రౌండ్‌లో అమెరికన్ మెక్‌కార్ట్నీ కెస్లర్‌తో తలపడనుంది. ఫ్రెంచ్ ఓపెన్ ఫైనలిస్ట్ మజా చాలిస్కాకు తొలి రౌండ్‌లోనే షాక్ తగిలింది. ఆమెపై 2-6, 7-5, 6-2తో థాయిలాండ్ అన్‌సీడెడ్ మనంచాయ సంచలన విజయం అందుకుంది.

# జర్మనీ, నెదర్లాండ్స్ పెనాల్టీ షూటౌట్

## ప్రిక్వార్టర్స్‌లో బ్రెజిల్, మొరాకో, పరాగ్వే




**కాలిఫోర్నియా, జూన్ 30:** సాకర్ వరల్డ్‌కప్‌లో సంచలనాల మోత మోగుతోంది. నాకౌట్ మ్యాచ్‌లు చివరి నిమిషాల వరకు ఉత్కంఠ రేపుతున్నాయి. హాట్ ఫేవరెట్లు జర్మనీ, నెదర్లాండ్స్‌లు పెనాల్టీ షూటౌటయ్యాయి. జర్మనీపై పరాగ్వే, నెదర్లాండ్స్‌పై మొరాకో పెనాల్టీ షూటౌట్‌లో గెలుపొంది ప్రి క్వార్టర్ ఫైనల్ చేరాయి. నాకౌట్ మ్యాచ్‌లో జపాన్‌పై బ్రెజిల్ 96వ నిమిషంలో గోల్ సాధించి ముందంజ వేసింది.

**జర్మనీ ఇంటిదారి :** ఫిఫా కప్‌లో మాజీ చాంపియన్ జర్మనీ ఆట ముగిసింది. ఐదోసారి ఫిఫా చాంపియన్‌గా నిలవాలని భావించిన జర్మనీకి పరాగ్వే చెక్ పెట్టింది. పెనాల్టీ షూటౌట్‌లో 4-3తో పరాగ్వే గెలుపొందింది. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన పోరులో నిర్ణీత సమయం ముగిసేలోపు ఇరుజట్లు 1-1తో సమంగా నిలిచాయి. జర్మనీ తరఫున ఆట 54వ నిమిషంలో కాయ్ హావెర్ట్జ గోల్ చేయగా, పరాగ్వే తరఫున 42వ నిమిషంలో జులియో ఎన్సియో గోల్ సాధించాడు. అదనపు సమయంలోనూ ఇరు జట్లు గోల్స్ చేయడంలో విఫలమవడంతో విజేతను తేల్చేందుకు పెనాల్టీ షూటౌట్ అనివార్యమైంది. 2018, 2022 ఫిఫా ప్రపంచకప్పుల్లో గ్రూప్ దశలోనే వెనుదిరిగిన జర్మనీ ఈసారి మాత్రం గ్రూప్ దశను దాటినప్పటికీ రౌండ్ ఆఫ్ 16ను దాటడంలో విఫలమయ్యింది.

**నెదర్లాండ్స్‌కు మొరాకో షాక్**

మరో మ్యాచ్‌లో మొరాకో సైతం నెదర్లాండ్స్‌కు అదే తరహాలో షాకిచ్చింది. నిర్ణీత సమయం, అదనపు సమయంలో ఇరు జట్లు చెరో గోల్ చేసి సమంగా నిలువగా.. పెనాల్టీ షూటౌట్‌లో మొరాకో పటిష్టమైన నెదర్లాండ్స్‌ను 3-2తో ఓడించి ప్రీక్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది.ఈ మ్యాచ్‌లో తొలుత ఆధిక్యం నెదర్లాండ్స్‌కే లభించింది. 72వ నిమిషంలో కోడి గాక్పో గోల్ చేసి తన జట్టుకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు.ఇంజరీ టైమ్ (91వ నిమిషం)లో ఇస్సా డియోప్ హెడ్డర్‌తో గోల్ చేసి స్కోరును 1-1తో సమం చేశాడు.దీంతో పెనాల్టీ షూటౌట్ నిర్వహించగా.. కీలక సమయంలో మొరాకో గోల్‌కీపర్ యాస్సిన్ బౌనో నెదర్లాండ్స్ ఆటగాడు క్రిసెన్సియో సమ్మర్‌విల్లే పెనాల్టీని అద్భుతంగా అడ్డుకున్నాడు. అనంతరం ఇస్మాయిల్ సైబారి తన కిక్‌ను గోల్‌గా మలిచి మొరాకోకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు.

## ఆసియా క్రీడలకు భారత్ ఉమెన్ టీమ్

**ముంబై, జూన్ 30:** జపాన్ వేదికగా సెప్టెంబర్‌లో జరిగే ఆసియా క్రీడల్లో పాల్గనే 15 మంది సభ్యుల భారత మహిళల క్రికెట్ జట్టును బిసిసిఐ ప్రకటించింది. కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్‌గా స్మృతి మంధాన వ్యవహరిస్తార. స్టార్ ప్లేయర్లు జెమీమా రోడ్రిగ్స్, షఫాలీ వర్మ, దీప్తి శర్మ, రిచా ఘోష్, రేణుకా సింగ్ తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. ఆల్‌రౌండర్ శ్రేయాంక ఫిట్‌నెస్ క్లియరెన్స్‌కు లోబడి ఎంపికైంది. యస్తికా భాటియా స్థానంలో 17 ఏళ్ల వికెట్ కీపర్ కమిలిని జట్టులోకి ఎంపికైంది. కమిలిని ఇటీవలి కాలంలో చక్కని ఆటతీరుతో ఆకట్టుకుంటోంది. తాజాగా టీ20 ప్రపంచకప్ నుంచి వైదొలిగిన భారత ఉమెన్ జట్టులో ఇదొక్కటే మార్పు. కాగా, ఆసియా క్రీడల్లో భారత్ మరోసారి టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది. హాంగ్‌ఝౌ వేదికగా జరిగిన గత క్రీడల్లో టీమిండియా స్వర్ణం గెలుపొందింది.

**భారత్ జట్టు:** హర్మన్‌ప్రీత్(కెప్టెన్), స్మృతి మంధాన,షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్‌కీపర్), కమలిని, భారతీ ఫుల్మాలి, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్, క్రాంతి గౌడ్, అరుంధతి రెడ్డి, శ్రేయాంక పాటిల్, రాధా యాదవ్, నందిని శర్మ.



## నేటి నుంచి జాగ్రెబ్ ర్యాపిడ్ చెస్ టోర్నీ

**జాగ్రెబ్(క్రొయేషియా), జూన్ 30:** జాగ్రెబ్ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నీలో భారత గ్రాండ్ మాస్టర్లు గుకేష్, ప్రజ్ఞానంద భారీ ఆశలతో బరిలోకి దిగుతున్నారు. నేడు జాగ్రెబ్‌లో ప్రారంభమయ్యే ఈ టోర్నీలో ప్రపంచ అత్యుత్తమ చెస్ ఆటగాళ్లు తలపడనున్నారు. ప్రపంచ నంబర్ వన్ మాగ్నస్ కార్ల్‌సెన్‌ను వెనక్కి నెట్టి నార్వే చెస్ టైటిల్ సాధించిన ప్రజ్ఞానంద... ఈ టోర్నీలోనూ హాట్ ఫేవరెట్‌గా ఉన్నాడు. ర్యాపిడ్ విభాగంలో 9 రౌండ్లు, బ్లిట్జ్‌లో 18 రౌండ్లు జరుగుతాయి. ర్యాపిడ్‌లో ప్రతి విజయానికి 2 పాయింట్లు, డ్రాకు ఒక పాయింట్ లభిస్తాయి. అదే బ్లిట్జ్‌లో విజయానికి ఒక పాయింట్, డ్రాకు అర పాయింట్ కేటాయిస్తారు. ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ గుకేష్ తిరిగి ఫామ్ చాటాలని చూస్తున్నాడు. విన్సెంట్ కీమర్(జర్మనీ), అనిష్ గిరి(హాలండ్), అలీరేజా ఫిరౌజా(ఫ్రాన్స్) రేటింగ్ పరంగా ఫేవరెట్లుగా బరిలోకి దిగుతున్నారు.




# రెండునెలల్లో ఆర్థిక లోటు 1.62 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ, జూన్ 30:** దేశ ఆర్థిక వ్యవస్థపై అంతర్జాతీయ పరిణామాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలల్లో కేంద్ర ప్రభుత్వ ఆర్థికలోటు రూ.1.62 లక్షల కోట్లకు చేరింది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరల పెరుగుదల, ప్రభుత్వ వ్యయాలు పెరగడం ఇందుకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ విడుదల చేసిన డేటానుచూస్తే 2026-27 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన మొత్తం ఆర్థికలోటు లక్ష్యంలో ఇప్పటివరకు 9.6 శాతం నమోదైంది. మే నెలాఖరు నాటికి ఫిస్కల్ డెఫిసిట్ రూ.1.62 లక్షల కోట్లుగా ఉంది. ఏప్రిల్ నెలలో నమోదైన రూ.3.62 లక్షల కోట్లతో పోలిస్తే మేలో లోటు తగ్గడం కొంత ఊరటనిచ్చే అంశంగా భావిస్తున్నారు. ఏప్రిల్‌లో అది వార్షిక లక్ష్యంలో 21.4 శాతానికి చేరగా మే నాటికి 9.6 శాతానికి తగ్గింది.

ఇరాన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరగడం ప్రభుత్వ ఆదాయం, వ్యయాల మధ్య అంతరాన్ని మరింత పెంచింది. ఈ పరిస్థితుల్లో విండ్‌ఫాల్ ట్యాక్స్ కింద విధించే స్పెషల్ అడిషనల్ ఎక్సైజ్ డ్యూటీని కేంద్ర ప్రభుత్వం తగ్గిస్తూ వస్తోంది.మే నెలలో నికర పన్నుల వసూళ్లు రూ.3.48 లక్షల కోట్లకు చేరాయి. ఇది వార్షిక లక్ష్యంలో 12 శాతం. మరోవైపు మౌలిక వసతుల అభివృద్ధికి చేసే మూలధన వ్యయం రూ.2.51 లక్షల కోట్లకు చేరి వార్షిక లక్ష్యంలో 20.5 శాతం నమోదైంది.ఏప్రిల్‌మే కాలంలో రెవెన్యూ డెఫిసిట్ కూడా గణనీయంగా తగ్గింది. ఏప్రిల్‌లో రూ.1.82 లక్షల కోట్లుగా ఉన్న రెవెన్యూ లోటు మే నాటికి రూ.68,985 కోట్లకు తగ్గింది. ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు, వడ్డీ చెల్లింపులు, సబ్సిడీలు వంటి ఖర్చులు రెవెన్యూ వ్యయంలో భాగంగా ఉంటాయి.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలల్లో కేంద్ర ప్రభుత్వ మొత్తం వ్యయం రూ.8.81 లక్షల కోట్లకు చేరింది. ఇది వార్షిక అంచనా వ్యయంలో 16.5 శాతం. ఇదే సమయంలో ప్రభుత్వ మొత్తం రాబడులు రూ.7.18 లక్షల కోట్లుగా నమోదై పూర్తి సంవత్సర లక్ష్యంలో 19.7 శాతానికి చేరుకున్నాయి. పన్నుల ద్వారా వచ్చే రెవెన్యూ ఆదాయం రూ.6.99 లక్షల కోట్లకు చేరగా పన్నేతర ఆదాయం ఇప్పటికే వార్షిక లక్ష్యంలో సగానికి పైగా చేరడం విశేషం. పన్నేతర ఆదాయం రూ.3.50 లక్షల కోట్లుగా నమోదైంది. ఇందులో డివిడెండ్లు, ప్రభుత్వ రంగ సంస్థల లాభాల రూపంలో వచ్చిన ఆదాయం రూ.2.89 లక్షల కోట్లుగా ఉంది.



# గ్రీస్‌లో యుపిఐ సేవలు

## లాంఛనంగా ప్రారంభించిన పీయూష్ గోయల్

**ఏథెన్స్,జూన్ 30:** యూపీఐ తన ప్రపంచ విస్తరణలో యూరప్ దేశమైన గ్రీస్‌లో అధికారికంగా సేవలు ప్రారంభించింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఈ సేవలను లాంఛనంగా ప్రారంభించారు. ఏథెన్స్‌లోని యూరోబ్యాంక్ ప్రధాన కార్యాలయంలో యూపీఐ ద్వారా లావాదేవీని ప్రత్యక్షంగా ప్రదర్శించారు. పీయూష్ మాట్లాడుతూ గ్రీస్‌లో యూపీఐ సేవలు అందుబాటులోకి రావడంతో అర్హులైన వినియోగదారులు తక్షణమే, అత్యంత సురక్షితంగా నగదు బదిలీ చేసుకోవచ్చని తెలిపారు.లావాదేవీల ఖర్చు దాదాపు నామమాత్రంగా ఉంటుందన్నారు. సరిహద్దులు దాటి విలువను సృష్టించడం, ఉమ్మడి వృద్ధి కోసం భాగస్వామ్యాలను పెంపొందించడం లక్ష్యంగా సాంకేతిక పరిష్కారాలను నిర్మించాలన్న ప్రధాని మోడీ దార్శనికతకు ప్రపంచవ్యాప్తంగా యూపీఐకి లభిస్తున్న ఆదరణ నిదర్శనమని గోయల్ పేర్కొన్నారు. తన గ్రీస్ పర్యటనలో భాగంగా గోయల్ యూరోబ్యాంక్ సీఈఓ ఫోకియోన్ కరావియాస్‌తో సమావేశమయ్యారు. భారత్‌గ్రీస్ ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత విస్తరించడంపై ఫలవంతమైన చర్చలు జరిపారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని గ్రీక్ వ్యాపారవేత్తలను ప్రోత్సహించిన ఆయన, గ్రీస్‌లో తయారీ మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధిలో సహకారానికి ఉన్న అవకాశాలను అన్వేషించారు. యూరోబ్యాంక్, ఎన్‌ఐపీఎల్ భాగస్వామ్యంతో ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఫెయిర్‌ఫాక్స్ డిజిటల్ సర్వీసెస్ సీఈఓ సంజయ్ తుగ్నైత్ కూడా పాల్గొన్నారు. భారత్‌ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వాణిజ్యం, పెట్టుబడులు,ఆర్థిక సహకారంలో కొత్త అవకాశాలను సృష్టిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత కంపెనీలతో చేతులు కలపాలని గ్రీక్ వ్యాపారవేత్తలకు ఆయన పిలుపునిచ్చారు. ఈ పర్యటన రెండు దేశాల మధ్య బలమైన వ్యాపార సంబంధాలకు, ఉమ్మడి శ్రేయస్సుకు మార్గం సుగమం చేస్తుందని పియూష్ గోయల్ విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఆర్ అండ్ డి కోసం కోల్ ఇండియా 1900 కోట్ల పెట్టుబడులు

**న్యూఢిల్లీ, జూన్ 30:** ప్రభుత్వ రంగ బొగ్గు దిగ్గజం కోల్ ఇండియా లిమిటెడ్ ఆర్‌అండ్‌డీ కార్యకలాపాలకు భారీగా పెట్టుబడులు పెడుతోంది. 2030 ఆర్థిక సంవత్సరం నాటికి సుమారు రూ.1,900 కోట్లను ఆర్‌అండ్‌డీ కోసం వెచ్చించనున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు తెలిపింది. గనుల తవ్వకాలను ఆధునికీకరించడం, పర్యావరణహిత సాంకేతికతలను అభివృద్ధి చేయడం, భవిష్యత్ ఇంధన అవసరాలకు అనుగుణంగా కొత్త టెక్నాలజీలను రూపొందించడం ఈ పెట్టుబడి ప్రధాన లక్ష్యాలుగా పేర్కొంది.2025 ఆర్థిక సంవత్సరంలో నేషనల్ సెంటర్ ఫర్ కోల్ అండ్ ఎనర్జీ రీసెర్చ్ ఏర్పాటు ద్వారా కంపెనీ పరిశోధన కార్యక్రమాలకు కొత్త ఊపు లభించిందని తెలిపింది. ఈ కేంద్రం ద్వారా పరిశోధనలను ప్రాథమిక స్థాయి నుంచి సాంకేతిక నమూనాల అభివృద్ధి దశకు తీసుకెళ్తున్నట్లు వెల్లడించింది.కంపెనీ భవిష్యత్ వృద్ధి, సాంకేతిక పరివర్తనకు పరిశోధన, అభివృద్ధి కీలకమని కోల్ ఇండియా సీనియర్ అధికారి తెలిపారు. 2024 ఆర్థిక సంవత్సరంలో రూ.61 కోట్లుగా ఉన్న ఆర్‌అండ్‌డీ వ్యయం,2025లో నాలుగు రెట్లు పెరిగి రూ.245 కోట్లకు చేరిందని కంపెనీ వెల్లడించింది. పరిశోధనలకు మరింత ప్రాధాన్యం కల్పించేందుకు ప్రత్యేక ఆర్‌అండ్‌డీ విధానాన్ని కూడా అమల్లోకి తీసుకొచ్చింది.



పరిశ్రమ-విద్యాసంస్థల భాగస్వామ్యంలో భాగంగా ప్రముఖ ఐఐటీల్లో మూడు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఎన్‌సిసిఇ పర్యవేక్షణలో రూ.225 కోట్ల వ్యయంతో 19 పరిశోధనప్రాజెక్టులు కొనసాగుతున్నాయి.సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో మరో 13 పరిశోధన ప్రాజెక్టులు అమల్లో ఉన్నాయి. అంతర్జాతీయ సాంకేతిక భాగస్వామ్యాలను కూడా కోల్ ఇండియా విస్తరించింది. కెనడాకు చెందిన ఎర్గో ఎక్సెర్జీతో భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్, స్వీడన్‌కు చెందిన ఎరిక్సన్తో జాంగ్రూ భూగర్భ గనిలో 5జీసాంకేతికత అమలు,ఆస్ట్రేలియాకు చెందిన సీఎస్‌ఐఆర్‌ఓతో సంయుక్త పరిశోధన కార్యక్రమాలను చేపడుతోంది.



## రెండోరోజూ నష్టాలకే పరిమితం

## సెన్సెక్స్, నిఫ్టీల్లో ఐటి షేర్ల ఒత్తిడి

**ముంబయి,జూన్ 30:** ఐటిరంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడితో మంగళవారం సెన్సెక్స్, నిఫ్టీలు నష్టాల్లోనే ముగిసాయి. ట్రేడింగ్‌లో బీఎస్ఈ సెన్సెక్స్ 249 పాయింట్లు పడిపోయి 76,478వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 80 పాయింట్లు క్షీణించి 23,865 వద్ద స్థిరపడింది. వరుసగా రెండో రోజు కూడా ప్రధాన సూచీలు నష్టాలను నమోదు చేశాయి.ఐటీ దిగ్గజాలు టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లు మూడు శాతానికి చేరువలో పతనంకావడం మార్కెట్‌పై తీవ్రప్రభావం చూపింది. ఐసీఐసీఐ బ్యాంక్ షేరు కూడా క్షీణించింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.45 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.51 శాతం లాభపడగా మార్కెట్‌లో పెరిగిన షేర్ల సంఖ్య తగ్గిన షేర్ల కంటే ఎక్కువగా నమోదైంది. డాలరుతో రూపాయి మారకం విలువలు 94.65వద్ద నిలిచాయి. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు రూ.1,42,532కి చేరాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురు జులై సెటిల్‌మెంట్‌దరలు పదిసెంట్లుపెరిగి బ్యారెల్‌కు 73.25గా నమోదయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్ల విషయానికి వస్తే యూరోపియన్ మార్కెట్లు లాభాల్లో ట్రేడయ్యాయి. చైనా తయారీ రంగం మళ్లీ వృద్ధి బాట పట్టడంతో ఆసియా మార్కెట్లు మిశ్రమ ధోరణి కనబర్చాయి. అమెరికా ఫ్యూచర్స్ కూడా సానుకూల సంకేతాలు ఇచ్చాయి. ఢిల్లీ ప్రభుత్వం ఈవీ పాలసీకి ఆమోదం తెలపడంతో ఐషర్ మోటార్స్ షేరు 4.38 శాతం పడిపోయింది. ఈ పాలసీతో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల వినియోగం వేగంగా పెరుగుతుందనే అంచనాల నేపథ్యంలో కంపెనీపై అమ్మకాల ఒత్తిడి కనిపించింది. మరోవైపు అదానీపోర్ట్స్ దాదాపు 2శాతం లాభపడింది.విజింజం పోర్టులో 49శాతం వాటాను ఎంఎస్‌సీ గ్రూప్‌కొనుగోలు చేయనున్న ఒప్పందం ఇందుకు కారణమైంది.శిల్పా మెడికేర్, గోద్రేజ్ ప్రాపర్టీస్, వారీ ఎనర్జీస్, కల్పతరు ప్రాజెక్ట్స్, కేఈసీ ఇంటర్నేషనల్, జాగ్సన్‌పాల్ ఫార్మాస్యూటికల్స్, గోదావరి బయోరిఫైనరీస్ కంపెనీల షేర్లు కూడా లాభాలతో ముగిశాయి. ఆస్థా స్పిన్‌టెక్స్ ఐపీఓకు మంచి స్పందన లభించింది.చివరి గణాంకాల ప్రకారం ఈ ఇష్యూ 1.48 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఈనెల 29న ప్రారంభమైన ఈ ఐపీఓ జూలై 1న ముగియనుంది.మొత్తంగా ఐటీ రంగంలో అమ్మకాల ఒత్తిడి కారణంగా ప్రధానసూచీలు నష్టాల్లోముగిసినా మిడ్,స్మాల్‌క్యాప్ కొనుగోళ్లు కొనసాగడం పెట్టుబడిదారుల్లో ఆసక్తిని సూచించింది.

## పెట్రోకెమికల్ దిగుమతులపై కస్టమ్స్ మినహాయింపు

## జూలై 15 వరకు పొడిగింపు

**న్యూఢిల్లీ,జూన్ 30:** పెట్రోకెమికల్ ముడి పదార్థాల దిగుమతులకు సంబంధించిన కస్టమ్స్ డ్యూటీ మినహాయింపును కేంద్ర ప్రభుత్వం జూలై 15 వరకు కొనసాగించాలని నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది.ఈ మినహాయింపును తొలుత ఏప్రిల్ 2న తాత్కాలిక చర్యగా అమల్లోకి తీసుకువచ్చారు.జూన్ 30తో ఈ గడువు ముగుస్తుండగా ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మరో 15 రోజుల పాటు పొడిగించారు. ఈ నిర్ణయంతో ప్యాకేజింగ్, ప్లాస్టిక్స్, వస్త్ర పరిశ్రమ, ఔషధ తయారీ, రసాయన పరిశ్రమ, ఆటోమొబైల్ విడిభాగాల తయారీతో పాటు పలు తయారీ రంగాలకు ఊరట లభించనుంది. పెట్రోకెమికల్ ముడి పదార్థాల సరఫరా అంతరాయం లేకుండా కొనసాగడంతో పాటు ఉత్పత్తి వ్యయాలపై ఒత్తిడి కూడా తగ్గే అవకాశం ఉంది.మినహాయింపు పొందిన ఉత్పత్తుల్లో మెథనాల్, అన్హైడ్రస్ అమోనియా, టోల్యూయిన్, స్టైరిన్, డైక్లోరోమీథేన్, వినైల్ క్లోరైడ్ మోనోమర్, పాలీబ్యూటాడైన్, స్టైరిన్‌బ్యూటాడైన్, అన్‌సాచ్యురేటెడ్ పాలిస్టర్ రెసిన్స్ వంటి కీలక పెట్రోకెమికల్ ఉత్పత్తులు ఉన్నాయి.దేశీయ పరిశ్రమలకు అవసరమైన ముడి పదార్థాలు నిరంతరంగా అందుబాటులో ఉండేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుంది.

## డాయిచ్ బ్యాంక్ వాటా కొనుగోలు చేసిన కోటక్




**ముంబయి,జూన్ 30:** జర్మనీకి చెందిన ప్రముఖ బ్యాంకింగ్ సంస్థ డాయిచ్ బ్యాంక్ భారత్‌లోని తన రిటైల్ బ్యాంకింగ్, వెల్త్ మేనేజ్‌మెంట్ వ్యాపారాన్ని కోటక్ మహీంద్రా బ్యాంక్‌కు విక్రయించనున్నట్లు ప్రకటించింది. కార్యకలాపాలను సరళీకృతం చేయడం, మూలధనాన్ని మరింతసమర్థవంతంగా వినియోగించుకోవడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు డాయిచ్ బ్యాంక్ తెలిపింది. డాయిచ్ బ్యాంక్ వెల్లడించిన వివరాల ప్రకారం ఈ వ్యాపార విభాగంలో సుమారు వెయ్యి మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. దాదాపు 2.7 బిలియన్ యూరోల విలువైన రుణాల పోర్ట్‌ఫోలియో ఉండగా సుమారు లక్షా యాభై వేల మంది ఖాతాదారులకు సేవలు అందిస్తోంది.ఈ ఒప్పందంతో తమ వ్యాపారాన్ని మరింత సరళీకృతం చేసుకుని ప్రధాన బలాలపై దృష్టి సారించడం ద్వారా లాభదాయకతను పెంచుకోవచ్చని డాయిచ్ బ్యాంక్ బోర్డు సభ్యుడు క్లాడియో డి సాంక్టిస్ తెలిపారు. గత ఏడాదే భారత్‌లోని ఈ రిటైల్ బ్యాంకింగ్, వెల్త్ మేనేజ్‌మెంట్ వ్యాపారాన్ని విక్రయించేందుకు దేశీయ, విదేశీ బ్యాంకుల నుంచి డాయిచ్ బ్యాంక్ బిడ్లను ఆహ్వానించినట్లు వెల్లడించింది.ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలుస్తున్నప్పటికీ అధిక సంపన్నుల సంఖ్య పెరుగుతున్నా స్థానిక బ్యాంకుల నుంచి తీవ్రమైన పోటీ, నియంత్రణ పరమైన నిబంధనల కారణంగా విదేశీ బ్యాంకులు ఆశించిన స్థాయిలో ఆదాయాన్ని పెంచుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14